RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com




# వుదయం




గుంటూరు 13-08-2026 గురువారం | సంపుటి : 13 | సంచిక : 151 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

### ఆర్మీ నియామకాల్లో

## తెలంగాణ యువతకు ప్రత్యేక శిక్షణ



**హైదరాబాద్, ఆగస్టు 12 (వుదయం) :** భారత సాయుధ దళాల నియామకాల్లో తెలంగాణ యువత ప్రాతినిధ్యం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఆర్మీ చేపట్టే వివిధ రిక్రూట్‌మెంట్లలో స్థానిక యువతకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు, వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ (బోధి పెవిలియన్)లో ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌ఇన్‌చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ ఆధ్వర్యంలోని సైనిక ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మర్యాదపూర్వకంగా సమావేశమైంది. రాష్ట్ర నీటిపారుదల, సమాచార శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. జిల్లాల్లో ముందస్తు శిక్షణా కేంద్రాలు ఆర్మీ నియామకాల్లో తెలంగాణ యువతకు భారీగా అవకాశాలు లభించేలా అనువైన జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం కోరారు. దీనిపై స్పందించిన లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్, రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాల్లో ముందస్తు (ప్రీరిక్రూట్‌మెంట్) శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా జరిగే ఆర్మీ ర్యాలీలలో స్థానిక యువత రాణించేలా ఈ కేంద్రాల ద్వారా శిక్షణ ఇస్తామని హామీ ఇచ్చారు. విపత్తుల వేళ ఆర్మీ క్రియాశీలక పాత్ర దేశంలో అత్యవసర, విపత్తు పరిస్థితుల్లో భారత సైన్యం అందిస్తున్న సేవలను సీఎం కొనియాడారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల సమయంలో రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించడం, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యలు చేపట్టడంలో ఆర్మీ మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. దీనిపై స్పందించిన సైనిక అధికారులు, తెలంగాణలో విపత్తుల సమయాల్లో తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టేలా స్థానిక ఆర్మీ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు ఇస్తామని తెలిపారు. మూసీ ప్రక్షాళనకు సైన్యం ప్రశంసలు నగరంలో కాలుష్యాన్ని నివారించడంతో పాటు హైదరాబాద్ చారిత్రక వైభవానికి జీవం పోసేలా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు'పై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ హర్షం వ్యక్తం చేశారు. నగర పరిరక్షణకు మూసీ ప్రక్షాళన అత్యంత ఆవశ్యకమని పేర్కొంటూ ప్రభుత్వాన్ని అభినందించారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస్ రావుతో పాటు ఇతర ఉన్నత స్థాయి సైనిక అధికారులు పాల్గొన్నారు.



# గోదావరి జలాలను గరిష్టంగా ఎత్తిపోయాలి

## బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులు నింపడమే లక్ష్యం!



**హైదరాబాద్, ఆగస్టు 12 (వుదయం) :** గోదావరి నదిలో లభ్యమయ్యే జలాలను గరిష్ట స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా వీలైనంత ఎక్కువ నీటిని మళ్లించి ఆయకట్టుకు అందించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నీటిపారుదల శాఖపై మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో కలిసి సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. దేవాదుల, సీతారామ ఎత్తిపోతలకు ప్రాధాన్యం దేవాదుల ప్రాజెక్టు పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఒకేసారి 9 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశంలో వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, దేవాదుల మరియు సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసే క్రమంలో ఏవైనా చిన్నచిన్న సమస్యలు ఎదురైతే, అధికారులు తక్షణమే దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని సూచించారు.

**పరిహారం చెల్లింపులు పూర్తిచేస్తేనే 'బస్వాపూర్, గౌరవెల్లి'కి నీళ్లు**

వివిధ ప్రాజెక్టుల కింద ఒకటి రెండు గ్రామాలు, కొంతమేర వ్యవసాయ భూములకు సంబంధించి పునరావాసం, పరిహారం (R&R) అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. నీటిపారుదల, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారానికి సంబంధించిన వాస్తవ పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. తక్షణ ప్రభావం ఉన్న గ్రామాలకు పరిహారం చెల్లిస్తే.. బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయిలో నీరు నింపేందుకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు.

**గట్టు, గూడెందొడ్డి సామర్థ్యం పెంపుపై అధ్యయనం**

పాలమూరు ప్రాంతంలోని గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల పథకాల నీటి పంపింగ్ సామర్థ్యాన్ని పెంచే అంశంపై సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. అలాగే, గూడెందొడ్డి వద్ద తలపెట్టిన పంప్ స్టోరేజీ ప్రాజెక్టు రూపకల్పనకు సంబంధించి అనుభవజ్ఞులైన కన్సల్టెంట్‌ను వెంటనే నియమించాలని సూచించారు.

**ఎన్‌డీఎస్ఏ ఆదేశాల ప్రకారమే బ్యారేజీల నిర్వహణ**

జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలు, మార్గదర్శకాలను అనుసరించే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో ప్రస్తుతం నీటిని నిల్వ చేయడం లేదని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎన్డీఎస్ఏ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని చెప్పారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ పలు నిర్మాణాత్మక లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి వివరించగా, నిరంతరం ఎన్డీఎస్ఏతో సంప్రదింపులు జరుపుతూ తగిన చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

## రీల్స్‌కే పరిమితం కాకండి

## కెరీర్‌పై దృష్టి పెట్టండి



**న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఎఎంఎస్) :** జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు విజయానికి షార్ట్‌కట్‌లు (లఘుమార్గాలు) వెతుక్కోవద్దని, అలా వెంపర్లాడితే తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని 'జెన్‌జీ' యువతను ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. భవిష్యత్తులో ముందుకు సాగే క్రమంలో ఎల్లప్పుడూ అర్థవంతమైన, సరైన మార్గాలనే ఎంచుకోవాలని హితవు పలికారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ పుస్తక విడుదల కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. రైల్వే బోర్డుల ఉదాహరణతో జీవిత పాఠం కొందరు వ్యక్తులు వేగంగా గమ్యాన్ని చేరుకోవాలనే తొందరలో ఫుట్‌బ్రిడ్జిలను వాడకుండా, ప్రమాదకర రీతిలో రైల్వే ట్రాక్‌లను దాటుతుంటారని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాంటి వారిని హెచ్చరిస్తూ రైల్వే స్టేషన్లలో ప్రదర్శించే బోర్డులు కేవలం ప్రయాణానికే కాకుండా, మానవ జీవితానికి కూడా ఎంతో గొప్ప పాఠాలను నేర్పుతాయని వ్యాఖ్యానించారు. రీల్స్ వద్దు.. ఆత్మకథలు చదవండి "మన ఆలోచనా సరళిపై ప్రభావం చూపే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ పట్ల యువత అత్యంత జాగ్రత్తగా ఉండాలి. మీరు జీవితంలో నిజంగా ఉన్నత స్థాయికి వెళ్లాలని భావిస్తే.. మీరు ఆరాధించే, స్ఫూర్తిగా తీసుకునే గొప్ప వ్యక్తుల ఆత్మకథలను చదవడం అలవాటు చేసుకోండి" అని ప్రధాని పిలుపునిచ్చారు.

**యువతకు చేరువవుతూనే.. కెరీర్‌పై హెచ్చరిక**

ఇటీవలి కాలంలో ప్రధాని మోదీ జెన్‌జీ యువతతో మమేకమయ్యేందుకు తమ సోషల్ మీడియా శైలిలో గణనీయమైన మార్పులు తెచ్చారు. ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్ఫీ వీడియోలు పోస్ట్ చేస్తూ, నేటి తరం యువత మాట్లాడే భాషలోనే కనెక్ట్ అవుతున్నారు. అయితే, కేవలం సోషల్ మీడియా రీల్స్ చూడటానికే ప్రాధాన్యమివ్వకుండా, యువత తమ భవిష్యత్తు, కెరీర్ నిర్మాణంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని మోదీ స్పష్టం చేశారు.

# ట్రంప్ తీవ్ర హెచ్చరిక

## నౌకకు 4 మిలియన్ డాలర్లు!



**వాషింగ్టన్:** మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్‌తో జరుగుతున్న దౌత్య చర్చలపై తమకు ఎంతమాత్రం నమ్మకం లేదని, ఆ దేశం నిరంతరం అసత్యాలు చెబుతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన హర్మూజ్ జలసంధి ప్రస్తుతం పూర్తిగా తమ సైనిక అధీనంలోనే ఉందన్న ఆయన, ఇరాన్ ఏ క్షణంలోనైనా దుందుడుకు చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. కార్గో నౌకపై హెల్‌ఫైర్ క్షిపణుల దాడి మాటల హెచ్చరికలకే పరిమితం కాకుండా అమెరికా సైన్యం రంగంలోకి దిగింది. హర్మూజ్ జలసంధి పరిధిలోని ఒమన్ సముద్ర తీర సమీపంలో ప్రయాణిస్తున్న ఒక వాణిజ్య నౌకపై యూఎస్ సెంట్రల్ కమాండ్ దాడికి తెగబడింది. ఇరాన్ రేవులపై తమ సైన్యం విధించిన దిగ్బంధనాన్ని ఉల్లంఘించిందనే కారణంతో పనామా జెండాతో వెళ్తున్న 'వేలా నోవా' అనే కార్గో నౌకపై నేవీ హెలికాప్టర్ ద్వారా రెండు 'హెల్‌ఫైర్' క్షిపణులను ప్రయోగించింది. ఈ క్షిపణి దాడి వల్ల నౌకలోని సిబ్బందికి ఎంతమేర నష్టం జరిగిందనే వివరాలను అమెరికా వర్గాలు అధికారికంగా బయట పెట్టలేదు.

**పనామా కాలువ వద్ద నౌకల భారీ నిలిచివేత**

హర్మూజ్ జలసంధి ప్రాంతంలో సైనిక చర్యలు, ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ వాణిజ్య నౌకలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాయి. దీని ప్రభావంతో పనామా కాలువ (Panama Canal) గుండా వెళ్లే నౌకల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. మరోవైపు ఎల్‌నినో ప్రభావం వల్ల పనామా కాలువలో నీటి మట్టాలు గణనీయంగా తగ్గిపోవడం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఒక్కో నౌకకు \$4 మిలియన్ల రుసుము రద్దీకి తోడు నీటిమట్టం తగ్గడంతో ప్రయాణ నియంత్రణలు కఠినతరం కాగా, పనామా కెనాల్ అథారిటీ ఒక్కో భారీ వాణిజ్య నౌక నుంచి ఏకంగా 4 మిలియన్ డాలర్లు (సుమారు ₹33 కోట్లకు పైగా) వసూలు చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి.

### సిరిసిల్ల ఘటన వెనుక

## పెద్ద తలకాయలు




**సిరిసిల్ల, ఆగస్టు 12 (వుదయం) :** కాంగ్రెస్ నాయకుల చేతిలో దారుణంగా హత్యకు గురైన నేత కార్మికుడు వెంగళ వెంకటేశం కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం పరామర్శించారు. వెంకటేశం అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, శోక సంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

**పాప కన్నీళ్లు గుండెను ద్రవింపజేస్తున్నాయి**


అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "ఐదో తరగతి చదువుతున్న చిన్నారి ప్రసన్న, చిల్లర రాజకీయాల కారణంగా ఈ రోజు తండ్రిని కోల్పోయింది. 'మా నాన్న రాలేదు.. మూడు రోజులుగా నేను ఏమీ తినలేదు' అని ఆ పాప ఏడుస్తూ చెబుతుంటే మనసున్న ప్రతి ఒక్కరి గుండె ద్రవిస్తుంది. రాజకీయ లబ్ధిపొందడానికి, ప్రత్యర్థులను బద్నాం చేయడానికి మనుషుల ప్రాణాలు తీసేంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఒక సాధారణ కుటుంబాన్ని అనాథగా మార్చేశారు" అని మండిపడ్డారు.

**20 ఏళ్ల రాజకీయాల్లో ఇలాంటి దరిద్రం చూడలేదు**

తన 20 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నడూ ఇంతటి నీచమైన, దరిద్రపుగొట్టు రాజకీయాన్ని చూడలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. "మమ్మల్ని రాజకీయంగా ఎదుర్కోవాలనుకుంటే ఎన్నికల బరిలో తేల్చుకోండి.. విమర్శలు చేయండి.. లేదంటే అక్రమ కేసులు పెట్టి వేధించండి. కానీ, ఇలా అమాయక సామాన్యులను సమిధలుగా చేసి, బలిపశువులుగా మార్చి వాళ్ల కుటుంబాలను ఆగం చేస్తే మీకు ఏమి వస్తుంది?" అని కాంగ్రెస్ నాయకులను నిలదీశారు.




## ఇంతే కదా...!




### ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై

## వెనక్కి తగ్గిన కేంద్రం

**వాషింగ్టన్:** లోక్‌సభలో ఇటీవల ప్రవేశపెట్టిన విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (FCRA) సవరణ బిల్లుపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ప్రతిపాదిత బిల్లులోని నిబంధనలను సమగ్రంగా పరిశీలించే నిమిత్తం దానిని 'సంయుక్త పార్లమెంటరీ కమిటీ' (JPC)కి పంపాలని నిర్ణయించింది. ప్రభుత్వం సభ ముందుకు తెచ్చిన ఈ ప్రతిపాదన తీర్మానానికి లోక్‌సభ ఆమోదం తెలిపింది.

**31 మందితో జేపీసీ కమిటీ**

బిల్లును సమీక్షించేందుకు ఏర్పాటు చేయనున్న ఈ జేపీసీలో మొత్తం 31 మంది పార్లమెంట్ సభ్యులు భాగస్వాములు కానున్నారు. వీరిలో 21 మంది లోక్‌సభ సభ్యులు కాగా, 10 మంది రాజ్యసభ సభ్యులకు చోటు కల్పించనున్నారు.


**మైనారిటీలు, ఎన్జీవోలను దెబ్బతీసే కుట్ర: విపక్షాలు**

విదేశీ విరాళాల సవరణ బిల్లును కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్షాలన్నీ ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. దేశంలోని మైనారిటీ వర్గాలు, లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థలను (NGOs) లక్ష్యంగా చేసుకుని వేధించడానికే కేంద్రం ఈ కఠిన నిబంధనలను తెరపైకి తెచ్చిందని ఆరోపిస్తూ, బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కూడా మాట్లాడుతూ, విపక్షాలన్నీ ఏకతాటిపై నిలిచి ఈ సవరణను అడ్డుకుంటాయని వెల్లడించారు. విపక్షాల ఆరోపణలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా ఖండించారు. ఈ బిల్లు విషయంలో విపక్షాలు అనవసర రాజకీయం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. దేశంలోకి వచ్చే విదేశీ నిధులపై పక్కా చట్టపరమైన నిఘా, నియంత్రణ లేకపోతే దేశ భద్రతకే ముప్పు వాటిల్లుతుందని స్పష్టం చేశారు.

# ఘోర రోడ్డు ప్రమాదాలు ఎనిమిది మంది మృతువాత

- "తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన జహీరాబాద్ అసెంబ్లీ నాయకులు కే ప్రసాద్ రెడ్డి"
- "తన వంతు ఆర్థిక సహాయం చేస్తానని ప్రకటించిన,నేత "
- "ప్రభుత్వం వెంటనే మృతుల కుటుంబాలకు ఆదుకోవాలని వినతి"

**కోహీర్ ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి )**




సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో రెండు ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి.ఉపాధి పనుల కోసం వెళ్తున్న కూలీల ఆటోను సత్వర్ వద్ద వేగంగా వచ్చిన ట్యాంకర్ ఢీకొట్టింది.
ఈ ఘోర ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.
మరొక ప్రమాదంలో కోహీర్ మండలం వెంకటాపూర్ చౌరస్తా డివైడర్ అవతలి వైపు నుండి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు.ఈ రెండు వేర్వేరు ఘటనల్లో మొత్తం ఎనిమిది మంది నిరుపేదలు ప్రాణాలు విడిచారు.ఒకే రోజు రెండు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది చనిపోవడంతో ఆయా గ్రామాల్లో విషాదం అలముకుంది.ఈ ఘోర ప్రమాద ఘటనలపై జహీరాబాద్ కాంగ్రెస్ నాయకులు కె. ప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ప్రమాదంలో మృతి చెందిన నిరుపేదల కుటుంబ సభ్యులకు వారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ప్రాణాలు కోల్పోయిన పేద కూలీల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే మానవీయ కోణంలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తగిన రీతిలో నష్టపరిహారం మరియు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ సహాయంతో పాటు తన వంతు బాధ్యతగా మృతుల కుటుంబాలకు వ్యక్తిగత సాయం చేస్తానని మాటిచ్చారు.
క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని ప్రభుత్వాని ప్రసాద్ రెడ్డి కోరారు.ఇలాంటి విషాద సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రమాదాల నివారణకు రహదారులపై వేగ పరిమితి మరియు భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్నారు.వాహనదారులు ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉంటూ భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు.అతివేగమే ప్రమాదాలకు ప్రధాన కారణమని, జాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు.

# గ్రూప్స్, బ్యాంకింగ్, SSC, RRB, పోలీస్ పరీక్షలకు ఉచిత కోచింగ్

**సంగారెడ్డి, ఆగస్టు 12:వుదయం**

బీసీ స్టడీ సర్కిల్ సంగారెడ్డిలో గ్రూప్ 1,2,3,4, బ్యాంకింగ్, SSC, RRB, పోలీస్ నియామక పరీక్షలకు 125 రోజుల ఉచిత ఫౌండేషన్ కోచింగ్ అందించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎ. జగదీష్ తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 14. కోచింగ్ ఆగస్టు 25 నుంచి ప్రారంభమవుతుంది. ఎంపికైన అభ్యర్థులకు నిబంధనల మేరకు నెలకు రూ.1,000 స్టైఫండ్ అందజేస్తారు.
దరఖాస్తులు: www.tgbcstudycircle.cgg.gov.in
వివరాలకు: 08455277015, 9494390803.

# శ్రీ భగలాముఖి శక్తి పీఠంలో ప్రత్యేక పూజలు

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 12....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీ భగలాముఖి శక్తిపీఠం లో ఆషాఢ అమావాస్య పురస్కరించుకొని శ్రీ భగలాముఖి అమ్మవారి అనుగ్రహంతో బ్రహ్మశ్రీ శ్రీ భగలాముఖి ఉపాసకులు. శక్తిపీఠం వ్యవస్థాపకులు శాస్త్రల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో తలదాత ప్రముఖ సంఘ సేవకులు పబ్బ స్వరూప రమేష్ గుప్తా. పబ్బా స్వాతి మహేష్‌గుప్తా. నేడు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి క్షీరాభిషేకం మహా పూజ. మహా మంత్ర హవనం. హరిదార్చన. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ ఈ మహత్తరమైన శక్తిపీఠంలో ఏదో ఒక మహిమ ఉంది అని మేము మొక్కుకున్న మొక్కులు నెరవేరడం. అనుకున్నది సాఫీగా నడవడం ఈ శక్తిపీఠంలో కొలువుదీరిన భగలాముఖి అమ్మవారి కుబేనని వారు తెలిపారు. ఇక్కడ విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు. గ్రామస్తులు గ్రామ సర్పంచ్ వెంకటేష్. కొండల్. లక్ష్మీ నరసయ్య. పోచ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ ఉత్తర్వులకు విరుద్ధంగా బార్ యాజమాన్యాలు?

- అధిక సంపాదనే లక్ష్యంగా నిబంధనలకు తూట్లు.
- తూతూమంత్రంగా తనిఖీలు..
- ఆధారాలతో ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు – ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా: సామాజిక కార్యకర్త పబ్బతి సంతోష్ కుమార్

**జహీరాబాద్: ఆగస్టు 12 (వుదయం )**



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఎక్సైజ్ పాలసీ, శాఖ నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా జహీరాబాద్ పట్టణంలోని కొన్ని బార్ యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సితార రెస్టారెంట్ అండ్ బార్కు సంబంధించి నిబంధనల ఉల్లంఘన జరుగుతోందంటూ సామాజిక కార్యకర్త పబ్బతి సంతోష్ కుమార్ ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు.
బార్‌లకు కేటాయించిన మద్యం స్టాక్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాలకు తరలించడం, అనధికారిక విక్రయ కేంద్రాలకు మద్యం చేరడం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు. ఈ వ్యవహారానికి సంబంధించి తమ వద్ద ఉన్న ఆధారాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

**"ప్రభుత్వ ఆదాయం కంటే నిబంధనలు ముఖ్యం"**

సామాజిక కార్యకర్త పబ్బతి సంతోష్ కుమార్ మాట్లాడుతూ:
"ప్రభుత్వం ఎక్సైజ్ పాలసీని రూపొందించింది అంటే దాని వెనుక ప్రజా ప్రయోజనం, ప్రభుత్వ ఆదాయం, అక్రమ మద్యం నియంత్రణ వంటి అనేక అంశాలు ఉంటాయి. లైసెన్స్ పొందిన ప్రతి బార్ యాజమాన్యం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. కానీ తప్పు జరిగితే చర్యలు తీసుకోవడం, తప్పు జరగకపోతే వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం అధికారుల బాధ్యత. ఈ వ్యవహారంపై స్థానిక అధికారులతో పాటు ఉన్నతాధికారులు కూడా దృష్టి సారించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరుతున్నాను. అవసరమైతే ఈ ఫిర్యాదును రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తాను" అని ఆయన తెలిపారు.బుధవారం జహీరాబాద్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు సితార బార్‌పై విచారణ చేసి, నిబంధనల ఉల్లంఘన ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సంతోష్ కుమార్ తెలిపారు.
ఫిర్యాదుపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎలా స్పందిస్తారు? సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

# నేరాల నియంత్రణకు 'సురక్ష నేత్ర' కీలకం

- బస్వాపూర్‌లో 16 సీసీ కెమెరాల ఏర్పాటు..
- సీసీ కెమెరాలను ప్రారంభించిన హుస్నాబాద్ ఏసీపీ సదానందం

**కోహెడ, ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి ) :**



సిద్దిపేట జిల్లాలో నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన, రోడ్డు భద్రతపై పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తోంది. ఇందులో భాగంగా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో 'సురక్ష నేత్ర' కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను హుస్నాబాద్ ఏసీపీ సదానందం ప్రారంభించారు.
ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ప్రాధాన్యత, డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు భద్రతా నియమాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ప్రజల సహకారంతో జిల్లాలో 'సురక్ష నేత్ర' కార్యక్రమం ద్వారా మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటు కొనసాగుతోందని ఏసీపీ సదానందం తెలిపారు.
నేరాల నియంత్రణతో పాటు నిందితులను గుర్తించడం, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. డ్రగ్స్ లేదా గంజాయి విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే 112కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.అలాగే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఏసీపీ కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, అతివేగం, రాంగ్‌రూట్ ప్రయాణాలను నివారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోహెడ ఎస్సై అభిలాష్, విలేజ్ విపిఓ మోహన్, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ప్రారంభం

- 3వ, 22వ వార్డుల్లో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు చైర్మన్ శంకుస్థాపన

**కల్వకుర్తి ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి):**



కల్వకుర్తి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ బ్యంగి రత్నమాల బుధవారం ప్రారంభించారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఆమె 3వ, 22వ వార్డుల్లో పర్యటించారు. శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన అభివృద్ధి పనుల్లో భాగంగా 3వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు, 22వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు ఆనంద్ కుమార్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్పన్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యమైన పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కేతావత్ రామ, ఎజాస్, మక్బూల్, నాయకులు పోశెట్టి శ్రీనివాసులు, వాస శేఖర్, గోవింద కృష్ణయ్య, గుగ్గిళ్ళ శంకర్, సంబు ముత్యాలు, శివకాంత్ వాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద చింతరేవులలో భక్తజాతర

- ఆంజనేయస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- 9 వేల మందికి పైగా భక్తుల రాక.. వైభవంగా ప్రత్యేక పూజలు
- పవమాన, నవగ్రహ హోమాలు.. గోమాత పూజలు
- రాయచూరు నుంచి పాదయాత్రగా తరలివచ్చిన భక్తులు

**ధరూరు ఆగస్టు 12 (వుదయం బ్యూరో)**



ఆషాఢ అమావాస్య పర్వదినం సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం పెద్ద చింతరేవులలో భక్తజనం పోటెత్తింది. 18వ శతాబ్దం నాటి శ్రీ ఆంజనేయస్వామి ఆలయం బుధవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 9 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల నామస్మరణలు, భజనలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. వైభవంగా అభిషేకాలు.. హోమాలు భీమన అమావాస్య, అతి అమావాస్యను పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. పవమాన హోమాలు, నవగ్రహ హోమాలతో పాటు గోమాత పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు నారికేళాలు, ఆకులు, నిమ్మకాయలు, గుమ్మడికాయలు, పుష్ప తోరణాలు, పుష్పమాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉడిపి పెలిమర్ మఠం పీఠాధిపతులు శ్రీ 1008 విద్యాతీర్థ శ్రీపాదుల వారు స్వామివారికి ప్రత్యేక సంస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం రామాయణ ప్రవచనం చేశారు. రాయచూరు నుంచి పాదయాత్రగా కర్ణాటకలోని రాయచూరు పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు పాదయాత్రగా పెద్ద చింతరేవులకు చేరుకున్నారు. భజనలు చేస్తూ ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు దాసంగంతో నైవేద్యాలు సమర్పించారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు జాతరను తలపించాయి. భక్తుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా గద్వాల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. భీంపురం సర్పంచ్ రఘు విజ్ఞప్తి మేరకు డిపో మేనేజర్ ఏ.శ్రీధర్, ఆర్టీసీ కంట్రోలర్ విజయభాస్కర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్సు సేవలను అందుబాటులో ఉంచారు. 9 వేల మందికి అన్నప్రసాదం ఆలయాన్ని దర్శించుకున్న ప్రతి భక్తునికి శ్రీ ఆంజనేయస్వామి అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు అన్నంతో పాటు తేనీరు, కాఫీ, అల్పాహారం అందించారు. అన్నప్రసాద పంపిణీలో పలువురు భక్తులు స్వచ్ఛందంగా పాల్గొని సేవలందించారు. శ్రావణంలో మరిన్ని ప్రత్యేక పూజలు గురువారం నుంచి శ్రావణమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తుల కోరిక మేరకు ప్రత్యేక పూజలు, దీపారాధనలు, హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు. ఆలయానికి వచ్చిన వాహనాలకు వేదమూర్తుల ద్వారా బ్రాహ్మణులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆద్య వామనాచారి, ఆద్య కృష్ణాచారి, ఆద్య మధ్వాచారి, ట్రస్ట్ చైర్మన్ గిరిరావు, కార్యనిర్వాహణాధికారి రాజేశ్వరశర్మ, ఆలయ సిబ్బంది భాస్కర్, రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు సహా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# బుక్ చేసిన యూరియా బస్తాలు పక్కదారి పట్టాయా

- డబ్బులు తీసుకుని.. ఓటీపీ తీసుకుని.. ఇతరులకు అధిక ధరలకు విక్రయించారన్న ఆరోపణలు
- తెలంగాణ ట్రేడర్స్ ఎరువుల దుకాణంపై రైతుల ఆగ్రహం.. సమగ్ర తనిఖీలకు డిమాండ్

**దౌల్తాబాద్, ఆగస్టు 12(వుదయం):**



యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వేళ.. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ ట్రేడర్స్ ఎరువుల దుకాణంపై రైతులు పలు ఆరోపణలు చేస్తున్నారు. గత నెల 16వ తేదీన యూరియా కోసం బుకింగ్ చేసుకున్న రైతుల నుంచి బస్తాలను ట్యాగింగ్ చేసి, నగదు తీసుకోవడంతో పాటు ఓటీపీ కూడా తీసుకున్నారని, అయితే బుకింగ్ చేసిన రైతులకు యూరియా అందకుండా ఇతరులకు అధిక ధరలకు విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**బుకింగ్.. ట్యాగింగ్.. నగదు.. ఓటీపీ**

రైతుల ఆరోపణల ప్రకారం.. గత నెల 16న యూరియా బస్తాల కోసం తెలంగాణ ట్రేడర్స్ దుకాణంలో బుకింగ్ చేసుకున్నారు. బుకింగ్ అనంతరం తమ పేర్లపై యూరియా బస్తాలను ట్యాగింగ్ చేసినట్లు, ఇందుకు సంబంధించిన నగదును కూడా ముందుగానే తీసుకున్నట్లు రైతులు చెబుతున్నారు. యూరియా పంపిణీ ప్రక్రియలో భాగంగా అవసరమైన ఓటీపీని సైతం తీసుకున్నారని పేర్కొంటున్నారు.

**ఇతరులకు అధిక ధరలకు విక్రయించారా?**

బుకింగ్ చేసిన రైతులకు ఇవ్వాల్సిన యూరియా బస్తాలను ఇతరులకు విక్రయించారా? అలా విక్రయిస్తే నిర్ణయించిన ధర కంటే అధిక ధర వసూలు చేశారా? అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. **బ్లాక్ దందాకు అడ్డుకట్ట వేయాలి**
యూరియా కొరతను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తే అధికారులు కఠినంగా వ్యవహరించాలని రైతులు కోరుతున్నారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అందాల్సిన ఎరువులను పక్కదారి పట్టించి అధిక ధరలకు విక్రయించే ప్రయత్నాలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. యూరియాను అక్రమంగా నిల్వ చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు ఆధారాలు లభిస్తే సంబంధిత దుకాణాలపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అవసరమైతే అక్రమాలకు పాల్పడిన దుకాణాలపై కేసులు నమోదు చేసి, లైసెన్స్ రద్దు చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల తనిఖీలతోనే నిజాలు వెలుగులోకి..**

రైతుల ఆరోపణల నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి తెలంగాణ ట్రేడర్స్ దుకాణాన్ని తనిఖీ చేయాలని కోరుతున్నారు. గత నెల 16వ తేదీ నుంచి ఇప్పటి వరకు జరిగిన యూరియా బుకింగ్, సరఫరా, విక్రయాల వివరాలను పరిశీలిస్తే అసలు విషయం బయటపడుతుందని రైతులు అంటున్నారు.
బుకింగ్ చేసిన రైతుల నుంచి నగదు తీసుకుని, ఓటీపీ తీసుకున్న తర్వాత వారికి యూరియా ఎందుకు ఇవ్వలేదనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. తమ పేరుతో బుక్ చేసిన యూరియా బస్తాలు ఎక్కడికి వెళ్లాయి? ఎవరికి విక్రయించారు? ఎంత ధరకు విక్రయించారు? అనే వివరాలను బహిర్గతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


**రైతులకు పారదర్శకంగా పంపిణీ చేయాలి**

ఈ ఆరోపణలపై వ్యవసాయశాఖ అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు అవాస్తవమైతే రైతుల అనుమానాలను నివృత్తి చేసేలా పూర్తి వివరాలను వెల్లడించాలని రైతులు కోరుతున్నారు.

# ఏషియన్ పెయింట్స్ 'బ్యూటిఫుల్ హోమ్స్ పెయింటింగ్ సర్వీస్' క్యాంపెయిన్

- ఇంటికి రంగులు వేయడం ఇక అత్యంత సులభం

**హైదరాబాద్, ఆగస్టు :**



ఇంటికి రంగులు వేయడం చాలా ఒత్తిడితో కూడుకున్న పని. ఎందుకంటే, కాంట్రాక్టర్ ను సమన్వయం చేసుకోవడం, సరైన రంగులను ఎంచుకోవడం, సమయపాలన పాటించడం, పరిశుభ్రత, వాటర్‌ప్రూఫింగ్ సమస్యలను పరిష్కరించుకోవడం వీటితో పాటు నాణ్యత తదితర అంశాలు ఇమిడి ఉంటాయి. ఈ ప్రధాన అంశాలను గుర్తించిన ఏషియన్ పెయింట్స్ 'ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హోమ్స్ పెయింటింగ్ సర్వీస్' క్యాంపెయిన్ ను దక్షిణాది వినియోగదారుల కోసం ప్రారంభించింది. సైట్ ఇన్‌స్పెక్షన్, ప్రత్యేక సూపర్‌విజన్, ఏఐ విజువలైజర్ ద్వారా వ్యక్తిగత కలర్ కన్సల్టేషన్, ఇరవై శాతం మనీ బ్యాక్ గ్యారెంటీ, ప్రొడక్ట్ స్కాన్ ఆధారిత వారంటీ, సరైన సమయానికి పని పూర్తి చేయడం వంటి ప్రత్యేకతలతో ఈ సేవ వినియోగదారులకు అందుబాటులోకి వస్తుంది. ఈ క్యాంపెయిన్‌లో దక్షిణ భారతదేశ సంస్కృతి, గృహ యజమానుల రోజువారీ అనుభవాల ఆధారంగా రూపొందించిన వరుస ప్రకటన చిత్రాలు ఉన్నాయి. 'ఆనందకరమైన ఆశ్చర్యం' అనే అంశం నేపథ్యంగా సాగే ఈ చిత్రాలలో ఒక పెయింటింగ్ ప్రాజెక్ట్ ఇంత సులభంగా, అవాంతరాలు లేకుండా ఎలా పూర్తవుతుందో నమ్మలేకపోయే ఒక అనుమానాస్పద తండ్రి కనిపిస్తారు. ఆయనకు తన కుమారుడు 'బ్యూటిఫుల్ హోమ్స్ పెయింటింగ్ సర్వీస్' అందించే సులువైన, శ్రమలేని అనుభవాన్ని పరిచయం చేస్తారు.
అందుకే, 'బ్యూటిఫుల్ హోమ్స్ పెయింటింగ్ సర్వీస్' ద్వారా మేము ప్రొఫెషనల్ నైపుణ్యం, అత్యుత్తమ సేవా ప్రమాణాలు, సమయానికి పనులు పూర్తి చేయడం, నమ్మకమైన వారంటీలను ఒకే చోటికి చేర్చి పెయింటింగ్, వాటర్‌ప్రూఫింగ్ పరిష్కారాన్ని అందించే వ్యవస్థను రూపొందించామని పేర్కొన్నారు. ఏఐ కలర్ విజువలైజేషన్‌ను మా సర్వీస్ అత్యుత్తమ పని తనంతో అనుసంధానించడం ద్వారా, గృహ యజమానులకు గదుల రూపురేఖలు మార్చే ప్రక్రియను ఎంతో సులభమైన, కచ్చితమైన అనుభవంగా మారుస్తున్నామన్నారు. ఇంటి మార్పు ప్రక్రియను మరింత సరళంగా, అంచనాలకు తగినట్లు, ఆనందదాయకంగా మార్చడం మా లక్ష్యమన్నారు. దీని వల్ల గృహ యజమానులు శ్రమ లేకుండా, అంతిమంగా వచ్చే అందమైన ఫలితాన్ని మాత్రమే ఆస్వాదించగలుగుతారని పేర్కొన్నారు.



# సత్యం 31 వ వర్ధంతి వేడుకలు

మరికల్ మండల కేంద్రంలోని బుధవారం చౌరస్తాలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బహుజన ఆత్మగౌరవం పాలమూరు ముద్దుబిడ్డ జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే మరాటి ఎర్ర సత్యం 31వ వర్ధంతి వేడుకలు ఇందిరా గాంధీ చౌరస్తాలో ఫోటోకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అయినా పేద ప్రజలకు అన్ని విధాలుగా ఆదుకున్నాడని మరియు ప్రజల గుండెల్లో నాటకపోయిన వ్యక్త అని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గుప చిన్నయ్య ముదిరాజు సంగం జిల్లా అధ్యక్షులు కానుగంటి నారాయణ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సూర్య మోహన్ రెడ్డి సూరిటి చంద్రశేఖర్ పెంట మీది నరసింహులు రామస్వామి హరీష్ బైసన్ అశోక్ జగదీష్ శ్రీనివాసులు అఖిల పక్ష నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ



- పోస్టర్ ఆవిష్కరించిన సైనిక్ యూత్ మోటివేషన్ సొసైటీ చైర్మన్ డా. లోకేష్ ముదిరాజ్

**వుదయం, దుబ్బాక :**

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించేందుకు అఖిల్ రాజ్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. బుధవారం దుబ్బాక మండలం గంభీర్పూర్ గ్రామంలో నిర్వహించనున్న ఉచిత పోలీస్ శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను సైనిక్ యూత్ మోటివేషన్ సొసైటీ చైర్మన్ డా. లోకేష్ ముదిరాజ్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు వేలాది రూపాయలు ఖర్చు చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువతకు ఉచిత శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు .ఈ నెల 16న దుబ్బాకలోని వాగ్దేవి జూనియర్ కాలేజీలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు అఖిల్ రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు పోలీస్ రాత పరీక్షకు పూర్తిగా ఉచిత శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని డా. లోకేష్ ముదిరాజ్ ఆకాంక్షించారు.

# గురుఫిఠం లో మరోసారి చోరీ

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 12...**



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గూడూరులో ఉన్న శ్రీ గురుపీఠం పంచాయతన దత్తాత్రేయ స్వామి, షిరిడి సాయి బాబా దేవాలయాల్లో మరోసారి చోరీ జరగడంపై స్థానికంగా కలకలం రేపుతుంది. ఇదే దేవాలయాల్లో జులై 31న చోరికి జరుగగా తిరిగి 12 రోజుల వ్యవధిలోనే గుర్తు తెలియని దుండగుడు మరోసారి చోరికి పాల్పడ్డటం ఈ చోరీ ఘటన ఇటు పోలీసులకు, అటు భక్తులకు గురు పీఠం నిర్వాహకులకు విస్మయానికి గురి చేస్తుంది. బుధవారం తెల్లవారుజామున గుడిలోకి ప్రవేశించిన గుర్తుతెలియ వ్యక్తి ప్రవేశించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదై ఉన్నాయి. దుండగుడు ప్రధాన గేటు తాళం, రెండు ఆలయాల్లో గర్భ గుడిల తాళాలు, రెండు హుండీల తాళాలు ఇనుప రాడ్డుతో ధ్వంసం చేశాడు. హుండీల్లో ఉన్న నగదు తీసుకొని ఆ హుండీలను దేవాలయం ప్రహరీ బయట చింత చెట్టు కిందకు తీసుకెళ్లి పడేశాడు. ఆ గుర్తు తెలియని ఆ వ్యక్తిని ఎవ్వరూ గుర్తుపట్టకుండా ముఖానికి మాస్కు ధరించి చోరికి పాల్పడ్డాడు. ఈ చోరీ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షుణ్ణంగా పరిసరాలను పరిశీలించి, విచారణ చేపట్టి కేసు నమోదు చేసుకున్నారు. ఈ గురుఫిఠం లో సీసీ కెమెరాలున్నా వరుస చోరీలు జరుగడం దొంగలు దొరకక పోవడంతో స్థానికంగా అలాగే పోలీసులకు కలవరం రేపుతుంది. వీలైనంత త్వరగా దర్యాప్తు ముమ్మరం చేసి నిందితులను గుర్తించాలని శ్రీ గురుపిఠం ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# పాగుంటలో పడకేసిన పారిశుధ్యం

- సత్తువ లేని యంత్రాంగం!
- గుమ్మం ముందే మురుగు కూపం.. గడ్డం కాలుతున్నా చలించని పంచాయతీ కార్యదర్శి!
- గ్రామసభ మొరలు బుట్టదాఖలు.. జనాల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారులు!


**కేటిదొడ్డి ఆగస్టు 12 (వుదయం బ్యూరో)**



పాలకులు మారుతున్నారు, అధికారులు మారుతున్నారు.. కానీ పాగుంట పల్లె తలరాత మాత్రం అంగుళం కూడా మారడం లేదు. అధికారుల నిర్లక్ష్యపు నిద్ర, పంచా యతీ యంత్రాంగపు పక్షపాత వైఖరి కలసి పాగుంటను రోగాల నిలయంగా మార్చే శాయి. ఊరంతా నరకకూపమై, దారి పొడవునా దుర్గంధం నాట్యమాడుతున్నా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారుల దిగజారుడు తనంపై పాగుంట వాసులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.
కార్యాలయం ముందే కంపు కొడుతున్నా కన్ను తెరవరా? గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన పంచాయతీ కార్యాలయమే మురుగు కూపానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. కార్యాలయం గుమ్మం ముందే మురుగునీరు చెరువులా నిలిచి, నరకానికి ప్రవేశ ద్వారంలా దర్శనమిస్తుంటే.. లోపల కూర్చునే అధికారులకు ఆ దుర్గంధం ముక్కుకి తగలకపోవడం వారి నిర్లక్ష్యానికి, బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠ. ప్రజల సమస్యలు తీర్చాల్సిన కార్యాలయానికి వెళ్లాలంటేనే అసహ్యంతో ముక్కు మూసుకుని, అసహ్యించుకుంటూ అడుగులు వేయాల్సిన దుస్థితి దాపురించింది. ఇంట్లోకి మురుగు ప్రవాహం.. నరకంలో పల్లె జనం!
వెళ్లే దారి లేక రోడ్లపైనే మురుగు మడుగులు కట్టింది. వీధిలో వాహనం వెళ్తే చాలు.. ఆ కలుషిత మురుగు నీరు వచ్చి ఇళ్లలోని వంటపాత్రలు, గుమ్మాలపై పడుతోందని స్థానికులు రోదిస్తున్నారు. రోజూ కలుషిత నీటి మధ్యే జీవనం సాగిస్తున్న చిన్నారులు, వృద్ధుల పాదాలు ఇన్ఫెక్షన్లతో కుళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. డెంగ్యూ, మలేరియా దాడి.. ప్రాణాలు పోయాక మేల్కొంటారా? వారం రోజులుగా కుళ్లుతున్న నిల్వ నీటిలో దోమలు, ఈగలు సైన్యంలా విజృంభిస్తు న్నాయి. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ఎప్పుడు ఏ ప్రాణాన్ని బలి తీసుకుంటాయోనని గ్రామం భయంతో వణికిపోతోంది. వర్షాకాలం ముంచు కొస్తున్నా కనీసం బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవు, ఫాగింగ్ యంత్రం జాడలేదు. ఇది అధికారుల నిర్లక్ష్యం కాకపోతే ప్రాణాలతో ఆడుకునే రాక్షసానందం కాక మరేమిటని స్థానికులు నిలదీస్తున్నారు. వినతిపత్రాలు ఇస్తే బుట్టదాఖలు చేయడం పరిపాటిగా మారింది. పంచాయతీ ముట్టడిస్తాం.. హెచ్చరిక!" ఫిర్యాదులు ఇచ్చాం, గ్రామసభలో గగ్గోలు పెట్టాం.. అయినా అధికారుల్లో చలనం లేదు. ఊరంతా మురుగునీటితో కుళ్లిపోతుంటే చూస్తూ ఊరుకోవడానికి మేమేం చేతకాని వాళ్లం కాదు. తక్షణమే నిల్వ నీటిని తొలగించి, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే.. నిలిచిన మురుగునీటిని పంచాయతీ కార్యాలయంలోకి తోడిపోసి, కార్యాలయాన్ని ముట్టడిస్తాం! ఆగ్రహంతో ఊగిపోతున్న పాగుంట గ్రామస్థులు.



# గ్రేటర్ హైదరాబాద్



## ప్రతి ఇంటిపై తిరంగా.. దేశభక్తికి ప్రతీకగా నిలుద్దాం



ఇది జెండా కాదు.. మన గర్వం, మన త్యాగం, మన ఐక్యతకు ప్రతీక — ప్రతి ఇంటిపై తిరంగా ఎగురవేద్దాం

**ముషీరాబాద్, ఆగస్టు 12(వుదయం )**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తమ నివాసంపై జాతీయ జెండాను ఎగురవేశారు. ఆగస్టు 11 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుదాం అని పిలుపునిచ్చారు.దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలకు త్రివర్ణ పతాకం ప్రతీక అని, ప్రతి భారతీయుడి గుండెల్లో జాతీయ జెండా పట్ల గౌరవం, దేశం పట్ల బాధ్యత ఉండాలని అన్నారు.ప్రతి ఇంటిపై తిరంగా.. ప్రతి హృదయంలో దేశభక్తి.. ఇదే 'హర్ ఘర్ తిరంగా' లక్ష్యం అని పేర్కొంటూ, ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు న్యాయం చేయాలి

**- కేబినెట్‌లో సంస్కృతిక సారథి ఉద్యోగాల బిల్లుకు ఆమోదం తెలపాలి**
**- సిద్దిపేట జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్**

**వుదయం, సిద్దిపేట**



రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలలో నిర్వహించనున్న కేబినెట్ సమావేశంలో ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు న్యాయం జరిగే విధంగా సంస్కృతిక సారథిలో ఉద్యోగాల ప్రకటనకు సంబంధించిన బిల్లుకు ఆమోదం తెలపాలని సిద్దిపేట జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ కోరారు. రాష్ట్ర ఉద్యమ నిరుద్యోగ కళాకారుల అధ్యక్షులు దరువు అంజన్న, చైర్మన్ అనువోజు వెంకన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి కిరణ్, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో సిద్దిపేట జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల అధ్యక్షులు ఎర్రవల్లి శ్రీనివాస్ మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కళాకారులు కీలక పాత్ర పోషించారని, ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కళాకారుల సేవలు మరువలేనివని అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ కళాకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు కల్పించి, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సంస్కృతిక సారథిలో ఉద్యోగాల ప్రకటనకు సంబంధించిన బిల్లును రానున్న కేబినెట్ సమావేశంలో ఆమోదించి, నిరుద్యోగ కళాకారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి దాసు, రాష్ట్ర కమిటీ సభ్యులు కుంచం శ్రీనివాస్, పిల్లిట్ల బుజంగం, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ చిన్నగుండవెల్లి, ఉపాధ్యక్షులు తునికి రాజు, పాకాల భూపతి, గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్ దుబ్బాక, సంయుక్త కార్యదర్శులు బొల్లం రాజేష్, ధనరేఖ, ప్రచార కార్యదర్శి రాజు చిన్నగుండవెల్లి, కోశాధికారి రాజు కందకట్ల, సలహాదారులు పిల్లిట్ల శశిధర్, ఇనుప సురేష్, కమిటీ సభ్యులు విధుమౌళి, రేణుక, భాగ్య, బొల్లం శ్రీనివాస్, భిక్షపతి తదితర ఉద్యమ నిరుద్యోగ కళాకారులు పాల్గొన్నారు.

## సర్వే పనుల పరిశీలన: అదనపు కలెక్టర్

**మహబూబ్ నగర్ ఆగస్టు12(వుదయం ప్రతినిధి)**



మహబూబ్‌నగర్ రూరల్ మండలం జమిస్తాపూర్ గ్రామంలో చేపడుతున్న రీసర్వే పనులను రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ బుధవారం పరిశీలించారు.గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే ప్రక్రియ, పనుల పురోగతిని ఆమె సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యాడాస్ట్రల్ పరిధిలో లేని గ్రామాల రీసర్వే పనులను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్, మహబూబ్‌నగర్ రూరల్ మండల తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



**గుమ్మడిదల, ఆగస్టు 12 (వుదయం):**

కానుకుంట-1 గ్రామంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు పూజ ఆధ్వర్యంలో గ్రామ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులకు ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, బీమా పథకాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పొదుపు ఆవశ్యకతను వివరించడంతో పాటు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY), ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (PMSBY) వంటి బీమా పథకాల గురించి వివరించారు. ప్రతి సభ్యురాలు బీమా చేసుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులకు కూడా బీమా చేయించాలని SBI బ్యాంకు మేనేజర్ రాఘవేంద్ర సూచించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం పాలక వర్గ సభ్యులతో పాటు APM నరేందర్, CC వరలక్ష్మి, VOA కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతే ధ్యేయం



**మహబూబ్ నగర్ ఆగస్టు12(వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి , నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు.భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు, పౌష్టికాహారం అందించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, విద్యారంగంపై 38 సార్లు సమీక్ష సమావేశం నిర్వహించారని తెలిపారు.గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి ఏనాడు విద్యా వ్యవస్థ పై సమీక్ష నిర్వహించలేదని గుర్తు చేశారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ఐఏఎస్ ఆకునూరు మురళి నేతృత్వంలో విద్యా కమిషన్ వేసి విద్యా కమిషన్ ద్వారా పాఠశాలలు, కళాశాలలను పరిశీలించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా నిపుణులతో చర్చించి రూపొందించిన సూచనల ఆధారంగా సంస్కరణలను అమలు చేస్తున్నామని తెలిపారు.విద్యార్థులు ఆకలితో చదవాల్సిన పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని అమలు చేయడంతో పాటు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. విద్యా కమిషన్ సూచన మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోర్డులు, నోట్‌బుక్స్, విద్యా సామగ్రి, మెరుగైన తరగతి గదులు, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిందని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, అధ్యాపకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అజ్ఞానానికి చరమగీతం.. ఎయిడ్స్‌పై గద్వాల 'సమరభేరి'!

**- నిర్లక్ష్యపు అంచులపై సమాజం.. ఉవ్వెత్తున ఎగిసిపడిన చైతన్య తరంగం**
**- అపోహల చీకట్లను తుడిచేస్తూ రోడ్డెక్కిన విద్యార్థి లోకం**
**- డిజిటల్ అస్త్రంగా 'బ్రేక్‌ఫ్రీ' క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ**

**గద్వాల ఆగస్టు 12 (వుదయం బ్యూరో)**



హెచ్ఐవీ/ఎయిడ్స్ మహమ్మారి కంటే దాన్ని చుట్టుముట్టిన అజ్ఞానమే సమాజానికి అత్యంత ప్రమాదకరమని గద్వాల గళమెత్తింది. "అవగాహనే ఆయుధం.. నివారణే మార్గం" అంటూ అజ్ఞానపు నిద్రలో ఉన్న సమాజాన్ని మేల్కొలిపేందుకు జిల్లా కేంద్రం సమర శంఖం పూరించింది. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తీవ్రతర సమాచార ప్రచారంలో భాగంగా విద్యార్థులు, వైద్యాధికారులు, స్వచ్ఛంద సంస్థలు ఏకమై మహార్యాలీ చేపట్టాయి. మూఢనమ్మకాలపై చైతన్య దాడి!పాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ప్రాంగణం నుంచి రాజీవ్ చౌరస్తా వరకు సాగిన ఈ యాత్ర వ్యాధిపై ఉన్న భయాలను, సామాజిక అపోహలను తుత్తునియలు చేసింది. బాధితుల పట్ల చూపే మానసిక వివక్ష సమాజానికే నామోషి అని నినదించారు. ఎంఏఎల్‌డీ డిగ్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రదర్శన ఫలకాలతో రహదారులను చైతన్యవంతం చేశారు.

అరచేతిలో నివారణాస్త్రం! కేవలం ప్రచారాలకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతికతను ఆయుధంగా మలచుకుంటూ 'బ్రేక్‌ఫ్రీ' అప్లికేషన్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. సంకోచాలు వీడి ఉచిత పరీక్షలు, సంప్రదింపులకు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి.నర్సింగరావు, చి.మదన్ మోహన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సంధ్య కిరణ్మయి, ఎయిడ్స్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాజు, జిల్లా ప్రజారోగ్య నర్సింగ్ అధికారి వరలక్ష్మి మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జంతర్ మంతర్ లో జర్నలిస్టుల ధర్నాకు కేంద్రం స్పందన

**- టీడబ్ల్యూజేఎఫ్ వినతిపై చర్యలు ప్రారంభం**
**-ప్రెస్ కౌన్సిల్‌కు కేంద్ర సమాచార,ప్రసారాల శాఖ లేఖ**

**హైదరాబాద్ వుదయం ప్రతినిధి ఆగస్టు 12:**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జూలై 27న ఢిల్లీలోని జంతర్ మంతర్ లో నిర్వహించిన జర్నలిస్టుల ధర్నా పై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. టీడబ్ల్యూజేఎఫ్ ధర్నా అనంతరం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రంపై చర్యలు ప్రారంభమయ్యాయి. జర్నలిస్టుల సంక్షేమం, హక్కులు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత,చట్టపరమైన రక్షణ తదితర అంశాలపై టీడబ్ల్యూజేఎఫ్ ప్రధానమంత్రి కార్యాలయానికి వినతిపత్రం సమర్పించింది. ఈ వినతి పత్రంలో అక్రెడేటెడ్ జర్నలిస్టులకు 50 శాతం రైల్వే ఛార్జీ రాయితీ, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ పునరుద్ధరణ, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్యకు చట్టపరమైన పరిష్కారం, స్వతంత్ర నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు, వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించడం/సవరణలు చేయడం, జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం, ప్రింట్,ఎలక్ట్రానిక్,డిజిటల్ మీడియా ఉద్యోగులకు రక్షణ, కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు, జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం తదితర డిమాండ్లను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

ఈ వినతిపై PMOPG/D/2026/0139147 నంబరుతో జూలై 28న ఫిర్యాదు నమోదు కాగా, సంబంధిత అంశాన్ని పరిశీలించేందుకు మీడియా యూనిట్ సెల్-Iకి బదిలీ చేసినట్లు రిజిస్ట్రేషన్ వివరాల్లో నమోదైంది.

మరో కీలక పరిణామంగా, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి 2026 ఆగస్టు 8న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కార్యదర్శికి అధికారిక లేఖ జారీ అయింది. టీడబ్ల్యూజేఎఫ్ తరఫున సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సమర్పించిన ఫిర్యాదు ను ప్రస్తావిస్తూ, జర్నలిస్టుల సంక్షేమం, సేవా పరిస్థితులు, చట్టపరమైన రక్షణ, సామాజిక భద్రత, కార్మిక హక్కులకు సంబంధించిన అంశాలపై తగిన చర్యలు తీసుకుని, ఫిర్యాదును వీలైనంత త్వరగా పరిష్కరించాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను కేంద్ర మంత్రిత్వ శాఖ కోరింది. తమ విజ్ఞప్తి మేరకు రైల్వే రాయితీ విషయం పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కూడా స్పందించి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని మామిడి సోమయ్య కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెంచాలి

**రంగారెడ్డి**



విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం క్షేత్రస్థాయి పర్యవేక్షణను నిరంతరం కొనసాగించాలి – అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయిజిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని మరింత పెంచడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ శ్రీమతి డాక్టర్ కిరణ్మయి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా IDOC భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, స్టేట్ టాస్ డైరెక్టర్ శ్రీ లింగయ్య ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ వెంకటేశ్వర్లు వివిధ విద్యా అంశాలపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులు (MEOలు), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, CRPలు, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యాశాఖ కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, పాఠశాలల పనితీరు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల మెరుగుదల, క్షేత్రస్థాయి పర్యవేక్షణ తదితర అంశాలపై అదనపు కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ప్రతి మండలంలోని పరిస్థితులను సంబంధిత MEOలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావనను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన విద్యార్థి పాఠశాలలో చేరేలా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, మౌలిక వసతులు, వివిధ ప్రభుత్వ సదుపాయాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల నమోదు పెంపుతో పాటు వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడం, విద్యా ప్రమాణాలను పెంపొందించడం ప్రతి ఉపాధ్యాయుడి ప్రధాన బాధ్యతగా భావించాలని అదనపు కలెక్టర్ సూచించారు. పాఠశాలల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. స్టేట్ టాస్ డైరెక్టర్ శ్రీ లింగయ్య మాట్లాడుతూ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, MEOలు క్షేత్రస్థాయిలో పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో మాట్లాడి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిరంతరం కొనసాగినప్పుడే విద్యాశాఖ కార్యక్రమాల అమలులో ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన పేర్కొన్నారు. పాఠశాలల పనితీరును మెరుగుపరిచేందుకు MEOలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, CRPలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. విద్యార్థుల నమోదు, హాజరు, అభ్యసన ఫలితాలు తదితర అంశాలపై నిరంతరం దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ వెంకటేశ్వర్లు సమావేశంలో సమీక్షించిన అంశాలు, శాఖాపరంగా చేపడుతున్న కార్యక్రమాలు, మండలాల వారీగా విద్యా పరిస్థితులను వివరించారు. అనంతరం అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, CRPలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

## ఫోక్సో కేసు నిందితుని 20 ఏళ్ల జైలు శిక్ష



**మేడిపల్లి వుదయం ప్రతినిధి ఆగస్టు 12**

. బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష పడింది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసును విచారించిన నేరేడ్‌మెట్‌లోని అత్యాచారం, పోక్సో కేసుల ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం బుధవారం నిందితుడిని దోషిగా తేల్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. బోడుప్పల్ బొల్లిగూడెంకు చెందిన కాలా జాన్ (45)పై 2025లో మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 279/2025 కింద బీఎన్ఎస్ సెక్షన్ 64(2)(ఎం), 351(2)తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(ఐ) రెడ్‌విత్ 6 కింద కేసు నమోదైంది. కేసు దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు ఆధారాలను కోర్టుకు సమర్పించారు.విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ... న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది. అలాగే బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం అందించాలని ఆదేశించింది. ఈ కేసును అప్పటి మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ ఆర్. గోవిందరెడ్డి దర్యాప్తు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. శ్రీనివాసచారి ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు, విచారణ ప్రక్రియలో మేడిపల్లి పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేశారు. బాలికలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మేడిపల్లి పోలీసులు తెలిపారు.

## విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై కేసు లు నమోదు

**వెల్దండ ఆగస్టు 12 (వు దయం )**

మండలంలో బుధవారం విద్యుత్ విజిలెన్స్ మరియు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు జరిపారు. ఈ దాడుల్లో 15 బృందాలుగా విడిపోయి 600కు పైగా విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు

హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, కోళ్ల ఫారాలు, ఫామ్‌హౌస్‌లు తదితర వాణిజ్య సంస్థలకు చెందిన వారు విద్యుత్ చౌర్యానికి పాల్పడిన120 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారుఈ దాడుల్లో జిల్లా ఎస్ఈ శ్రీ వెంకట నరసింహారెడ్డి, విజిలెన్స్ డీఈ శ్రీ కామేశ్వరరావు, ఏడీఈలు శ్రీ శంకరయ్య, శ్రీ ఆంజనేయులు, డీఈ (టెక్నికల్) శ్రీ రవి కుమార్, ఏఈలతో పాటు సబ్ ఇంజనీర్లు మరియు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా సాగునీటి ప్రణాళిక

**- ఎల్‌నినో ప్రభావం - ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలి మంత్రి జూపల్లి కృష్ణారావు**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 12 (వుదయం బ్యూరో):**

ప్రస్తుత నీటి లభ్యత, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రాజెక్టుల కింద ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు.వనపర్తి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి పారుదల సలహా మండలి సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, సాగునీటి శాఖ అధికారులు పాల్గొన్నారు. జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్, ఆర్డీఎస్, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులలో నీటి లభ్యతపై చర్చించారు.ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు డిసెంబరు వరకు నీటిని అందించాల్సి ఉందని, మళ్లీ సమృద్ధిగా వర్షాలు కురిస్తే తప్ప ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం సుమారు 9 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఇందులో 7 టీఎంసీలు సాగుకు, 2 టీఎంసీలు తాగునీటికి వినియోగించే అవకాశం ఉందన్నారు.ప్రాజెక్టు కాలువల ద్వారా సాగునీటిని పొందే రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని మినుము, వేరుశనగ, ఆయిల్ పామ్ వంటి ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రైతులకు నీటి లభ్యతపై వాస్తవ పరిస్థితులను ముందుగానే పారదర్శకంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు డాక్టర్. కుచుకళ్ల రాజేష్ రెడ్డి, డ. డాక్టర్ వంశీకృష్ణ, తూడి మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు తదితరులు పాల్గొన్నారు.

## .స్వాతంత్ర్యం కోసం దేశభక్తులు ప్రాణాలిచ్చారు....

**- మీరు సమయం ఇవ్వండి...... 15 ఆగస్టు వేడుకల కోసం..**
**- ఆర్ నరేష్ కుమార్**

**శంకర్ పల్లి ఆగస్టు 12(వుదయం)**



బ్రిటిష్ మూకల నుండి భరతమాతకు విముక్తి కలిగించాలని, దేశభక్తులు ప్రాణాలిచ్చారని, మీరు 15 ఆగస్టు జెండా వేడుకల కోసం సమయం ఇవ్వాలని భాజపా తెలంగాణ ఎండోమెంట్ సెల్ ధార్మిక సంస్థ రంగారెడ్డి రూరల్ జాయింట్ కన్వీనర్ ఆర్. సతీష్ కుమార్ (నరేష్ కుమార్), శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు పిలుపునిచ్చారు.ప్రియతమ భారత ప్రధాని పిలుపు మేరకు 'ఘర్ ఘర్ తిరంగా'లో భాగంగా బుధవారం నాడు శంకర్ పల్లి లోని గుడిసెవాసులను కలిసి, దేశభక్తి మరియు వారి త్యాగాల విషయమై అవగాహన కల్పిస్తూ తెలపడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ శనివారం జరిగే జెండా పండుగకు హాజరై జాతీయ పతాకానికి వందనం చేయాలని పేర్కొన్నారు. "ఏ తల్లి నిన్ను కన్నదో ఆ తల్లినే కన్న భూమి గొప్పదిరా" అన్న నిజాల్ని ప్రతి భారతీయుడు గుర్తించాలన్నారు.

ముఖ్యంగా నేటి యువతరం, యువకులు, విద్యార్థినులు, పిల్లలు... ప్రతి ఒక్కరూ కూడా కులమతాలకు అతీతంగా జెండా పండుగకు హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి. నరసింహారెడ్డి పాల్గొన్నారు.




## ట్రంప్, మోడీ చర్చించుకుంటారు

"రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు అంశంపై ట్రంప్, మోడీ చర్చించుకుంటారు. తద్వారా సమస్యను పరిష్కరించుకుంటారు. వారిద్దరికి మంచి సంబంధాలున్నాయి. ఈ విషయంలో ఇతరులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత భారత్ ఆ దేశం నుంచి చమురు కొనుగోళ్లను భారీగా పెంచింది."

- పీటర్ నవారో, ట్రంప్ సలహాదారుడు

## వే'మన'పద్యం

కానివానితోడఁ గలసి మెలఁగుచున్నఁ
గానివానిగానె కాంతు రవని
తాటి క్రింద పాలు ద్రాగిన చందమౌ
విశ్వదాభిరామ! వినుర వేమ



## సంపాదకీయం

# ప్రశ్నను ఆపే దమ్ముందా...?

సిరా చల్లడం క్షణంలో జరిగిపోయే పని. ముఖం నల్లబడుతుంది, బట్టలకు మరక పడుతుంది. కొద్దిసేపటి తర్వాత ఆ మరకను కడిగేయవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ఒకరి ముఖంపై పడిన సిరా వెనుక ఉన్న ప్రశ్నను మాత్రం అంత సులభంగా తుడిచేయలేం. జార్ఖండ్‌లో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాపై జరిగిన సిరా దాడి అలాంటి ఘటనే. ఇది ఒక విద్యార్థి నాయకురాలిని అవమానించడం మాత్రమే కాదు. నిరసన తెలిపే హక్కును, రాజ్యాంగాన్ని కూడా. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) సీజీఎల్ పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీక్‌ల ఆరోపణలపై ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ లాంటి వామపక్ష విద్యార్థి సంఘాలతో కొద్దిరోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. జేపీఎస్సీని పునర్వ్యవస్థీకరించాలని, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలను రద్దు చేసి కొత్త షెడ్యూల్ ప్రకటించాలని, ప్రయివేటు ఏజెన్సీల ద్వారా పరీక్షలు నిర్వహించకూడదని, నియామకాల్లో పారదర్శకత ఉండాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన నేహా బోరా రాంచీలో నిర్వహించిన శాంతియుత ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ బిర్సా చౌక్ సమీపానికి చేరుకున్న సమయంలో గుంపులో నుంచి అరెస్సెస్ మద్దతుదారునిగా అనుమానిస్తున్న ఓ వ్యక్తి నేహా బోరాతో పాటు కొందరు మహిళా నాయకురాళ్లపై సిరా చల్లాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా 'నేహా దేశద్రోహి. ఉమర్ ఖలీద్‌కు మద్దతిస్తోంది' అని తెలిపాడు. ఉమర్ ఖలీద్ పీహెచ్‌డీ విద్యార్థి, జేఎన్‌యూ నాయకుడు. క్యాంపస్‌లో జరిగిన ఒక నిరసన ప్రదర్శనలో దేశద్రోహ వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ఆయన మొదటిసారి వార్తల్లోకి వచ్చారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఎన్ఆర్‌సికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో చురుగా పాల్గొన్నారు. 2020లో ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లకు వెనుక కుట్ర పన్నారని ఆరోపిస్తూ, ఢిల్లీ పోలీసులు ఆయనపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ఉపా కింద జైల్లో నిర్బంధించారు. ఆయన పాకిస్తాన్ ఏజెంట్ కాదు, దేశద్రోహి అంతకన్నా కాదు. ఎవరైనా నేహా రాజకీయ భావజాలాన్ని వ్యతిరేకించవచ్చు, ఆమె డిమాండ్లతో విభేదించవచ్చు, ఆమెను విమర్శించవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ప్రత్యామ్నాయ సమాధానం వాదన కావాలి, దాడి కాదు.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020



# మూఢనమ్మకాలొద్దు

విక్రమ్-1 రాకెట్ ప్రయోగాన్ని విజయవంతం చేసి, ప్రపంచం మెప్పు పొందిన స్కైరూట్ ఏరోస్పేస్ వెలసిన హైదరాబాద్‌లోనే మూఢ నమ్మకాల ఉనికిపై, అదీ బాధ్యతాయుత పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు పదే పదే మాట్లాడడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మన కండ్ల ముందే ప్రపంచం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అద్భుతాలను నమోదు చేస్తూ ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్తుంటే...మన పేరు గొప్ప ప్రజాప్రతినిధులు 'అపోహల వంటకాల'తో సమాజాన్ని వెనక్కు లాగడం అసంబద్ధమే. ఎల్ నినో ఎఫెక్ట్ తో తెలంగాణలోనే కాదు, యావత్ దేశంలోనూ ఇతర దేశాల్లోనూ దుర్భిక్షం నెలకొంటోందని, వచ్చే సెప్టెంబరు కల్లా తీవ్రత పెరుగుతుందని శాస్త్రవేత్తలు, నిపుణులు, ఇతరులు అంచనా వేస్తున్నారు. మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వం ఎల్ నినో ప్రభావం మీద ఇదివరకే కమిటీ వేయించి, నివేదిక కూడా తెప్పించుకున్నది. ఇదంతా నాణానికి ఒకవైపు, మరోవైపు రాష్ట్రంలో కీలక బాధ్యతల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, యంగ్ లీడర్లు కొందరు సరికొత్త పల్లవి అందుకున్నారు. తెలంగాణలో కరువు కాటకాలు తాండవించాలని ఓ నేత క్షుద్ర పూజలు చేయించారంటూ వాగ్ధాటి దట్టించారు. ఈ తరం నాయకులూ శాస్త్రీయ ఆధారాలు లేని చేతబడుల గురించి కబుర్లు చెప్తుండడం విస్మయం కలిగిస్తోంది. కర్నాటక, తమిళనాడు ల్లోని ఫలానా ఆలయాల్లో ఆయన పూజలకు ఆయా నెలల్లో పూనుకున్నారని కథనాలు వండి వార్చారు. ఇంకా దుష్ట పూజలు చేయించబోతుంటేనే తాము బహిర్గతం చేస్తున్నామని కూడా సెలవిస్తున్నారు. చేతబడులు, క్షుద్ర పూజల వివాదాలు, ఆరోపణలు కొత్తకాదు. కానీ, జెన్ ఎక్స్ నుంచి నేటి జెన్ జీ, జెన్ ఆల్ఫా వరకూ ఆ కబుర్లు వినపడడం అవాంఛనీయం. సదరు రాష్ట్ర పెద్ద(ల) వ్యూహం, రాజకీయ లబ్ధి ఏందో కానీ, ఎండ్ ఆఫ్ ది డే వారి పార్టీ ప్రతిష్ఠకే మసక. తెలంగాణ కరువు కోరల్లో చిక్కుకోవాలని ఎవరు మాత్రం దుష్ట పూజలు చేస్తారు? పైగా అది మూఢనమ్మకం కూడా. పెద్ద పదవుల్లోని నేతల నోట ఇట్లా అశాస్త్రీయ వ్యాఖ్యలు చర్వితచరణంగా దొర్లడం శోచనీయం. నిజంగానే క్షుద్ర పూజలు, చేతబడులు పనిచేస్తే ఉదాహరణకు అమెరికా – ఇరాన్ ఇంతటి ఘర్షణల దాకా పోకుండా వాటిపైనే ఆధారపడకపోవునా? మూఢ నమ్మకాలపై చైతన్యంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన నేతలే ఇట్లా అపోహలను వ్యాప్తి చేయడం తగదు. రాజకీయ ఆరోపణలు చేసేందుకు ఎన్నో అంశాలు ఉంటాయి. కానీ ఈ రకమైన అభూత కల్పనలతో విమర్శలకు తావివ్వకూడదు.

> మన పేరు గొప్ప ప్రజాప్రతినిధులు 'అపోహల వంటకాల'తో సమాజాన్ని వెనక్కు లాగడం అసంబద్ధమే. ఎల్ నినో ఎఫెక్ట్ తో తెలంగాణలోనే కాదు, యావత్ దేశంలోనూ ఇతర దేశాల్లోనూ దుర్భిక్షం నెలకొంటోందని, వచ్చే సెప్టెంబరు కల్లా తీవ్రత పెరుగుతుందని శాస్త్రవేత్తలు, నిపుణులు, ఇతరులు అంచనా వేస్తున్నారు. మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వం ఎల్ నినో ప్రభావం మీద ఇదివరకే కమిటీ వేయించి, నివేదిక కూడా తెప్పించుకున్నది.

# సాగులో సాంకేతికత

వ్యవసాయం అంటే విత్తనం వేసి వాన కోసం ఎదురుచూసే రోజులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. రేపటి రైతు చేతిలో నాగలితోపాటు సెన్సర్లు ఉంటాయి; పొలంపై డ్రోన్లు ఎగురుతాయి; శాటిలైట్ ఇమేజెస్ పంట పరిస్థితిని చెబుతాయి; ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఏ సమయంలో నీరు, ఎరువు అవసరమో సూచిస్తుంది. నేలలోని సూక్ష్మజీవుల నుంచి విత్తనంలోని జన్యు లక్షణాల వరకు బయోటెక్నాలజీ వ్యవసాయంలోకి మరింత లోతుగా ప్రవేశిస్తోంది. అనుభవం విలువ తగ్గదు.. కానీ దానికి సైంటిఫిక్ నాలెడ్జ్ జతకావడం ఇక తప్పనిసరి.

ప్రపంచ వ్యవసాయానికి ఎదురవుతున్న సవాళ్లే ఈ మార్పును అనివార్యం చేస్తున్నాయి. సాగుభూమి పెంచే అవకాశం పరిమితం. నీటి వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. నేల సారం క్షీణిస్తోంది. క్లైమేట్ చేంజ్ కారణంగా వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో అనిశ్చితి పెరుగుతోంది. మరోవైపు పెరుగుతున్న జనాభాకు మరింత ఆహారం కావాలి. కాబట్టి భవిష్యత్తు వ్యవసాయానికి ఒకే మార్గం——తక్కువ రిసోర్సులతో ఎక్కువ, నాణ్యమైన దిగుబడి సాధించడం.

ఈ మార్పులో భారత్ ఇప్పటికే కీలక అడుగులు వేస్తోంది. సాయిల్ హెల్త్ కార్డ్ కార్యక్రమం ద్వారా రైతులకు నేలలోని పోషకాల స్థితి, పంటల వారీగా ఎరువుల సిఫారసులు అందుతున్నాయి. 2026 మార్చి నాటికి దేశంలో 25.89 కోట్లకు పైగా సాయిల్ హెల్త్ కార్డులు రూపొందించబడ్డాయి. అంటే "అంచనాతో ఎరువు" నుంచి "సాయిల్ టెస్ట్ ఆధారంగా ఎరువు" వైపు వ్యవసాయం కదులుతోంది.

తదుపరి విప్లవం డిజిటల్ అగ్రికల్చర్. భారత్-విస్తార్ వంటి బహుభాషా ఏఐ ప్లాట్‌ఫార్మ్స్ రైతులకు వాతావరణం, మార్కెట్ ధరలు, పంటల నిర్వహణ, తెగుళ్లు, నేల ఆరోగ్యం వంటి అంశాలపై ప్రాంతానుసారమైన సలహాలు అందించే దిశగా పనిచేస్తున్నాయి. కిసాన్ ఈ-మిత్ర, నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ వంటి కార్యక్రమాలు కూడా ఏఐ, మెషిన్ లెర్నింగ్, ఇమేజ్ అనాలిసిస్‌ను వ్యవసాయ నిర్ణయాలతో అనుసంధానిస్తున్నాయి. రైతు పొలంలోని ప్రతి వివరమూ డేటాగా మారుతున్న కొద్దీ, వ్యవసాయ నిర్ణయాలు కూడా మరింత ఖచ్చితంగా మారనున్నాయి.

డ్రోన్లు వ్యవసాయంలో మరో కీలక మార్పును తీసుకొస్తున్నాయి. పంటల పర్యవేక్షణ, పురుగుమందులు, నానో ఎరువులు, పోషక ద్రావణాల ఖచ్చితమైన స్ప్రేయింగ్‌లో వీటి వినియోగం పెరుగుతోంది. దీని అసలు ప్రయోజనం కేవలం టెక్నాలజీ ప్రదర్శన కాదు——అవసరమైన చోట, అవసరమైన సమయంలో, అవసరమైన మోతాదులో మాత్రమే ఇన్‌పుట్ వినియోగించడం. ఇదే ప్రెసిషన్ అగ్రికల్చర్ సారాంశం.



బయోఫెర్టిలైజర్లు, మైక్రోబయల్ టెక్నాలజీ కూడా భవిష్యత్తు వ్యవసాయానికి కీలకంగా మారుతున్నాయి. ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు నేలలోని సహజ పోషకాలను మొక్కలకు అందుబాటులోకి తేవడం, వేర్ల పెరుగుదలను ప్రోత్సహించడం, నేలలోని మైక్రోబియల్ ఎకాలజీని మెరుగుపరచడంలో సహాయపడగలవు. బయోఫెర్టిలైజర్లు, నానో ఫెర్టిలైజర్లు, ఆర్గానిక్ ఇన్‌పుట్స్, బాలెన్స్‌డ్ ఫెర్టిలైజర్ మేనేజ్‌మెంట్—— ఇవన్నీ సమన్వయంతో సాగితే రసాయన ఎరువులపై అనవసర ఆధారాన్ని తగ్గించవచ్చు.

విత్తన రంగంలోనూ అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ వేగంగా ముందుకు సాగుతోంది. 2014–2025 మధ్య భారత వ్యవసాయ పరిశోధనా వ్యవస్థ 2,996 క్లైమేట్-రెసిలియెంట్ క్రాప్ వెరైటీలను అభివృద్ధి చేసింది. కరువు, వరద, ఉప్పుతనం, అధిక ఉష్ణోగ్రత వంటి పరిస్థితులను తట్టుకునే పంట రకాలు భవిష్యత్తు ఆహార భద్రతకు కీలకం. మార్కర్-అసిస్టెడ్ సెలక్షన్, జీన్ ఎడిటింగ్, స్పీడ్ బ్రీడింగ్ వంటి ఆధునిక పద్ధతులు మెరుగైన వంగడాల అభివృద్ధిని వేగవంతం చేస్తున్నాయి.

ఇది భారత్‌కే పరిమితమైన పరిణామం కాదు. నెదర్లాండ్స్‌లో డేటా ఆధారిత గ్రీన్‌హౌస్ ఫార్మింగ్, ఇజ్రాయెల్‌లో నీటి-సమర్థ డ్రిప్ ఇరిగేషన్, స్మార్ట్ ఇరిగేషన్, అమెరికాలో ప్రెసిషన్ ఫార్మింగ్, జపాన్‌లో అగ్రికల్చరల్ రోబోటిక్స్, చైనాలో డిజిటల్ అగ్రికల్చర్ వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ప్రపంచం ఇస్తున్న సందేశం స్పష్టమే——వ్యవసాయ భవిష్యత్తు ఎక్కువ కెమికల్స్‌లో కాదు.. ఎక్కువ సైన్స్‌లో ఉంది.

> ప్రపంచ వ్యవసాయానికి ఎదురవుతున్న సవాళ్లే ఈ మార్పును అనివార్యం చేస్తున్నాయి. సాగుభూమి పెంచే అవకాశం పరిమితం. నీటి వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. నేల సారం క్షీణిస్తోంది. క్లైమేట్ చేంజ్ కారణంగా వర్షపాతం,

అయితే టెక్నాలజీ రైతుకు అందుబాటులోకి రాకపోతే ఈ విప్లవం అసంపూర్ణమే. చిన్న, సన్నకారు రైతులకు చౌకైన సెన్సర్లు, స్థానిక భాషల్లో ఏఐ సలహాలు, డ్రోన్లను అద్దెకు అందించే కస్టమ్ హైరింగ్ సెంటర్లు, నాణ్యమైన బయో-ఇన్‌పుట్స్, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు– స్టార్టప్‌లు– రైతుల మధ్య బలమైన ఎకోసిస్టమ్ అవసరం. ప్రయోగశాలలో పుట్టిన ఆవిష్కరణ పొలానికి చేరినప్పుడే దాని అసలు ప్రయోజనం కనిపిస్తుంది.

రేపటి రైతు "ఎంత ఎరువు వేయాలి?" అని మాత్రమే అడగడు. "నా నేలకు, నా పంటకు, ఈ వాతావరణంలో ఎంత అవసరం?" అని అడుగుతాడు. ఆ ప్రశ్నకు సమాధానం డేటా, బయాలజీ, బయోటెక్నాలజీ, ఏఐ, ప్రెసిషన్ ఫార్మింగ్ కలసి ఇస్తాయి.

వ్యవసాయం ఇక ప్రకృతితో పోరాడే రంగం కాదు.. ప్రకృతిని అర్థం చేసుకుని సైన్స్‌తో కలిసి పనిచేసే రంగం. ఫుడ్ సెక్యూరిటీ నుంచి సాయిల్ సెక్యూరిటీ వరకు, అధిక ఇన్‌పుట్స్ నుంచి సమర్థ వినియోగం వరకు సాగుతున్న ఈ పరివర్తనలో సైన్సే రైతుకు కొత్త దిక్సూచి. రేపటి వ్యవసాయాన్ని నడిపించేది కేవలం విత్తనం, నీరు, ఎరువు కాదు.. వాటిని తెలివిగా ఉపయోగించే శాస్త్రీయ ఆలోచనే.



హెచ్.ప్రతాప్
బాచిలర్స్ ఇన్ జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్స్( ఉస్మానియా)

## దింపుడుగల్లం

సుస్తిచేసి నేలతౌసుదీస్తే...
ఇటెంకల్ల ఎవరూ మల్లి చూడలేదు.
దావకానకు పోను శాతగాక,
ఇంట్లనే మురిగి సస్తే...
గప్పుడొచ్చిండ్రు సూడనికే!

పానంబొయినంక యాదికచ్చి,
లేని ఆరివారం సూపుతుండ్రు

ఎన్నడూ ఎట్లుండవని...
అరుసుకోను తీర్కె లేకపాయె

పూలు, పైసలు పీనిగేమీద గుప్పి
ఎగిసి పడ్తుండ్రు.

దింపుడుగల్లం కాడ...
కుండ దీరిగినంక...
నోట్ల బంగారం బెట్టాలంటే,
గుండు పోస పెట్టిండ్రు.

గప్పుడు....
కడుపున వుట్టిన పిల్లలు
మొకాలు మాడ్చుకుండ్రు,
తల్లి పొయ్యిందనిగాదు...
గుండుపోస పోయ్యిందని.

రాబందుల్లా...
పీనుగ పెయ్యిమీద
బంగారం పంపకాలకు...
బొందకాడ మస్తు లొల్లిజేసిండ్రు.

సంపదానం మీదున్న పానం
తల్లి మీద లేకపాయే....
పానమున్నప్పుడు పరాయిదైన తల్లి
పీనుగైనంక పైసల మూటాయే!

డా. ఆవుల రేణుక
9398268976



> ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ కుటుంబం మధ్య నెలకొన్న రాజకీయ విభేదాలు ఇప్పుడు వీధులపైకి చేరబోతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సుమారు 18 నెలల పాటు సుదీర్ఘ పాదయాత్రకు ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా, ఆయన సోదరి షర్మిల కూడా పాదయాత్ర చేయాలనుకుంటున్నారు. రాజన్న వారసత్వంపై తమకే హక్కు ఉందని ఇద్దరు నేతలు ప్రజల్లోకి వెళ్తుండటం ఏపీ రాజకీయాల్లో మును పెన్నడూ చూడని వింత పరిస్థితిని కల్పిస్తోంది. కేవలం అధికార పక్షాన్ని విమర్శించడమే కాకుండా, సొంత కుటుంబ సభ్యుల మధ్యే ఈ యాత్రల పోటీ సాగనుంది.



# పాద యాత్రలకు పాడుకాలం!!

తెలుగు రాష్ట్రాల రాజకీయం ఇప్పుడు సరికొత్త మలుపు తిరుగుతోంది. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో అగ్రనేతలంతా జనం బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. వచ్చే ఏడాది నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పాదయాత్రల జాతర మొదలుకాబోతోంది. ఒకప్పుడు అధికార మార్పిడికి అస్త్రంగా మారిన పాదయాత్రలు, ఇప్పుడు ఉనికిని చాటుకోవడానికి , వారసత్వ పోరులో పైచేయి సాధించడానికి ప్రధాన వేదికలుగా మారుతున్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ కుటుంబం మధ్య నెలకొన్న రాజకీయ విభేదాలు ఇప్పుడు వీధులపైకి చేరబోతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సుమారు 18 నెలల పాటు సుదీర్ఘ పాదయాత్రకు ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా, ఆయన సోదరి షర్మిల కూడా పాదయాత్ర చేయాలనుకుంటున్నారు. రాజన్న వారసత్వంపై తమకే హక్కు ఉందని ఇద్దరు నేతలు ప్రజల్లోకి వెళ్తుండటం ఏపీ రాజకీయాల్లో మునుపెన్నడూ చూడని వింత పరిస్థితిని కల్పిస్తోంది. కేవలం అధికార పక్షాన్ని విమర్శించడమే కాకుండా, సొంత కుటుంబ సభ్యుల మధ్యే ఈ యాత్రల పోటీ సాగనుంది.తెలంగాణలోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీకి పాత వైభవం తెచ్చేందుకు సిద్ధమవుతుంటే, ఆయన సోదరి కవిత స్వతంత్ర రాజకీయ ప్రయాణం మొదలుపెడుతున్నారు. కొత్త పార్టీ పెట్టిన సందర్భంలో పాదయాత్ర చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఒకే ఇంటి నుంచి అన్నచెల్లెళ్లు వేర్వేరు జెండాలతో ప్రజల ముందుకు రావడం అటు కార్యకర్తలను, ఇటు ప్రజలను అయోమయంలోకి నెట్టే అవకాశం ఉంది. ఈ పరిణామాలు గులాబీ దళంలో గందరగోళానికి దారితీస్తున్నాయి.మరోవైపు బీజేపీ అగ్రనేత బండి సంజయ్ తన ప్రజా సంగ్రామ యాత్ర తదుపరి దశను ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు. గతంలో ఆయన చేసిన యాత్రలు మంచి క్రేజ్ తెచ్చిపెట్టాయి. ఈ సారి కూడా తమదైన శైలిలో యాత్రలు చేపట్టి తమ బలాన్ని నిరూపించుకోవాలని చూస్తున్నారు. ఇలా అన్ని పార్టీల నేతలు రోడ్లపైకి రావడంతో తెలుగు రాష్ట్రాల వీధులన్నీ వచ్చే ఏడాది నుంచి జెండాలు, నినాదాలతో హోరెత్తిపోనున్నాయి. ఈ పాదయాత్రలు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా భారీ ఆర్థిక కదలికకు కారణమవుతున్నాయి. నేతల రాక కోసం ఏర్పాటు చేసే సభలు, ఫ్లెక్సీలు, ప్రచార వాహనాలు , సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ కోసం కోట్లాది రూపాయల ఖర్చు అవుతుంది. దీనివల్ల వేల మందికి తాత్కాలికంగా ఉపాధి లభిస్తుంది. మీడియా సంస్థలు, డిజిటల్ మార్కెటింగ్ ఏజెన్సీలు ఈ యాత్రల కవరేజీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించుతానాయి. ఒక రకంగా చెప్పాలంటే, రాజకీయం ఇప్పుడు ఒక పెద్ద ఈవెంట్‌లా మారిపోయింది. ఈ పాదయాత్రలు ఎవరిని గెలిపిస్తాయి అనేది పక్కన పెడితే, ప్రజల మధ్య నేతలు నిరంతరం ఉండటం ప్రజాస్వామ్యానికి మంచి పరిణామమే. అయితే ఈ నడకలు ప్రజల కష్టాలను తీర్చడానికా లేక కేవలం రాజకీయ ఆధిపత్యం కోసమా అనేది కాలమే తేల్చాలి. 2026 నుండి తెలుగు రాష్ట్రాల్లో రాజకీయం గరం గరంగా ఉండబోతుందనే విషయంలో ఎటువంటి సందేహం లేదు. నేతల నడక ప్రజల తీర్పును ఎలా మారుస్తుందో వేచి చూడాలి. కాగా..వైసీపీ అధినేత జగన్ బయటకు వస్తే.. ఆ పార్టీ నాయకులు జనాలను భారీగా తరలించడం అనేది కామనే. నిజానికి ఏ పార్టీ అయినా.. అధినేత బయటకు వస్తే.. జన సమీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వైసీపీలోనూ ఇదే తరహా రాజకీయాలు కొన్నాళ్లు సాగాయన్నది వాస్తవం. అయితే.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కారణాలు ఏవైనా.. వైసీపీ నాయకులు చెబుతున్న మాట ప్రకారం.. జగన్ వస్తుంటే జనాలే తరలి వస్తున్నారట. కొన్ని రోజుల కిందట శ్రీకాకుళం పర్యటనకు వెళ్లినప్పుడు తాజాగా తూర్పుగోదావరి పర్యటనలో జనాలు భారీగానే కనిపించారు. అయితే.. ఈ పరిణామాలను చూసి వైసీపీ నాయకులు మురిసిపోతున్నారు. జగన్ వస్తే జనాన్ని తరలించాల్సిన అవసరం లేదని.. జనాలే వారంతట వారు తరలి వస్తున్నారని చెబుతున్నారు. కానీ, రేపు భవిష్యత్తులో ఇదే వారికి శాపంగా మారే అవకాశం ఉంటుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పతిపరిణామాన్నీ ప్రభుత్వం నిశితంగా పరిశీలన చేస్తోంది. తాజాగా తూర్పులో ఓ మహిళకు చెందిన దుకాణాన్ని ధ్వంసంచేయడం, పొగాకు బేళ్లపై ఎక్కి తొక్కడం వంటివాటిని రికార్డు చేశారు. ఇదే కాదు.. శ్రీకాకుళంలో మహిళా ఎస్సైపై వైసీపీ నాయకులు చేసిన దౌర్జన్యం.. ఆమె ఇబ్బంది పడిన తీరు వంటివాటిని కూడా రికార్డు చేశారు. అలాగే గత ఏడాది గుంటూరు జిల్లాలో పార్టీ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లినప్పుడు మరో కార్యకర్త జగన్ కారు కిందనలిగి మృతి చెందాడు ఈ వ్యవహారంపై కేసు కూడా నమోదైంది. దీనిని కూడా అధికార పార్టీ దాచిపెట్టింది. ఇలా.. జగన్ పర్యటనలో జరుగుతున్న ప్రతి తప్పునూ టీడీపీ నాయకులు రికార్డు చేస్తున్నారు. పొరుగు రాష్ట్రంతమిళనాడు ఎన్నికలకు ముందు.. ప్రస్తుత సీఎం విజయ్ నిర్హించిన ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. దీంతో 40 మంది మృతి చెందారు. అలాగే.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ భారత్ జోడో పేరుతో పాదయాత్ర చేశారు. ఆ సమయంలోనూ తొక్కిసలాట జరిగింది. అయితే.. ఎవరూ ప్రాణాలు కోల్పోలేదు. బీహార్‌లో ప్రశాంత్ కిశోర్ పాదయాత్ర చేశారు. ఆ సమయంలో ఆయనపై దాడి చేసే ప్రయత్నం చేశారు. ఈ పరిణామాలపై కోర్టులు తీర్పు ఇచ్చాయి. పాదయాత్రల సమయంలో 500లకు మించి జనాలు లేకుండా చూసుకునే బాధ్యతను చెప్పాయి. ఇప్పుడు రేపు జగన్ పాదయాత్ర చేపడితే.. ఇప్పటి వరకు జరిగిన తప్పులను చూపించి ఆయన పాదయాత్రకు బ్రేకులు వేసే దిశగా ప్రభుత్వ పక్షం ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. సో.. ఏమైనా జనాలు వస్తున్నారని అనుకుంటే.. రేపు అసలు కార్యక్రమానికి ఎసరు వచ్చే ప్రమాదం ఉంటుందని అంటున్నారు పరిశీలకులు.



నండూరి రవిశంకర్,సీనియర్ జర్నలిస్ట్,
9912483642



# జాతీయం-అంతర్జాతీయం



## సవాళ్లు.. ప్రతి సవాళ్లు...




- హోం మంత్రి అమిత్ షా.. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సెటైర్లు
- నీట్ తోపాటు అన్ని అంశాలపై చర్చించాలంటూ డిమాండ్
- కేంద్రం సమాధానమివ్వాలని ప్రతిపక్షాల డిమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఎ.ఎం.ఎస్) :** పార్లమెంటు ఆవరణలో బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మీడియా వేదికగా సవాళ్లు విసురుకున్నారు. చర్చకు సిద్ధమని, సమాధానమిస్తానని అమిత్‌షా ప్రకటించగా.. అమిత్ షా ఉపన్యాసం పట్ల తమకు ఆసక్తి లేదని రాహుల్ కౌంటరిచ్చారు. పార్లమెంటులో ఏ ప్రశ్నకైనా సమాధానమిచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. బుధవారం ఆయన పార్లమెంటు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. నీట్ అంశానికి సంబంధించిన విద్యార్థుల నిరసనలు సహా అన్ని విషయాలపై బుధవారం మధ్యాహ్నం 3.00 గంటల నుండి గురువారం మధ్యాహ్నం 3.00 గంటల వరకు సమగ్ర చర్చ చేపట్టేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని అన్నారు. ''ఈరోజు మధ్యాహ్నం 2.00 గంటల లోపు ప్రతిపక్షాలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లిఖితపూర్వకంగా సమాచారం ఇస్తే, ఈ రోజు మధ్యాహ్నం 3.00 గంటల నుండి గురువారంమధ్యాహ్నం 3.00 గంటల వరకు చర్చను చేపట్టవచ్చు. చర్చ మొదలైతే, గురువారం మధ్యాహ్నం 3.00గంటలకు నేను సమాధానం ఇస్తాను'' అని హోంమంత్రి పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి తాను సభకు వస్తున్నానని, తనకు కేటాయించిన చాంబర్‌లో కూర్చుంటున్నానని అన్నారు. తాను స్వయంగా కూర్చుని, అన్ని అంశాలను నమోదు చేసుకుని సమాధానం ఇస్తానని అన్నారు. దీంతో దేశ ప్రజలకు అన్నీ స్పష్టంగా అర్థమవుతాయని చెప్పారు. అమిత్‌షా ప్రకటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ధీటుగా సమాధానమిచ్చారు. కేంద్ర హోంమంత్రి 'అభూతకల్పనలు' లేదా 'ఉపన్యాసాల' పట్ల తమకు ఆసక్తి లేదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. చర్చ జరిపే ప్రతిపాదనను ఆయన తిరస్కరించారు. తాను పదేపదే ''మనం'' అని అన్నప్పుడల్లా దేశ యువత గురించి ప్రస్తావిస్తున్నానని అన్నారు. విద్యార్థులపై ఎవరు కాల్పులు జరిపారు?, లాటీలు, మేకులు ఉన్న కర్రలతో విద్యార్థులను కొట్టాలని ఎవరు ఆదేశించారు?. మన పిల్లలపై కాల్పులు జరపమని అమిత్‌షా ఆదేశించారా, ఒక వేళ ఆదేశించి ఉంటే ఆయన రాజీనామా చేయాలని అన్నారు. కేంద్ర హోంమంత్రికి ఆ ధైర్యం లేదని, ఆయన సభకు రాలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఉభయ సభలు బుధవారం మధ్యాహ్నం 2.00 గంటల వరకు వాయిదా పడ్డాయి. విద్యార్థులపై పోలీసుల చర్యలపై కేంద్ర హోంమంత్రి సమాధానమివ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.



## వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఎ.ఎం.ఎస్):** వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దాంతో బిల్లు చట్టంగా మారనుంది. ఈ చట్టం ప్రకారం జాతీయ చిహ్నాలను అవమానించడం నేరం. మూడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. జాతీయ గేయాన్ని పాడకుండా అడ్డుకున్నా, అవమానించినా నేరంగా పరిగణిస్తారు.

## చిన్నారుల టీకాల్లో కోత

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం
- ఆయన ఉత్తర్వులపై వైద్య నిపుణుల విమర్శలు



వాషింగ్టన్, ఆగస్టు 12 : చిన్నారులకు ఇచ్చే టీకాల సంఖ్యను కుదించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించారు. గవదబిళ్లలు, తట్టు, రుబెల్లా వంటి వ్యాధులకు ఇచ్చే టీకాలను కూడా ఆయన విభజించారు. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. ఈ రోజు అవసరమైన టీకాలలో చాలా తక్కువ వాటిని మాత్రమే దశాబ్దాల క్రితం పిల్లలు తీసుకునే వారని ట్రంప్ చెప్పారు. 'ఆ రోజులలో ప్రజలు చాలా ఆరోగ్యంగా ఉండేవారు. అందుకే ఇప్పుడు మనం చూస్తున్న అధిక ఆటిజం రేట్లు అప్పుడు లేవు' అని అన్నారు. కాగా ట్రంప్ తాజా ఉత్తర్వుపై వైద్య నిపుణులు విమర్శలు కురిపించారు. టీకాల రేటు తగ్గితే చిన్నారులు హానికరమైన వ్యాధులకు గురవుతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికన్ అకాడమీ అఫ్ పీడియాట్రిక్స్ (ఏఏపీ) సిఫార్సు చేసిన 18 టీకాలను 11కు తగ్గించాలని ట్రంప్ తన ఉత్తర్వులో సిఫార్సు చేశారు. కాగా అమెరికాలో విద్యార్థులకు కావాల్సిన టీకాల సంఖ్యను కేంద్ర ప్రభుత్వం కాకుండా రాష్ట్ర స్థాయిలో నిర్ణయిస్తారు కాబట్టి ట్రంప్ ఉత్తర్వు కేవలం ఓ మార్గదర్శకంగానే పనిచేస్తుంది. అది తప్పనిసరి ఆదేశం కాదు.

## ఇరాన్‌కు భయపడిన ట్రంప్

- అందుకే నాటో సదస్సు నుంచి బయటకు
- వాషింగ్టన్ పోస్టులో కథనం

**న్యూయార్క్, ఆగస్టు 12 :** ఇరాన్ బెదిరింపుల కారణంగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో సదస్సు నుండి రహస్యంగా వెళ్లిపోయారని నివేదిక పేర్కొంది. ఈ మేరకు వాషింగ్టన్ పోస్ట్‌లో సోమవారం ఒక కథనం ప్రచురితమైంది. గత నెల టర్కీలోని అంకారాలో నిర్వహిస్తున్న నాటో సదస్సు నుండి ట్రంప్ మధ్యలోనే వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. ఎయిర్ ఫోర్స్ వన్‌లో ట్రంప్ ప్రయాణిస్తున్నట్లు వైట్‌హౌస్ చిత్రీకరించినప్పటికీ.. ఆయన ప్రత్యామ్నాయ సైనిక విమానంలో వెళ్లినట్లు నివేదిక తెలిపింది. ఇరాన్ బెదిరింపుల కారణంగానే ట్రంప్ ఈ చర్య తీసుకున్నట్లు కథనంలో పేర్కొంది. నాటో దేశాల నేతల వార్షిక సమావేశం ముగించుకుని వాషింగ్టన్‌కు తిరిగి ప్రయాణాన్ని ప్రారంభించినపుడు, తాము ట్రంప్‌తో పాటు ఒకే విమానంలో ఉన్నామని భావించేలా జర్నలిస్టులు, కొంతమంది వైట్‌హౌస్ సిబ్బందిని నమ్మించడం ద్వారా ఈ వ్యూహాన్ని అమలు చేసినట్లు తెలిపింది. వారాపత్రికల్లోని సమాచారం, ఆ కార్యకలాపాలపై అవగాహన ఉన్న ఒక అమెరికా అధికారి , ట్రంప్ పర్యటన గురించి తెలిసిన మరొక వ్యక్తిని వాషింగ్టన్ పోస్ట్ ఈ కథనంలో ఉటంకించింది. అసోసియేటెడ్ ప్రెస్ ఈ నివేదికను నిర్ధారించాల్సి వుంది.



## రాజ్యసభలో 'లుంగీవాలా' వ్యాఖ్యలు



- నోరు పారేసుకున్న బీజేపీ ఎంపీ
- అభ్యంతరం వ్యక్తం చేసిన సీపీఐ (ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఎ.ఎం.ఎస్) :** రాజ్యసభలో బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ చేసిన 'లుంగీవాలా' వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. తనను ఉద్దేశించే ఈ పదాన్ని ఉపయోగించారని ఆరోపిస్తూ....సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది వ్యక్తిగత వ్యాఖ్యగా చూడలేమని, దక్షిణ భారతీయుల సాంస్కృతిక గుర్తింపును కించపరిచే ప్రయత్నంగా భావించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సుస్మితా దేవ్‌పై ప్రత్యేక హక్కుల నోటీసు కూడా ఇచ్చారు.

బుధవారం ఉదయం రాజ్యసభ ప్రారంభమైన వెంటనే బ్రిట్టాస్ ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకెళ్లారు. తనను ఉద్దేశించి 'లుంగీవాలా' అనే పదాన్ని ఉపయోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష సభ్యులు బ్రిట్టాస్‌కు మద్దతుగా నిలవగా, అధికార పక్ష సభ్యులు సుస్మితా దేవ్ వాదనను కూడా సభ వినాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీంతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. 'లుంగీవాలా' వ్యాఖ్యను కేవలం వ్యక్తిగత అంశంగా చూడకూడదని బ్రిట్టాస్ అన్నారు. ప్రాంతం, భాష, సాంప్రదాయ దుస్తులను ఆధారంగా చేసుకుని పార్లమెంట్‌లో ఒక సభ్యుడిని లక్ష్యంగా చేసుకోవడం సరికాదని పేర్కొన్నారు. దక్షిణ భారత ప్రజలను ఒక రకమైన సాంస్కృతిక మూసలో చూపించేందుకు 'లుంగీవాలా' అనే పదాన్ని చారిత్రకంగా ఉపయోగించారని తెలిపారు. అలాంటి పదాన్ని పార్లమెంట్‌లో ఉపయోగించడం ద్వారా ప్రాంతీయ గుర్తింపును అవమానించే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## విదేశీ విరాళాల సవరణ బిల్లును రద్దు చేయాలి

- పార్లమెంటులో విపక్షాల డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఎ.ఎం.ఎస్) :** పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం' సవరణ బిల్లును రద్దు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఉభయ సభలు ఉదయం వాయిదా పడిన తర్వాత లోక్‌సభ సమావేశాలు తిరిగి మూడు గంటలకు ప్రారంభమయ్యాయి. కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ పై తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ వేణు గోపాల్ లోక్ సభలో ను పసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మైనార్టీలే లక్ష్యంగా సదురు బిల్లును రూపొందించారని ఆయన మండిపడ్డారు. బిల్లుపై అనేక లోపాలు ఉన్నాయని, విపక్షాలు సందేహాలు లెవనెత్తిన మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ఈ క్రమంలోనే విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం' సవరణ బిల్లును బుధవారం నాడు సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు అధికారికంగా పంపుతున్నట్లు స్పీకర్ తెలియజేశారు. మరోవైపు ప్రతిపక్షాల ఆందోళన మధ్యలోనే మైన్స్ అండ్ మినరల్స్ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది.

- ఏడుగురు మృతి

**ముంబయి, ఆగస్టు 12 (ఎ.ఎం.ఎస్) :** మహారాష్ట్రలోని ముంబై కుర్లా ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా బుధవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడ్డాయి. నివాస గృహాలపై కొండచరియలు పడటంతో ఏడుగురు మృతి చెందారు. మరో 6 నుంచి 8 మంది శిధిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. శిధిలాల నుంచి ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మిగతా వారిని బయటకు తీసేందుకు రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగిస్తోంది.


## విరిగిపడ్డ కొండచరియలు



## పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ భద్రతపై పుకార్లు

- ఆయన బతికే ఉన్నారా అంటూ సందేహాలు
- సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ
- సుప్రీంకోర్టు ఎదుట నిరసనకు పీటీఐ హెచ్చరిక

**ఇస్లామాబాద్, ఆగస్టు 12:** పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ భద్రతపై మరోసారి పుకార్లు షికార్లు చేస్తున్నాయి. రావల్పిండిలోని ఆడియాలా జైల్లో ఉన్న ఆయన ప్రాణాలతో ఉన్నారా? అనే సందేహాలు సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ తరుణంలో పాకిస్థాన్ జర్నలిస్ట్ వజహత్ సయీద్ ఖాన్ చేసిన ప్రకటన మాజీ ప్రధాని భద్రతపై నెలకొన్న ఆందోళనలను మరింత పెంచింది. ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న ఈ జర్నలిస్ట్ ''ఇమ్రాన్ జైలులోనే మరణించి ఉండొచ్చని ముగ్గురు సీనియర్ సైనిక వర్గాలు తనకు చెప్పాయి'' అని పేర్కొన్నారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు తమకు అనుమతి నిరాకరించారని ఆయన కుటుంబ సభ్యులు, పాకిస్థాన్ తెహ్రీక్‌ఎఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ నాయకుల ఆరోపణల వేళ.. వజహత్ ప్రకటన అత్యంత ఉద్రిక్తతలకు దారితీసింది. దీంతో ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితిపై పాకిస్థాన్ ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, జర్నలిస్ట్ తన వాదనను తాజాగా వెనక్కి తీసుకున్నారు. సైనిక ప్రధాన కార్యాలయానికి చెందిన ముగ్గురు సీనియర్ అధికారుల నుంచి అందిన సమాచారం నిఘావర్గాలు ధ్రువీకరించనిదని, అది వారి వ్యక్తిగత అంచనా మాత్రమేనని ఆయన తెలిపారు. ఇమ్రాన్ ఖాన్ మరణానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలను వారు స్వయంగా చూడలేదని జర్నలిస్ట్ స్పష్టం చేశారు. అవి కేవలం వారి 'భయాలు', 'ఆందోళనలు' మాత్రమేనని, పక్కా సమాచారం కాదని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా, ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై అప్‌డేట్ ఇవ్వకపోవడం, కుటుంబసభ్యులను కలిసేందుకు అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ 20 లక్షల మందితో సెప్టెంబరు 27న రాజధానివైపు లాంగ్ మార్చ్ నిర్వహిస్తామని ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి, పీటీఐ నేత సోహైల్ అఫ్రిది తీవ్రంగా హెచ్చరించారు. యువత ఆగ్రహాన్ని కట్టడి చేయడానికి సైన్యం కూడా సరిపోదని ఆయన హెచ్చరికలు చేశారు. ఈలోగా తమ నాయకుడ్ని కలవడానికి అనుమతించకుంటే సుప్రీం కోర్టు ఎదుట నిరసనకు దిగుతామని అటు పీటీఐ స్పష్టం చేసింది.



మరోవైపు, ఇమ్రాన్ ఖాన్ నిర్బంధం విషయంలో పాకిస్థాన్ ప్రభుత్వంపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతోంది. పాక్ మాజీ ప్రధాని ఆరోగ్యం గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు అమెరికాకు చెందిన 13 మంది చట్టసభ్యులు లేఖ రాశారు. ఆయనను రోజులో 23 గంటలు ఏకాంత బంధనంలో ఉంచుతున్నారని, ఆయన కుడికంటి చూపు తీవ్రంగా దెబ్బతిందని లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇమ్రాన్, ఆయన భార్య బుష్రా బీబీ హక్కుల స్థితిగతులపై పాకిస్థాన్ ప్రభుత్వంతో మాట్లాడాలని వారు కోరారు.

## నీట్ పై చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్నాం




- ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఎ.ఎం.ఎస్) :** నీట్ పేపర్ లీక్ కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను ఢిల్లీ కోర్టు బుధవారం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న 13మందికి వ్యతిరేకంగా సీబీఐ సమర్పించిన తుది నివేదికను ప్రత్యేక జడ్జి అజయ్ గుప్తా పరిగణనలోకి తీసుకున్నారు. ''పరీక్షల్లో పేపర్ లీక్‌లు, ఇతర అక్రమ వర్గాల వినియోగానికి సంబంధించిన క్రిమినల్ కేసుల'' విచారణ కోసం ప్రత్యేకంగా నియమించిన ఫాస్ట్ ట్రాక్ కోర్టులో సిబిఐ ఇటీవల తన తుది నివేదికను సమర్పించిన సంగతి తెలిసిందే. ఈ చార్జ్‌షీట్‌పై గురువారం నుండి కోర్టు విచారణ చేపట్టే అవకాశం ఉంది.

అయితే మైనర్‌లైన సాక్షుల పేర్లను మీడియా ప్రచారం చేస్తోందని.. చార్జ్‌షీట్‌లోని కొన్ని అంశాలు కూడా నిరంతరం మీడియాలో వస్తున్నాయని సిబిఐ కోర్టుకు తెలిపింది. కోర్టులో సమర్పించకముందే.. మీడియాలో ప్రచురితమవడం దిగ్భ్రాంతికరమని సిబిఐ పేర్కొంది. సాక్షుల పేర్లను మీడియా ప్రచురించడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. బాధ్యతాయుతమైన మీడియా ఇటువంటి చర్యలకు దూరంగా ఉండాలని కోర్టు సూచించింది.

## భారత పర్యాటకులకు యూఏఈ బంపర్ ఆఫర్

- ఉచిత వీసా సదుపాయానికి ఓకే
- ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదంటూ వెల్లడి



**దుబాయి, ఆగస్టు 12:** భారత్ నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) సందర్శనకు వెళ్లే పర్యాటకులకు ఆ దేశ ప్రభుత్వం అదిరిపోయే తీపి కబురు అందించింది. భారతీయ ప్రయాణికులను మరింతగా ఆకర్షించేందుకు, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఉచిత వీసా సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు యూఏఈ యంత్రాంగం సంచలన ప్రకటన చేసింది. ఈ ప్రత్యేక వెసులుబాటు ద్వారా భారత్ నుంచి వచ్చే పర్యాటకులు వీసా రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఎమిరేట్స్‌లో పర్యటించే అవకాశాన్ని పొందుతారు. ఈ ఉచిత వీసా ఆఫర్‌ను పొందడానికి యూఏఈ పర్యాటక శాఖ కొన్ని ప్రాథమిక అర్హత నిబంధనలను ఖరారు చేసింది. యూఏఈ పర్యాటక శాఖచే అధికారిక ఆమోదం పొందిన పర్యాటక భాగస్వాముల ద్వారా లేదా గుర్తింపు పొందిన ఆన్‌లైన్ రవాణా సంస్థల ద్వారా తమ ప్రయాణ టికెట్లను బుక్ చేసుకున్న వారికి మాత్రమే ఈ ప్రయోజనం అందుతుంది. ఎమిరేట్స్ పర్యటనలో భాగంగా అబుదాబీలోని హోటళ్లలో వరసగా కనీసం మూడు రాత్రులు బస చేసేలా ప్రణాళికలు రూపొందించుకున్న ప్రయాణికులకు మాత్రమే ఈ ఉచిత వీసా వెసులుబాటు వర్తిస్తుంది. భారతదేశ పాస్‌పోర్టు కలిగి ఉన్న పౌరులందరికీ ఈ ఉచిత వీసా ఆఫర్ అందుబాటులో ఉంటుందని యూఏఈ స్పష్టం చేసింది. అయితే ఈ ప్రత్యేక సదుపాయం అక్టోబరు 31వ తేదీ వరకు అమల్లో ఉంటుందని అధికారులు వివరించారు. యూఏఈలో పర్యటించాలని యోచిస్తున్న భారతీయ కుటుంబాలు, పర్యాటకులకు ఈ ఆఫర్ ద్వారా ప్రయాణ ఖర్చులు గణనీయంగా తగ్గడమే కాకుండా.. అబుదాబీలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శించే చక్కని అవకాశం లభిస్తుంది. యూఏఈ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల భారత్ నుంచి అబుదాబీకి వెళ్లే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. పర్యాటక శాఖ గుర్తింపు పొందిన సంస్థల ద్వారా పారదర్శకంగా టికెట్లు, హోటళ్లు బుక్ చేసుకోవడం ద్వారా ఎలాంటి అదనపు వీసా రుసుములు లేకుండా భారతీయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. అక్టోబర్ 31వ తేదీ వరకు గడువు ఉండటంతో రాబోయే రోజుల్లో పెద్ద సంఖ్యలో భారతీయ ప్రయాణికులు ఈ ఆఫర్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉంది.

## అత్యధికంగా దెబ్బతిన్నది సౌదీయే

- యుద్ధం నేపథ్యంలో విశ్లేషణలు
- అందుకే రక్షణ ఒప్పందంపై సంతకాలు

**మక్కా, ఆగస్టు 12:** గతవారం సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్థాన్‌లు సంయుక్త రక్షణ ఒప్పందంపై మక్కాలో సంతకం చేశాయి. నెలల తరబడి సాగిన చర్చలు, సమావేశాలు, ఊహాగానాల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యప్ ఎర్డోగన్, సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్, పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ ఈ మక్కా ఒప్పందంపై సంతకాలు చేశారు. దీనిని చాలామంది ' ఇస్లామిక్ నాటో 'గా అభివర్ణిస్తున్నప్పటికీ, ఆ పదాన్ని ఇంకా అధికారికంగా ఖరారు చేయలేదు. ఈ ఒప్పందంలోని ప్రధాన నిబంధన ఏంటంటే.. ఈ మూడు దేశాలలో దేనిపై దాడి జరిగినా దానిని మూడింటిపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. ''ఏదైనా దూకుడు చర్యకు వ్యతిరేకంగా సమిష్టి నిరోధక శక్తిని బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం ఉద్దేశించింది... ఈ మూడు దేశాలలో ఏ ఒక్క దానిపై సాయుధ దాడి జరిగినా దానిని అన్ని దేశాలపై జరిగిన దాడిగా పరిగణిస్తారు'' అని సంయుక్త ప్రకటన పేర్కొంది.

ఈసారి ఇండియాలో

## సూర్యగ్రహణం లేదు



- ఈసారి ఇండియాలో సూర్యగ్రహణం లేదు
- శాస్త్రవేత్తల వెల్లడి

**వాషింగ్టన్, ఆగస్టు 12:** ఆకాశంలో సూర్యగ్రహణం సంభవించనుంది. బుధవారం రాత్రి 9:04 గంటలకు గ్రహణం ప్రారంభమై, రాత్రి 11:16 గంటలకు గరిష్ఠ దశకు చేరుకుని, ఆగస్టు 13 తెల్లవారుజామున 1:27 గంటలకు ముగియనుందని శాస్త్రవేత్తల అంచనా. నాసా అంచనాల ప్రకారం ఈసారి సూర్యగ్రహణం భారతదేశంలో కనిపించదు. అందువల్ల భారతదేశంలో దీన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఉండదు. గ్రీన్‌ల్యాండ్, ఐస్‌లాండ్, ఉత్తర రష్యా, స్పెయిన్, యూరప్‌లోని అనేక ప్రాంతాలు, ఉత్తర అమెరికా, వాయవ్య ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణం కనిపిస్తుంది. మొత్తంగా చూస్తే, 2026 ఆగస్టు 12న ఏర్పడే సంపూర్ణ సూర్యగ్రహణం ప్రపంచంలోని పలు ప్రాంతాలకు అరుదైన ఖగోళ దృశ్యాన్ని అందించనుంది. భారత కాలమానం ప్రకారం ఆగస్టు 12న రాత్రి 9:04 గంటలకు గ్రహణం ప్రారంభమై, రాత్రి 11:16 గంటలకు గరిష్ఠ దశకు చేరుకుని, ఆగస్టు 13 తెల్లవారుజామున 1:27 గంటలకు ముగుస్తుందని జ్యోతిష్యులు చెబుతున్నాయి.

అయితే గ్రహణం జరిగే ప్రదేశాన్ని బట్టి స్థానిక సమయాలు మారుతాయి. నాసా వివరాల ప్రకారం వివిధ ప్రాంతాల్లో గ్రహణం సాయంత్రం లేదా రాత్రి సమయంలో కనిపించనుంది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి... కలెక్టర్

**ఖమ్మం వుదయం బ్యూరో ఆగస్టు -12**

ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. ఎల్‌నినో పరిస్థితులు, జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, వ్యవసాయంపై ప్రభావం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ నిపుణుల అంచనాలు, జిల్లాలో నెలకొన్న పరిస్థితులను కలెక్టర్ వివరించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో ఎల్‌నినో ప్రభావం బలంగా ఉండే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. రెండు మూడు రోజుల పాటు వర్షాలు కురిసిన వెంటనే సాధారణ వర్షపాతం ఉంటుందని భావించి రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలు సాగుకు వెళ్లవద్దని సూచించారు. ఆకాశంలో మేఘాలు ఏర్పడినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం తక్కువగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారని తెలిపారు. రైతులు వర్షాలను మాత్రమే కాకుండా భవిష్యత్తులో నీటి లభ్యతను కూడా దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోకుండా నీటి ఆధారిత పంటలను సాగు చేసే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందుగానే ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, భూగర్భ జలాల లభ్యతపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

**భూగర్భ జలాలు 6.5 నుంచి 8 అడుగుల మేర తగ్గాయి**

గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో ప్రస్తుతం భూగర్భ జల మట్టాలు సుమారు 6.5 నుంచి 8 అడుగుల మేర తగ్గాయని కలెక్టర్ తెలిపారు. బోర్లు ఉన్నాయనే కారణంతో వ్యవసాయం చేసుకోవచ్చని రైతులు భావించవద్దని సూచించారు. రానున్న నెలన్నర రోజుల్లో భూగర్భ జలాల లభ్యత మరింత తగ్గే అవకాశం ఉందని, ఈ పరిస్థితిని రైతులు ముందుగానే పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో నీరు

**రెండు, మూడు రోజుల వర్షాలను చూసి అధిక నీటి అవసరమయ్యే పంటలు సాగు చేయొద్దు**

**భూగర్భ జలాలను పొదుపుగా వినియోగిస్తూ త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించాలి**

**ఎల్‌నినో పరిస్థితులపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి..**

**మీడియాకు కలెక్టర్ సూచన**



అత్యంత విలువైన వనరులని, అందుబాటులో ఉన్న నీటిని అతితెలివిగా వినియోగించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. వచ్చే జూలై వరకు అందుబాటులో ఉన్న భూగర్భ జలాలను త్రాగు నీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంటుందని అన్నారు. వ్యవసాయ అవసరాలతో పాటు భవిష్యత్తులో ప్రజల తాగునీటి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగంపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

**తక్కువ నీటి అవసరమయ్యే పంటల సాగుకు ప్రాధాన్యత**

ప్రస్తుతం జిల్లాలో రైతులకు పొద్దు తిరుగుడు, పప్పుధాన్యాలు, కంది, పెసర తదితర తక్కువ నీటి అవసరమయ్యే పంటల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పప్పు ధాన్యాల విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నామని అన్నారు.నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతులు భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని కోరారు. సత్తుపల్లి ప్రాంతంలో రైతులు విస్తారంగా వరి సాగు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అక్కడి రైతులకు ఇప్పటికే పలుమార్లు వరి సాగు చేయవద్దని సూచించామని పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితిపై వాస్తవ సమాచారాన్ని రైతులకు చేరవేయడంలో మీడియా కూడా కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ కోరారు.

**వర్షపాతం, భూగర్భ జలాల వివరాలను మీడియాకు అందించాలి**

జిల్లాలో నమోదవుతున్న వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితికి సంబంధించిన సమాచారాన్ని క్రమం తప్పకుండా మీడియాకుఅందించాలనికలెక్టర్ సీపీఓను ఆదేశించారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతపై ప్రజలకు, రైతుల కు ఎప్పటి కప్పుడు వాస్తవ సమాచారాన్ని అందించాల్సిన అవసరం ఉంద న్నారు. ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో ముందస్తు అవగాహన కల్పించడం ద్వారా అధిక నీటి అవసరమయ్యే పంటల సాగును నియంత్రించవచ్చని, తద్వారా భవిష్యత్తులో నీటి సమస్యలను కొంతమేర నివారించవచ్చని కలెక్టర్ తెలిపారు.

**వర్షపు నీటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు**

జిల్లాలో సోక్‌పిట్లు, కమ్యూనిటీ సోక్ పిట్ల నిర్మాణం చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడంతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 80 వేల మంది రైతులను ఫామ్ పాండ్ల నిర్మాణానికి గుర్తించామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు సుమారు 3 వేల మంది రైతులు ఫామ్ పాండ్ల నిర్మాణానికి అంగీకారం తెలిపారని, అంగీకారం తెలిపిన రైతుల పొలాల్లో ఫామ్ పాండ్ల నిర్మాణపనులు చేపడుతున్నామని చెప్పారు. మిగిలిన రైతులను కూడా ఫామ్ పాండ్ల నిర్మాణానికి అంగీకరించేలా అధికారులు అవగాహన కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ కోసం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్లను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**వర్షాకాలం పూర్తయిన తర్వాతే కరువు పరిస్థితులపై నిర్ణయం**

ప్రస్తుతం జిల్లాలో తక్కువ వర్షపాతం లేదా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని నిర్ధారించలేమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత విధానాల ప్రకారం వర్షాకాలం పూర్తయిన అనంతరం మాత్రమే వర్షపాతం, పంటల పరిస్థితి, ఇతర సంబంధిత అంశాలను పరిశీలించి తక్కువ వర్షపాతం లేదా కరువు పరిస్థితులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ అన్నారు. రైతులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు.అనంతరం పాత్రికేయులు ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం, భూగర్భ జలాలు, పంటల సాగు, రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాలు, నీటి సంరక్షణ, తదితర అంశాలపై అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు.ఈ మీడియా సమావేశంలో ఇరిగేషన్ సిఈ వాసంతి, ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



**హనుమకొండ, ఆగస్టు 12 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

ఈ నెల 16న పరకాల పట్టణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారదలతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సభా ప్రాంగణం వద్ద తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య సేవలు, పారిశుధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులో ఉంచాలి.ట్రాఫిక్, పార్కింగ్ ప్రజలు, వీఐపీల రాకపోకలకు అంతరాయం కలగకుండా ముందస్తుగా పార్కింగ్ స్థలాలను గుర్తించి, ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలి. భద్రత & సమన్వయం: పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలి.సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క అధికారి సమష్టిగా కృషి చేసి, నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు, డీఆర్‌డీవోలు, జిల్లా రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్



**ములుగు/తాడ్వాయి, ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 16వ తేదీన ములుగు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోలతో కలిసి కలెక్టర్ పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.మేడారం పర్యటన, తాడ్వాయి మండలం మేడారంలో సీఎం హెలిప్యాడ్, కమాండ్ కంట్రోల్ రూమ్‌లతో పాటు వనదేవతల (సమ్మక్క-సారలమ్మ) ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. గిరిజన సంప్రదాయాల నడుమ సీఎం దర్శనానికి పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, ఆలయ పరిసరాల్లో గ్రానైట్ వ్యర్థాలను తొలగించి, ల్యాండ్‌స్కేపింగ్, పూల అలంకరణతో ఆకర్షణీయంగా సుందరీకరించాలని ఆదేశించారు.ములుగులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హెలిప్యాడ్, గట్టమ్మ వద్ద పైలాన్ నిర్మాణం, గట్టమ్మ దేవాలయం, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల (కలెక్టరేట్) సముదాయాన్ని పరిశీలించారు. పర్యటనకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి.విఐపి ప్రోటోకాల్, వీవీఐపీ వెయిటింగ్ టెంట్లు, బారికేడింగ్, పటిష్టమైన భద్రత మరియు వాహన పార్కింగ్ ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలి.కలెక్టరేట్ భవనం, ప్రాంగణాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి, ఆర్డీవో కృష్ణవేణి, డీఎస్పీ రవీందర్, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఆలయ ఈవో వీరస్వామి, ఆయా శాఖల ఈఈలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పితామహుడు గ్రంధాలయ శాస్త్రానికి డాక్టర్ రంగనాథన్ జయంతి

**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి, ఆగస్టు 12**



నల్గొండ పట్టణ కేంద్రంలో జిల్లా కేంద్ర గ్రంధాలయం నల్గొండ లో డాక్టర్ రంగనాథన్ జయంతి ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమలో జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ సీనియర్ అసిస్టెంట్ రాజేష్ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.కార్యదర్శి మాట్లాడుతూ రంగనాథన్ జాతీయ పితామహుడు అని గ్రంధాలయ శాస్త్రానికి ఐదు ప్రాధమిక సూత్రాలను ప్రతిపాదించారు అని వివరించారు ఈ కార్యక్రమలో రిటైర్డ్ లైబ్రేరియన్ నిర్మలా దేవి గ్రంధాలయ సిబంది పాఠకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ జి+1 మోడల్ కాలనీ పనుల్లో స్పీడు పెంచాలి - కలెక్టర్

**సూర్యాపేట, ఆగస్టు 12: వుదయం ప్రతినిధి**



ఇందిరమ్మ మోడల్ కాలనీ జి+1 ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, చిన్న చిన్న లోపాలు ఉన్నా వెంటనే రెక్టిఫై చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.హుజూర్ నగర్ రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీ ఇండ్లను జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తాం" అని తెలిపారు. ప్రతి బ్లాక్ లో ఇన్స్పెక్షన్లుఇటీవల మంత్రి ఆదేశాల మేరకు హౌసింగ్ యూనిట్లలోని ప్రతీ బ్లాక్ ను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇండ్లలో ఉన్న చిన్న చిన్న లోపాలను గుర్తించి వాటి జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఆ లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇండ్లతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని సూచించారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్ పనులు వేగవంతంఇండ్ల సముదాయం ప్రాంగణంలో మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన పునాది పనులు, డైనింగ్ హాల్ నిర్మాణాలు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్ లు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయిస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల మధ్య సమ న్వయ లోపం లేకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు.ఆర్డీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా ప్రాథమికంగా 1,805 మంది అర్హులైన లబ్ధిదారులతో జాబితాను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అయితే ఈ జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను ప్రత్యేక బృందాల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. "అర్హత లేని వారి పేర్లు ఉంటే తొలగిస్తాం. నిజమైన పేదలకు మాత్రమే ఇండ్లు కేటాయిస్తాం. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదు" అని కలెక్టర్ తేల్చి చెప్పారు. పాల్గొన్నవారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, పిడి హౌసింగ్ జబ్బర్ అహ్మద్, తహసిల్దార్ కవిత, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, గుత్తేదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు స్థిరమైన ఆదాయమే లక్ష్యం– కలెక్టర్

**జనగామ, ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి) :**



రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా సమీకృత, బహుళ అంతస్తుల (Multi-storied) సాగు విధానాలను అవలంబిస్తూ తక్కువ నీటితో అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ రఘునాథపల్లి మండలం కోమల్లతో పాటు ఘనపూర్ (స్టేషన్) మండలంలోని వివిధ గ్రామాలు, ఛాగల్‌లో క్షేత్రస్థాయి పర్యటన చేసి రైతులు చేపడుతున్న పంటల సాగు తీరును, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశీలించారు. కోమల్లలో బహుళ అంతస్తుల సాగు పరిశీలనరఘునాథపల్లి మండలం కోమల్ల గ్రామంలో రైతు మంద రాములు తన రెండు ఎకరాల క్షేత్రంలో చేపడుతున్న బహుళ అంతస్తుల సాగును కలెక్టర్ పరిశీలించారు. మునగ, సపోటా, సీతాఫలం, అరటి, అంజీర్, నిమ్మ వంటి ఉద్యాన పంటలతో పాటు బీర, సొర వంటి తీగజాతి కూరగాయలను ఒకే భూమిలో సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందడాన్ని అభినందించారు. తీగజాతి పంటలకు పందిళ్లు వేసేందుకు రాయితీలు అందించాలని, పండించిన ఉత్పత్తులకు రైతు బజార్లు, సమీప మార్కెట్లలో మెరుగైన ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఘనపూర్‌లో సమీకృత సాగు, డెమో ప్లాట్ ఏర్పాటుకు ఆదేశంఘనపూర్ (స్టేషన్)లో రైతు ఊర లింగయ్య పొలంలో టమోటా, చిక్కుడు, బెండ, బంతి పూల పంటల సాగును పరిశీలించారు. మల్చింగ్, డ్రిప్ మైక్రో ఇరిగేషన్, వేపనూనె వంటి సేంద్రియ నివారణ పద్ధతుల ప్రయోజనాలను వివరించారు. ఇతర రైతులకు అవగాహన కల్పించేలా ఈ క్షేత్రంలో డెమో ప్లాట్ ఏర్పాటు చేయాలని, సాయిల్ సోలరైజేషన్ వంటి శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహించాలని అధికారులకు ఆదేశించారు.ఛాగల్‌లో ఫార్మ్ పాండ్స్, ఆయిల్ పామ్ విస్తరణఛాగల్ గ్రామంలో రైతు చిక్కుల్ల రమేష్, చాదర బోయిన వెంకన్న పొలాలను పరిశీలించిన కలెక్టర్, భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రతి చుక్క నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వర్షపు నీటి నిల్వకు జిల్లాలో నిర్దేశించిన 1,500 ఫార్మ్ పాండ్స్ (పంట కుంటలు) లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. అలాగే దీర్ఘకాలిక లాభాలనిచ్చే ఆయిల్ పామ్ సాగు, దెంచా వంటి పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై రైతులను చైతన్యపరచాలని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి (DAO) అంబికా సోనీ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (DRDO) భాస్కర్, కేవీకే శాస్త్రవేత్త రమ్య, ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తాలిపేరు ప్రాజెక్టు, ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి)**



తాలిపేరు ప్రాజెక్టు, చర్లలోని ఏకలవ్య మోడల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. తొలుత తాలిపేరు ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్.. ప్రస్తుత నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి విడుదల, ప్రాజెక్టు నిర్వహణ, సిబ్బంది వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 73.80 మీటర్ల నీటిమట్టం ఉండగా.. పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లుగా ఉందని అధికారులు వివరించారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి ప్రధానంగా నీటి ప్రవాహం వస్తుందని, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రవాహం తక్కువగా ఉందని తెలిపారు. ప్రస్తుతం సుమారు 2,200 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోందని, రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని వివరించారు.తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 30 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ద్వారా సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతున్నట్లు వివరించారు. ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, గేట్ ఆపరేటర్లు, పంప్ ఆపరేటర్లను శాశ్వత ప్రాతిపదికన కేటాయించాలని అధికారులు కలెక్టర్‌ను కోరారు.అనంతరం కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్.. గేట్ల నిర్వహణ, నీటిమట్టం, నీటి ప్రవాహం తదితర అంశాలను ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు గేట్లు, ఇతర యంత్రాంగం నిరంతరం పనిచేసేలా నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు.

**నీటి వినియోగంలో ముందస్తు ప్రణాళిక**

వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్‌లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నీటి ప్రవాహంలో మార్పులను ఎప్పటికప్పుడు గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన సిబ్బంది, సాంకేతిక సహకారం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

**ఏకలవ్య పాఠశాలలో విద్యా ప్రమాణాల పరిశీలన**

అనంతరం చర్లలోని ఏకలవ్య మోడల్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వసతులు, భోజనం, వైద్య సేవలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని తెలుసుకోవడంతో పాటు వారితో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి అవగాహన, అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు.విద్యార్థుల నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పరిశీలించిన కలెక్టర్.. కొంతమంది విద్యార్థులతో పుస్తకాలు చదివించి వారి చదివే సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలు, వసతులపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

**నాణ్యమైన భోజనం అందించాలి**

పాఠశాల కిచెన్‌ను పరిశీలించిన కలెక్టర్.. వంటగది పరిశుభ్రత, వంట విధానం, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యత, రుచి, పరిమాణంపై విద్యార్థులను స్వయంగా అడిగితెలుసుకున్నారు. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని,విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన, పోషకవిలువలతో కూడిన ఆహారంఅందించాలని ఆదేశించారు.

**విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ**

పాఠశాల ఆవరణలోని హెల్త్ సెంటర్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందులు, మందుల నిల్వ, విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షల వివరాలను ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. అనంతరం హాజరు రిజిస్టర్‌తో పాటు పాఠశాలలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాప్రమాణాలు, ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం చదవడమే కాకుండా విషయాన్ని అర్థం చేసుకుని నేర్చుకునేలా బోధనా పద్ధతులను మెరుగుపరచాలని సూచించారు. పాఠశాలపరిసరాలు, తరగతి గదులు,వంటగది, హెల్త్ సెంటర్‌లో పరిశుభ్రతను పాటించాలని తెలిపారు.

## ఎంపీడీవో కార్యాలయం రికార్డులు, కేజీవిబి పాఠశాల ఆకస్మిక తనిఖీ -కలెక్టర్



**మహబూబాబాద్, ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి) :**

సమావేశక ఆజీవిక యోజనా పథకం అమలు, విత్తనాల పంపిణీ, సమావేశక ఆజీవిక యోజనా పథకం అమలు తీరును పరిశీలించిన కలెక్టర్ రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో 10 రకాల కూరగాయల విత్తనాల (సీడ్స్) కిట్లను (752) మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నాణ్యమైన పంటలు పండించాలని సూచించారు. సీడ్స్ వేసిన విధానం స్వయంగా పరిశీలించి వారి యొక్క ఆర్థిక సామాజిక స్థితిగతులను స్వయంగా పరిశీలించి వారితో మాట్లాడారు.స్థానిక రైతుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. DRDA (డిఆర్డిఏ) ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వేగవంతంగా జరుగుతున్న 'ఫార్మ్ పాంట్' (రైతు కుంటల) పనులను తనిఖీ చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మండల పరిధిలో అర్హులైన వివిధ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అందుతున్న పింఛన్ల పంపిణీ, తదితర అంశాలను తీరును పరిశీలించి, ఏ ఒక్క అర్హుడికి సంక్షేమ పథకాలు దూరం కాకూడదని స్పష్టం చేశారు.కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) అకస్మాత్తుగా తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థినులకు అందుతున్న విద్యాబోధన, భోజన వసతి, మరియు పారిశుధ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు,ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, ప్రత్యేక అధికారి వెంకటరమణ, ఉద్యానవన శాఖ అధికారి జి.మరియాన్న ఎమ్మార్వో బాలకృష్ణ, ఎంపీడీవో వైష్ణవి, ఆస్పిరేషనల్ బ్లాక్ అధికారి శ్రీనాథ్, సంబంధిత అధికారులు, రైతులు ఉన్నారు.

## ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలి.. కలెక్టర్




**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి ఆగస్టు 12.**

జిల్లా కలెక్టర్ డా. సత్య శారద బుధవారం ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రిలోని కంప్లైంట్ బాక్స్‌ను పరిశీలించారు. అనంతరం వివిధ వార్డులను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి వైద్యం అందుతున్న తీరుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సమస్యలపై వివరాలను తెలుసుకున్న కలెక్టర్ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంజీఎం డైట్ సెంటర్‌ను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోగులకు అందించే డైట్ సెంటర్, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఇన్‌చార్జిలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరిండెంట్ డాక్టర్ రామ్ కుమార్, డాక్టర్ అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

## కొలనుపాక వాగుపై హై లెవెల్ వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**యాదాద్రి భువనగిరి, 12/08/2026**



కొలనుపాక వాగుపై హై లెవెల్ వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలేరు, తేది: 12/08/2026 రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు శ్రీ బీర్ల అయిలయ్యగారు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొలనుపాక వాగు హై లెవెల్ వంతెన నిర్మాణ పనులను ఆలేరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మరియు మాజీ ఎంపీపీ (X-MPP) గంధమల్ల అశోక్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సంద ర్భంగా పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులకు, కాంట్రాక్టర్లకు తగు సూచనలు చేయడం జరిగింది.దశాబ్దాలుగా ప్రయాణ ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలకు ఈ వంతెన నిర్మాణం పూర్తయితే శాశ్వత పరిష్కారం లభిస్తుందని నాయకులు తెలిపారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్

**నిర్మల్ జిల్లా 12 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**




నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నందున జిల్లాలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కడ్తాల్ సమీపంలోని సాగర్ కన్వెన్షన్ లో 15వ తేదీన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి కార్యక్రమానికి ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని పేర్కొన్నారు. కొంతమంది లబ్ధిదారులను కార్యక్రమానికి ఆహ్వానించాలని అన్నారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, సరైన లైటింగ్, సౌండ్ సిస్టం ఉండేలా చూడాలన్నారు. ఎల్ఈడి తెరను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమానికి హాజరైన వారికి ఎప్పటికప్పుడు త్రాగునీరు అందిస్తూ ఉండాలన్నారు. సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, ఆర్డీఓ దేవిదాస్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తి మండల ప్రజా పరిషత్ సమావేశంలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేసిన కలెక్టర్

**పెద్దపల్లి (పాలకుర్తి) ఆగస్టు-12 (వుదయం ప్రతినిధి)**



పాలకుర్తి మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన వివిధ సమస్యలను జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి అంశాన్ని సంబంధిత అధికారులు పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను పెండింగ్ లో ఉంచకుండా శాఖల వారీగా సమన్వయంతో పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేకదృష్టిసారించాలని సూచించారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. రైతులు ఒకే రకమైన పంటలపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లేలా ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం పొందే అవకాశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.అవసరానికి మించి యూరియాను వినియోగించకుండా రైతులకు సూచనలు చేయాలని, సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా భూసారాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో రైతులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా, మురుగు కాలువలు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలనిసూచించారు.సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల ప్రత్యేక అధికారి జడ్పి సీఈఓ నరేందర్, ఎంపీడీవో రమేష్, తహసిల్దార్ రాజేశ్వర్ రావు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ

**కామారెడ్డి, ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి):**

**విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ**

**విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశం**



బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, జూనియర్ కళాశాల (బాలికల)ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతులు, భోజనం, పరిశుభ్రత తదితర అంశాలను వారు పరిశీలించారు.విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్, ఎస్పీగురుకుల తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ యం. రాజేష్ చంద్ర విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థినులతో ఒకే చోట కూర్చొని భోజనం చేస్తూ, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యత, రుచి, మెనూ అమలు, పరిశుభ్రతపై స్వయంగా తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉందని విద్యార్థినులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.విద్యార్థినులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందేలా చూడాలని, భోజన తయారీ ప్రదేశం, వంట సామగ్రి, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదులు, రికార్డుల పరిశీలన కళాశాలలోని తరగతి గదులను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి చదువులు, విద్యా ప్రగతి, కళాశాలలో అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో బోధనా విధానం, బ్లాక్‌బోర్డుపై రాసిన పాఠాలు, విద్యార్థుల విద్యా ప్రగతి, కళాశాల రికార్డులు, నివేదికలు, విద్యార్థులు సాధించిన ట్రోఫీలను పరిశీలించారు. అధ్యాపకులతో విద్యార్థుల విద్యా ప్రగతి, బోధనా పద్ధతులు, పరీక్షల ఫలితాలపై చర్చించారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి, ఉన్నత విద్యకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టికళాశాల ఆవరణ, విద్యార్థినుల వసతి సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం, పోషకాహారం, మెరుగైన వసతులు అందించడం అధికారుల బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి, డీసీఓ, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, గిర్దావర్, జీపీఓ, పంచాయతీ కార్యదర్శి తదితర అధికారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలు – కలెక్టర్



**ఆదిలాబాద్ :**

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకున్న వారే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని, గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు, విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదపడటంతో పాటు సమాజంలో సానుకూల మార్పులకు దారి తీస్తుందని పేర్కొన్నారు. చదువు ప్రతి ఒక్కరి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనమని, యువత తమ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీ తరహాలోనే ఇతర ప్రాంతాల్లో కూడా త్వరలో పబ్లిక్ రీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జందాపూర్ గ్రామంలో రహదారి సమస్యను ఆర్ అండ్ బీ అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని, గ్రామానికి నూతన అంగన్వాడీ భవనాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పరిశుభ్రత ప్రతి గ్రామ అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. గ్రామ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, గ్రామ సర్పంచ్ బత్తుల గంగమ్మ, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, తహసీల్దార్ గోవింద్, డీఎల్పీఓ ఫణిధర్, ఎంపీడీఓ కృష్ణవంశీ, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను పరిశీలన...

**జగిత్యాల ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి)**

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి... కలెక్టర్**

**సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి...**

**సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ...**



సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను పరిశీలించి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహంలోని విద్యార్థులకు అనుకూలంగా ఉండే విధంగా కిచెన్ షెడ్ నిర్మాణ పనులు నాణ్యతతో వేగవంతంగా నిర్మించాలని నిర్మాణ పనులలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపి సేవలు ఐపీ సేవలు రికార్డ్స్ ల్యాబ్ రికార్డ్స్ ఐపీ రికార్డ్స్ మెడికల్ ఫార్మసి పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలను గురించి నేరుగా పేషంట్లని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు మెరుగు పరచాలని డాక్టర్లు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. రోజుకు ఎన్ని ఓపి లను చూస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వర్షాకాలం వ్యాధుల పట్ల డెంగ్యూ వైరల్ ఫీవర్లకు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్స్పైర్ అయినటువంటి మెడిసిన్ ఉండకుండా చూసుకోవాలన్నారు పేషంట్లను వైద్యులు అందిస్తున్న వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని వున్న మంచినీటి సౌకర్యాలను కల్పించాలని అందించాలి ఆదేశించారు. ఈ తనిఖీలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె రాజ్ కుమార్ జిల్లా వైద్యాధికారి సుజాత ఎమ్మార్వో ఎంపిడివో ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీఆర్ఎంబీ ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులను తొలగించాలి: వినోద్‌కుమార్, గంగుల కమలాకర్ డిమాండ్

**కరీంనగర్ ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి):**



గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు 18వ సమావేశ ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులను వెంటనే తొలగించాలని మాజీ ఎంపీ బి. వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనే నీళ్ల కోసం జరిగిన పోరాటమని, కేసీఆర్ హయాంలో అన్ని చట్టబద్ధమైన అనుమతులతోనే ప్రాజెక్టులను నిర్మించినట్లు స్పష్టం చేశారు.తెలంగాణలోని 7 ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి ఎజెండా పంపడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏ విధంగా స్పందిస్తారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరడం, దాన్ని ఎజెండాలో పెట్టడం సరికాదన్నారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న భాజపా, కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఈ అంశంపై ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడుగుతుంటే ఎంపీలు మౌనం వహించడం సిగ్గుచేటని మండిపడ్డారు. వెంటనే ఎంపీలందరూ దిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి, జీఆర్ఎంబీ ఎజెండా నుంచి ఆ ప్రాజెక్టుల తొలగింపునకు పార్లమెంట్ వేదికగా గట్టిగా కొట్లాడాలని సూచించారు. ఒకవేళ అనుమతులు రద్దు చేస్తే రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు.ఈనెల 18లోగా ప్రాజెక్టులను జీఆర్ఎంబీ ఎజెండా నుంచి తొలగించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్రమైన ఆందోళనలు చేపడతామని నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తో పాటు, మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూళ్లను సందర్శించిన కలెక్టర్



**నిజామాబాద్ ఆగస్టు 12 :**

ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ మైనార్టీ బాలికల విద్యాలయాన్ని, తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కళాశాలలను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు. పాఠశాలల పరిసరాలను, కిచెన్, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. కేజీబీవీ పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే పరిసరాలను శుభ్రం చేయించాలని, వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలని అన్నారు. సువిశాలమైన ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నందున అన్ని వసతులతోకూడిన క్రీడా మైదానంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేసి, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని, పాఠశాలల ప్రవేశ మార్గంలో ప్రధాన ద్వారం వద్ద అందరికీ కనిపించేలా మెనూ బోర్డును ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. కేజీబీవీలో బాలికల సంఖ్య తక్కువగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, ఇతర విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించే విషయమై సంబంధిత రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడతానని అన్నారు. పాఠశాలలో కొనసాగుతున్న ప్రహరీ గోడ నిర్మాణం పనుల నాణ్యతను పరిశీలించారు. ఆర్.ఓ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, జిల్లా వ్యాప్తంగా గల అన్ని కేజీబీవీలలో ఆర్.ఓ ప్లాంట్లు, సోలార్ హీటర్లు వినియోగంలోకి తెచ్చేందుకు మరమ్మత్తులు చేయించాలని అధికారులను ఆదేశించారు. రెసిడెన్షియల్ కళాశాల ఆవరణలో వరి ధాన్యం, ఇతర కూరగాయలను సాగు చేస్తుండడాన్ని గమనించిన కలెక్టర్ నిర్వాహకులను అభినందించారు. బాలికల ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం పదవ తరగతి క్లాస్ రూమ్ లను సందర్శించి, విద్యార్థినులకు ఆంగ్లం సబ్జెక్ట్ లో పాఠాలు బోధించారు. పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని విద్యార్థినులకు ప్రేరణ కల్పించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ దత్తాత్రి, ఎంఈఓ గాలప్ప, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ దీపిక, రెసిడెన్షియల్ స్కూల్ సహాయ ప్రిన్సిపాల్ సురేఖ తదితరులు ఉన్నారు.

## పీఆర్సీ కోసం టీచర్ల సమరభేరి

**సెప్టెంబర్ 1న మహాధర్నా పీఆర్టీయూటీఎస్**



**ధర్మపురి ఆగస్ట్12(వుదయం ప్రతినిధి):**

పీఆర్సీ సాధన కోసం సెప్టెంబర్ 1న రాష్ట్ర రాజధానిలో 51 వేల మంది ఉపాధ్యాయులతో మహా ధర్నా నిర్వహించనున్నట్లు పీఆర్టీయూటీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి ఆనంద రావు తెలిపారు.బుధ వారం ధర్మపురి మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.గత ప్రభుత్వం ఉపాధ్యాయులను నిర్లక్ష్యం చేసి తగిన మూల్యం చెల్లించుకుందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా మూడేళ్లు గడుస్తున్నా పీఆర్సీ ప్రకటించకపోవడం విచారకరమని విమర్శించారు.51% ఫిట్‌మెంట్ పీఆర్సీతో పాటు సీపీఎస్ రద్దు, సర్వీస్ రూల్స్, 317 జీవో సమస్యల పరిష్కారం, మహిళా ఉపాధ్యాయులకు 180 రోజుల చైల్డ్ కేర్ లీవ్, ఖాళీ పోస్టులకు జాబ్ చార్ట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.సెప్టెంబర్ 1 మహాధర్నాను ఉపాధ్యాయులంతా తరలివచ్చి జయప్రదం చేయాలని మండల నాయకులు వేణుగోపాల్,కిరణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గణేష్, శివ ప్రసాద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో మందగమనంపై మంత్రి అడ్లూరి తీవ్ర ఆగ్రహం

**ధర్మపురి ఆగస్ట్12(వుదయం ప్రతినిధి):**

**లక్ష్యాలకు అనుగుణంగా షెడ్యూల్ రూపొందించాలి**

**ధర్మపురి అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో కలిసి మంత్రి సమీక్ష**



ధర్మపురి నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల ను వేగవంతం చేసి నిర్ణీత గడు వులోగా పూర్తి చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదే శించారు.బుధవారం సమీకృత కలెక్ట రేట్ లో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తో కలిసి వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమా వేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పనుల పురోగతి సంతృప్తికరంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, అవసర మైతే బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. రోళ్లవాగు షట్టర్ పనులను ఆగస్టు నెలాఖరుకల్లా,అక్కేపల్లి లిఫ్ట్ పనులను జనవరి 2027 నాటికి పూర్తి చేయాలి. యశ్వంత రావు పేట, రంగ ధాంపల్లి చెరువు ల అంచనాలకు వెంటనే ఆమోదం తెలపాలి.తొలిదశలో మంజూ రైన 2,756 ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి.ఇల్లు కట్టుకునేం దుకు ఆర్థిక ఇబ్బందులు ఉన్న లబ్ధిదా రులకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణా లు అందించాలి.ధర్మపురిని గుడి సెలు లేని నియోజకవర్గంగా మార్చడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రూ.3.14 కోట్లతో చేపడుతున్న కోరండపల్లి చెరువు పునరుద్ధరణ పనులను జూన్ 2027 నాటికి పూర్తి చేసి నీటితో నింపాలి. యంగ్ ఇండి యా ఇంటిగ్రేటెడ్ స్కూ ల్ నిర్మా ణాన్ని తక్షణమే ప్రారంభించాలి. ధర్మపురి అభివృద్ధికి సంబంధిం చిన వివరాలను కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీక్షలో వివరించారు.ఆర్అండ్‌బీ రూ.463 కోట్లతో 26 పనులు మంజూరవ్వగా,10 పనులు పూర్తయ్యా యి.12 పనులు పురోగతిలో ఉన్నాయి.తాగునీటి సరఫరా అమృత్ 2.0 కింద రూ.23 కోట్లతో చేపట్టిన పనులను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటు న్నాం.విద్యాశాఖ టీజీఈడబ్ల్యు ఐడీసీ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ.200 కోట్లు సహా మొత్తం రూ.234 కోట్ల పనులు మంజూ రయ్యాయి.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజగౌడ్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు,ఎంపీడీవో లు,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య: కలెక్టర్

**మంచిర్యాల జిల్లా, ఆగస్టు 12 (వుదయం):**



ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, మూత్రశాలలు, వసతి, వంటశాల, సామాగ్రి నిల్వ గది, పరిసరాలతో పాటు కొనసాగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం చెన్నూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పూర్తి కాబడిన భోజనశాలను పరిశీలించి విద్యార్థుల సౌకర్యార్థం వినియోగించాలని, అదనపు గదుల పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మధ్యాహ్న భోజనం తయారీలో శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి వంటశాల, మూత్రశాలలు, కొనసాగుతున్న అదనపు గదుల పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం అయినందున పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఎమ్మెల్యేను కలిసిన జిల్లా రవాణా శాఖ అధికారి

- మర్యాదపూర్వక భేటీ.. పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు

**గద్వాల ఆగస్టు 12 (వుదయం బ్యూరో)**



జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని జిల్లా రవాణా శాఖ అధికారి రాధిక బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో రవాణా శాఖకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురి మధ్య సౌహార్దపూర్వకంగా చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రజలకు రవాణా సేవలు మరింత మెరుగ్గా అందేలా శాఖాపరమైన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరంపై చర్చించినట్లు సమాచారం.ఎమ్మెల్యేను జిల్లా రవాణా శాఖ అధికారి మర్యాదపూర్వకంగా కలవడం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.



## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

**మహబూబ్ నగర్ ఆగస్టు12 (వుదయం ప్రతినిధి)**

భూత్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో పారిశుద్ధ్య చర్యలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బుధవారం పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించిన ఆయన, విద్యార్థులు, ఉపాధ్యాయులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పాఠశాల అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా చెత్త, వ్యర్థ పదార్థాలు పేరుకుపోకుండా చూడాలని, పిచ్చిమొక్కలు, పొదలు, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ముఖ్యంగా పాములు దాగేందుకు అవకాశం ఉన్న పొదలు, చెత్తాచెదారం, ఇతర ప్రదేశాలను పూర్తిగా శుభ్రం చేయాలని ఆదేశించారు.విద్యార్థులు, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పాము కాట్ల నివారణకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## హెచ్ఐవీ నివారణకు అవగాహనే ఆయుధం



- జిల్లా కలెక్టర్ హిమంత కేశవ్ పాటిల్
- నాగర్‌కర్నూల్‌లో భారీ అవగాహన ర్యాలీ ప్రారంభం
- ఆగస్టు 12 నుండి అక్టోబర్ 12 వరకు ముమ్మర ప్రచారం

**నాగర్ కర్నూల్ ఆగస్టు 12 (వుదయం బ్యూరో):**

హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టడంలో ప్రజల్లో అవగాహన అత్యంత కీలకమని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ & జిల్లా మెజిస్ట్రేట్ హిమంత కేశవ్ పాటిల్ అన్నారు. హెచ్ఐవీపై ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు.తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ముమ్మర IEC ప్రచార కార్యక్రమం-2026లో భాగంగా బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 12 నుండి అక్టోబర్ 12 వరకు జిల్లావ్యాప్తంగా హెచ్ఐవీ మరియు ఎయిడ్స్ నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణ వార్డుల్లో ర్యాలీలు, పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, బైక్ ర్యాలీలు, ఇంటింటికి వెళ్లి కరపత్రాల పంపిణీ చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు.

అనంతరం "ప్లెడ్జ్ ఫ్రీ" సెల్ఫ్ రిస్క్ అసెస్మెంట్ యాప్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ద్వారా తమకు హెచ్ఐవీ సోకే అవకాశం ఎంతవరకు ఉందో స్వయంగా అంచనా వేసుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా యువత ఈ సెల్ఫ్ అసెస్మెంట్ చేసుకోవాలని సూచించారు."Be Positive To Prevent HIV Positive" అనే నినాదంతో చేపడుతున్న ఈ ప్రచార కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ నివారణ, ముందస్తు పరీక్షలు, వైద్య సేవలు, చికిత్సకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. కె. కృష్ణ, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్. రవి నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్. రఫీక్, డాక్టర్. కే. రవికుమార్, డాక్టర్. కృష్ణమోహన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్. భరత్ కుమార్ రెడ్డి, డాక్టర్. వాణి, జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాల్ చారి, డిపిఓ రేనయ్య, దిశా మేనేజర్ రమేష్, ఎంఎల్‌హెచ్‌పిలు, బాదం రాజేష్ కుమార్ ఐసిటిసి కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎంఆర్డీఎస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట, ఆగస్టు 12 (వుదయం బ్యూరో)**



సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఆవరణ పక్కన ఉన్న ఈవీఎం భద్రతా గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిబంధనల ప్రకారం నిర్వహించే నెలవారీ తనిఖీల్లో భాగంగా ఆమె గోదాం పరిసరాలను తిరుగుతూ భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. అనంతరం నిర్వహణ చిట్టా (లాగ్ బుక్)ను పరిశీలించి, సందర్శకుల పుస్తకంలో సంతకం చేశారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ 24 గంటల పహారా బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గోదాం పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.

## విద్యార్థుల కెరీర్ నైపుణ్యాల అభివృద్ధికి 'స్కిల్‌ప్లస్'కు శ్రీకారం

**సంగారెడ్డి, ఆగస్టు 12:వుదయం.**



విద్యార్థులను ఉన్నత విద్యతో పాటు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు సిద్ధం చేయడంతో పాటు, అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ డిగ్రీ కళాశాల ఫర్ ఉమెన్‌లో 'స్కిల్‌ప్లస్' నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.ఎన్‌బీవీ స్కిల్లింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఐబీటీ హైదరాబాద్ సహకారంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఎనిమిది నెలల పాటు కొనసాగనుంది. ఇందులో విద్యార్థులకు కెరీర్ సాధన నైపుణ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వృత్తిపరమైన నైపుణ్యాలు, కెరీర్ అవకాశాలపై ఇంటర్వ్యూ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు.దీపప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌బీవీ స్కిల్లింగ్ ఫౌండేషన్ సీఈఓ రాజలలి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం విద్యార్హతలు మాత్రమే కాకుండా కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం, వృత్తిపరమైన ప్రవర్తన వంటి నైపుణ్యాలు ఎంతో ముఖ్యమన్నారు. 'స్కిల్‌ప్లస్'ను కేవలం ధ్రువపత్రం కోసం చేసే కోర్సుగా కాకుండా, భవిష్యత్ కెరీర్‌ను నిర్మించుకునే అవకాశంగా విద్యార్థులు భావించాలని సూచించారు.

**సెయింట్ ఆంథోనీస్–ఎన్‌బీవీ స్కిల్లింగ్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం**

స్కిల్‌ప్లస్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడంలో భాగంగా సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థలు, ఎన్‌బీవీ స్కిల్లింగ్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి, ఎన్‌బీవీ స్కిల్లింగ్ ఫౌండేషన్ సీఈఓ రాజలలి ఒప్పందం పై సంతకాలు చేశారు.ఈ సందర్భంగా విజయ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యం, వృత్తిపరమైన నైపుణ్యాలను అందించడం నేటి విద్యావ్యవస్థలో ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఐబీటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో మార్గదర్శకత్వం**

ఐబీటీ హైదరాబాద్ స్కిల్‌ప్లస్ కార్యక్రమ ప్రోగ్రామ్ మేనేజర్ శేఖర్ గొన్నె విద్యార్థులకు కోర్సు నిర్మాణం, శిక్షణ విధానం, అభ్యాస ప్రక్రియపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా శిక్షణలో పాల్గొని, నిర్దేశించిన కార్యకలాపాలను పూర్తి చేసి, నేర్చుకున్న నైపుణ్యాలను ఆచరణలో పెట్టాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ బి. జవహర్, అకడమిక్ కౌన్సిలర్ డా. కృష్ణ కుమారి విద్యార్థులను అభినందిస్తూ.. స్కిల్‌ప్లస్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి. జవహర్, అకడమిక్ కౌన్సిలర్ డా.కృష్ణ కుమారి, ఐబీటీ హైదరాబాద్ స్కిల్‌ప్లస్ ప్రోగ్రామ్ మేనేజర్ శేఖర్ గొన్నె తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల ఆక్రందన.. పట్టింపు లేని పాలన!

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో నరకయాతన.. చుక్క తాగునీటికీ తిప్పలే!
- కుర్చీలు లేవు.. వసతులూ లేవు.. పీడీఎస్‌యూ ఆగ్రహజ్వాల
- డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం సమర్పణ

**గద్వాల ఆగస్టు 12 (వుదయం బ్యూరో)**



వైద్యం కోసం ప్రభుత్వ దవాఖానా మెట్లెక్కే పేద, మధ్యతరగతి ప్రజలకు అక్కడ అడుగడుగునా 'సేవ' దక్కకపోగా, అవస్థలే ఎదురవుతున్నాయి. మౌలిక వసతులు మృగ్యమై, కనీస సదుపాయాలు కరువై రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి ఆసరాగా నిలవాల్సిన ప్రభుత్వ ఆసుపత్రులు.. సమస్యల నిలయాలుగా మారడంపై పీడీఎస్‌యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిత్యం వందలాదిమంది వచ్చే దవాఖానాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించింది. బుధవారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) సంధ్యా కిరణ్మయికి వినతిపత్రం సమర్పించింది. దాహార్తితో అలమటిస్తున్న రోగులు! ఆసుపత్రికి వచ్చే రోగులకు, వారి వెంట వచ్చే బంధువులకు స్వచ్ఛమైన తాగునీరు కూడా అందుబాటులో లేకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందని పీడీఎస్‌యూ నాయకులు మండిపడ్డారు. గంటల తరబడి నిరీక్షించే బాధితులకు కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా లేక నేలపైనే పడుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించకుండా మెరుగైన వైద్యం ఎలా అందిస్తారని నిలదీశారు. అలసత్వం వీడకపోతే పోరాటమే! వైద్యులు, సిబ్బంది సమర్థవంతంగా సేవలు అందించాలంటే వారికి అవసరమైన పరికరాలు, మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత యంత్రాంగానిదేనని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష స్పష్టం చేశారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని తలక్రిందులు చేసే నిర్లక్ష్య వైఖరిని సహించేది లేదని, వెంటనే సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులలో తాగునీరు, కూర్చునే సదుపాయాలతో పాటు అన్ని మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు విజయ్, కలీమ్, కార్తీక్ పాల్గొన్నారు.

## అనుభవపూర్వక అభ్యాసానికి గీతం పెద్దపీట

- ఆటోడెస్క్ ఫ్యూజన్ ఇన్ సైడర్ కార్యక్రమం ఏర్పాటు
- చురుకుగా పాల్గొన్న విద్యార్థులు

**పటాన్చెరు (వుదయం):**




వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంజనీరింగ్, సాంకేతిక రంగాలలో రాణించడానికి అవసరమైన పరిశ్రమతో అనుబంధం, అనుభవపూర్వక అభ్యాసాలకు హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా, గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు 'ఆటోడెస్క్ ఫ్యూజన్ ఇన్ సైడర్' పేరిట నైపుణ్య పెంపుదల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించింది. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందడానికి, ఉత్పత్తి రూపకల్పన, ఇంజనీరింగ్ లోని తాజా పరిణామాలను అర్థం చేసుకోవడానికి ఇది ఒక అవకాశాన్ని కల్పించింది.

క్వాలిటీ అస్యూరెన్స్ మేనేజర్ సుజయ్ డిసౌజా నేతృత్వంలోని ఆటోడెస్క్ పరిశ్రమ నిపుణులతో కూడిన ఎనిమిది మంది బృందం, విద్యార్థులతో సంభాషించి, అభివృద్ధి చెందుతున్న ఇంజనీరింగ్, ఉత్పత్తిఅభివృద్ధి రంగంపై విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. కొత్త ఆటోడెస్క్ ఉత్పత్తుల పరీక్ష, అనువర్తనాన్ని కూడా ప్రదర్శించి, విద్యార్థులకు అధునాతన రూపకల్పన, ఇంజనీరింగ్ సాధనాలపై ప్రత్యక్ష అనుభవాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, విద్యార్థులకు మూడు వారాల వ్యవధిలో పూర్తి చేయడానికి రూపకల్పన, అనుకరణ, సాంకేతిక చిత్రలేఖనం, చిత్రీకరణ (design, simulation, technical drawing and rendering)తో కూడిన డిజైన్ సవాళ్లు ఇచ్చారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ప్రాజెక్టు బృందాలు, వ్యక్తిగత ప్రతిభావంతులను వారి పనితీరు, ప్రాజెక్టు ఫలితాల ఆధారంగా అవార్డులతో సత్కరించనున్నారు.విద్యార్థులు, నిజ జీవిత సవాళ్లను పరిష్కరించడానికి ఇంజనీరింగ్ పరిజ్ఞానం, డిజైన్ థింకింగ్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను ఎలా అన్వయించగలరో ప్రదర్శిస్తూ, బరువును మోయగలిగే ఎక్సోస్కెలిటన్, స్వయంప్రతిపత్తితో పనిచేసే నదీ శుభ్రత రోబోట్ వంటి వినూత్న ఉత్పత్తిఅభివృద్ధి భావనలను కూడా ప్రదర్శించారు.

కోర్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ రమేష్ వడ్డి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జయ ప్రకాష్ శ్రీవాస్తవ, ఆటోడెస్క్ ప్రతినిధులకు స్వాగతం పలికి, వారిని సత్కరించారు. ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అధ్యాపకుడు డాక్టర్ వీరప్రతాప్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొని, ఆటోడెస్క్ నిపుణులతో అర్థవంతమైన చర్చలలో నిమగ్నమయ్యారు. విద్యార్థులు ఉత్సాహంగా ప్రశ్నలడిగి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను బలోపేతం చేసుకోవడానికి, పరిశ్రమ పోకడలను అన్వేషించడానికి, అధునాతన ఇంజనీరింగ్ సాంకేతికతల ఆచరణాత్మక అనువర్తనాలను అర్థం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఒక సుసంపన్నమైన వేదికను అందించింది.

## సాగునీటి సలహా మండలి సమావేశ ముఖ్యాంశాలు

**వనపర్తి ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి)**




ప్రపంచ వ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం ఉన్నందున ఈసారి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉన్నందున ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకొని ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని : రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు.జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు ఎంత నీరు వస్తుంది ఎంత వదులుతున్నామనే విషయాలని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు: రాష్ట్ర పశు సంవర్ధక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులను ఆరుతడి పంటలకే వెళ్లే విధంగా ప్రోత్సహించాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశు సంవర్ధక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా పాల్గొని రైతులకు సాగు నీరు అందించేందుకు గల అవకాశాలపై ఉమ్మడి జిల్లాల శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించారు.

ఎల్ నినో కారణంగా కరువు పరిస్థితులు, ఉమ్మడి జిల్లా పరిధిలోని జూరాల, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఆర్డీఎస్, కే ఎల్ ఐ, బీమా తదితర ప్రాజెక్టుల్లో ప్రస్తుత నీటిమట్టం రాబోయే రోజుల్లో సాగు, తాగు అవసరాలకు సంబంధించి నీటి నిల్వలపై నీటిపారుదల శాఖ, వ్యవసాయ అధికారులతో కలిసి మంత్రులు చర్చించారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో రైతులకు సాగునీటి విడుదలకు సంబంధించిన సాధ్యసాధ్యాల పైన కూడా చర్చించి పలు సూచనలు చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం ఎగువన ఉన్న ప్రాంతాల్లో వర్షాలు కురిసిన నేపథ్యంలో అక్కడి నుంచి వరద రావడం వల్ల ప్రస్తుతానికి మన వద్ద ఉన్న ప్రాజెక్టులు నింపుకోవడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఎగువ ప్రాంతాల నుంచి అనగా ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల జరిగితేనే మనం రైతులకు నీళ్లు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని వివరించారు. అక్కడి నుంచి నీటి ప్రవాహం రాకపోతే సాగు కోసం నీరు విడుదల చేయడానికి అవకాశం ఉండదని తెలిపారు. ప్రస్తుతానికి ఆయా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల ఆపివేయడం జరిగిందని తెలిపారు. జూరాల ప్రాజెక్టు సామర్థ్యం 9టీఎంసీలు కాగా, గతంలో రీజెనరేటెడ్ నీటి సౌకర్యం ఏ విధంగా ఉండేది, ఇప్పుడు ఏ విధంగా ఉందనే విషయాన్ని ఆరా తీసి దానిపై పూర్తి డేటాను వీలైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు. రైతులకు మినుము, వేరుశనగ, ఆయిల్ పామ్ పంటలపై పూర్తి స్థాయిలో ప్రచారం కల్పించి, అవగాహన కల్పించాలన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు ఎంత నీరు వస్తున్నాయి, ఎంత వదులుతున్నామనే విషయాలని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. అధికారులు జవాబుదారీతనంతో ప్రజలకు అన్ని వివరాలను, వాస్తవాలను తెలియజేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొనడం కరువు పరిస్థితులు ఉన్న నేపథ్యంలో రైతులకు మనం ఏమి ఇవ్వగలము అదే చెప్పాలని వివరించారు. వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ కే ఎల్ ఐ ద్వారా శ్రీశైలం నీటిని వనపర్తి పరిధిలో రైతులకు సాగునీరు ఇవ్వడానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై నీటిపారుదల శాఖ అధికారులతో చర్చించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లను నింపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు కొంత సహకరించి రైతులకు నీటిని విడుదల చేస్తే ఇప్పటికే వరి వేసుకున్న వాళ్ళు బయటపడేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. అదేవిధంగా కొత్తకోట మండల పరిధిలో ఉన్న శంకర సముద్రాన్ని కూడా నింపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమావేశంలో నాగర్ కర్నూల్ శాసనసభ్యులు రాజేష్ రెడ్డి, అలంపూర్ శాసనసభ్యులు విజయుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త, నారాయణపేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, గద్వాల జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ హిమంత కేశవ్ పాటిల్, ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఉదయ్ నాగరాజు జీవితం ఆదర్శం

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేట ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన ఉదయ్ నాగరాజు
- బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎన్నికైన సిద్దిపేట బిడ్డకు ఘన పౌర సన్మానం

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి :**



బ్రిటన్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎన్నికైన సిద్దిపేటకు చెందిన ఉదయ్ నాగరాజుకు సిద్దిపేటలో ఘన పౌర సన్మానం నిర్వహించారు. సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఉదయ్ నాగరాజును శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఉదయ్ నాగరాజు తన పేరుకు తగ్గట్టుగానే సిద్దిపేటలో ఉదయించి బ్రిటన్‌లో వెలుగొందుతున్నారని కొనియాడారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి బ్రిటన్ పార్లమెంటుకు ఎన్నికైన తొలి వ్యక్తిగా ఉదయ్ నాగరాజు నిలవడం గర్వకారణమన్నారు. 47 ఏళ్ల చిన్న వయసులోనే బ్రిటన్ చట్టసభకు చేరుకోవడం భారతీయులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.చిన్న పల్లెటూరిలో పుట్టి బ్రిటన్ పార్లమెంట్‌కు ఎన్నికయ్యే స్థాయికి ఎదగడం వెనుక ఉదయ్ నాగరాజు కృషి, పట్టుదల ఉన్నాయని హరీశ్‌రావు అన్నారు. కలలు కనడంతో పాటు వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలనే విషయానికి ఆయన జీవితం నిదర్శనమన్నారు. యువత ఉదయ్ నాగరాజును ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఉదయ్ నాగరాజుతో తనకు రెండున్నర దశాబ్దాలుగా అనుబంధం ఉందని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఆయన వివాహానికి హాజరైన విషయాన్ని, ఎంపీ కాకముందు లండన్‌లోని ఆయన ఇంటికి వెళ్లిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో లండన్‌లో ఉంటూనే ఉదయ్ నాగరాజు ఉద్యమానికి మద్దతుగా నిలిచి తన వంతు సహకారం అందించారని తెలిపారు.

ఖండాంతరాలు దాటి ఉన్నత స్థాయికి ఎదిగినా ఒదిగి ఉండే తత్వం ఉదయ్ నాగరాజు ప్రత్యేకత అని హరీశ్‌రావు అన్నారు. లండన్‌లో నివసిస్తున్నప్పటికీ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కుటుంబంతో కొనసాగించడం అభినందనీయమన్నారు.ఉదయ్ నాగరాజును సన్మానించడం సిద్దిపేట ప్రజలకే కాకుండా తెలంగాణ, యావత్ భారతదేశానికి గర్వకారణమని హరీశ్‌రావు అన్నారు. భవిష్యత్తులో బ్రిటన్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు, అభిమానులు, ఉదయ్ నాగరాజు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక బాధ్యత కలిగిన యువతగా ఎదగాలి



- దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది
- సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్

**నారాయణపేట ఆగస్టు12 (వుదయం ప్రతినిధి)**

సామాజిక బాధ్యత కలిగిన యువతగా ఎదగాలని దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది అని నారాయణపేట సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ అన్నారు.నారాయణపేట జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు, నారాయణపేటలోని ద్వారకా హై స్కూల్ లో బుధవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం, విలువైన మానవ ప్రాణాలను కాపాడేందుకు అవయవాలను దానం చేయడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటుంది అని గుర్తు చేశారు. సమాజంలో మార్పు తెచ్చే శక్తి కేవలం యువతకే సాధ్యం అని, క్రమశిక్షణ, చదువు, ప్రభుత్వ చట్టాల మీద అవగాహన ఉండాలి అని తెలిపారు. తద్వారా పారదర్శకత, చురుకైన వివాద పరిష్కార సంస్కృతిని ప్రోత్సహిస్తుంది తెలిపారు. పోక్సో చట్టం, 2012 (లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ) పై లక్షిత సమావేశాలను నిర్వహించడం వల్ల భద్రతా భావనలు, చట్టపరమైన రక్షణలు,ఫిర్యాదు చేసే విధానాలపై అవగాహన ఇచ్చారు. పోక్సో చట్టం మన యువతకు ఒక రక్షణ కవచమని కానీ చట్టాలు మాత్రమే నేరాలను ఆపలేవన్నారు. వేధింపులకు వ్యతిరేకంగా గళం విప్పేలా మన పిల్లలకు మనం బోధించి ప్రతి విద్యార్థి సురక్షితంగా, తమ మాట వింటున్నారని, తమకు రక్షణ ఉందని భావించే సమాజాన్ని నిర్మించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు.జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ కె. జయచంద్ర మోహన్ మాట్లాడుతూ అవయవ, కణజాల దాతల యొక్క తీవ్రమైన అవసరం గురించి అవగాహన కల్పించారు. అవయవదానం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఇతరులు జీవించడానికి సహాయం చేస్తూ మీరు జీవించండి. రెండవ జీవితాన్ని ఇవ్వడం మీ చేతుల్లోనే ఉందన్నారు. విద్యార్థులకు ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే ప్రతి విద్యార్థితో ఉండవలసిన హెల్ప్‌లైన్ నంబర్లు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ (24x7), 181 మహిళా హెల్ప్‌లైన్, 15100 ఉచిత న్యాయ సహాయం, 112 అత్యవసర సేవ టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆదేవిందగా మీ తల్లితండులకు తెలియజేయాలన్నారు .ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మిపతి గౌడ్, అడ్వొకేట్ నందునమాజీ, అలేఖ్య, ప్రిన్సిపల్, రవీందర్ గౌడ్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కరణ్‌కోట్ పరిధిలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 8 మంది అరెస్ట్
- రూ. 82,770 నగదు, పేకముక్కలు స్వాధీనం | నిందితులను అభినందించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**తాండూర్ ఆగస్టు 12 వుదయం ప్రతినిధి (కరణ్‌కోట్)**



వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ,ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు భారీ పేకాట స్థావరంపై దాడి చేసి, 8 మందిని అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా తెలిపిన వివరాల ప్రకారం... కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారు ప్రాంతంలో కొందరు వ్యక్తులు రహస్యంగా పేకాట స్థావరాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ బృందం తక్షణమే స్పందించి సదరు స్థావరంపై ఆకస్మిక దాడి నిర్వహించింది.

**చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు:**

ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా మాట్లాడుతూ... జిల్లాలో పేకాట, జూదం, ఇతర అసాంఘిక, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంటుందని హెచ్చరించారు. సమర్థవంతంగా దాడి నిర్వహించి పేకాట రాయుళ్ల ఆటకట్టించిన టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా మరియు వారి బృంద సభ్యులను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ప్రత్యేకంగా అభినందించారు.

# 24 గంటల విద్యుత్ హామీ ఏదీ?

- **నిత్యం గంటల తరబడి కోతలతో వినియోగదారుల విలవిల!**

**కోహీర్ ఆగస్టు 12 ( వుదయం ప్రతినిధి )**

aసంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలం మరియు గ్రామాలలో విద్యుత్ కోతలు విదిస్తున్నారు రాష్ట్రంలో 24 గంటల సజావు విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ప్రభుత్వం, విద్యుత్ శాఖ ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితి భిన్నంగా ఉంది.
ప్రతిరోజూ రెండు, మూడు, నాలుగు గంటల చొప్పున పదే పదే విద్యుత్ కోతలు విధించడంతో నివాసితులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.
ముందస్తు సమాచారం లేకుండానే అకస్మాత్తుగా పవర్ కట్ చేయడం వల్ల గృహ వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.
ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అని తేడా లేకుండా రోజుకు ఐదు నుండి ఆరు సార్లు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు.ముఖ్యంగా ఉక్కపోత సమయాల్లో విద్యుత్ నిలిచిపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఇళ్లల్లో ఉండలేక అల్లాడిపోతున్నారు.మండలం లో గంటల తరబడి సాగుతున్న ఈ అనధికారిక విద్యుత్ కోతల వల్ల స్థానిక వ్యాపారాలు దెబ్బతింటున్నాయి.చిరు వ్యాపారులు, డిజిటల్ స్టూడియోలు, వర్క్‌షాప్‌లు, చిన్న తరహా పరిశ్రమలు కరెంట్ లేక పనులు సాగక నష్టపోతున్నాయి. ఆన్‌లైన్ సేవలు, ఇంటర్నెట్ ఆధారిత పనులపై ఆధారపడిన విద్యార్థులు, ఉద్యోగుల పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతోంది. తరచూ వోల్టేజ్ హెచ్చుతగ్గులు (లో వోల్టేజ్) రావడం, విద్యుత్ పోవడంరావడం వల్ల ఎలక్ట్రానిక్ ఉపకరణాలు కాలిపోతున్నాయి.
ఫ్రిజ్‌లు, టీవీలు, ఎయిర్ కండిషనర్లు, వాటర్ మోటార్లు పాడైపోయి సామాన్యులు అదనపు ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోంది.విద్యుత్ లైన్ల మరమ్మతులు, సబ్‌స్టేషన్ నిర్వహణ పేరుతో గంటల కొద్దీ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పడం పరిపాటిగా మారింది.కానీ ఎంతకాలం ఈ నిర్వహణ పనులు సాగుతాయని, శాశ్వత పరిష్కారం ఎప్పుడు దొరుకుతుందని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.బిల్లుల వసూలులో చూపించే శ్రద్ధ, కఠినత్వం నాణ్యమైన విద్యుత్ అందివ్వడంలో ఎందుకు చూపడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.ప్రతినెలా రీడింగ్ తీసి భారీగా విద్యుత్ బిల్లులు బాదుతున్న శాఖ, నిరంతర విద్యుత్ అందించడంలో మాత్రం విఫలమవుతోంది.విద్యుత్ కోతల సమస్యపై ప్రశ్నించేందుకు లోకల్ సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే కనీసం సిబ్బంది స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.క్షేత్రస్థాయిలో మాత్రం రోజువారీ కోతలతో ప్రజల జీవనశైలి దారుణంగా ప్రభావితమవుతోంది.వ్యాపారులకు, వినియోగదారులకు సమయానికి విద్యుత్ లేక ఆర్థికంగా తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. అధికారులు ఇకనైనా కంటితుడుపు చర్యలు విడనాడి, క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించాలి. సాంకేతిక లోపాలు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు ఉంటే తక్షణమే పునరుద్ధరించి నిరంతర విద్యుత్ అందించేలా చర్యలు చేపట్టాలి. అప్రకటిత విద్యుత్ కోతలను తక్షణమే నిలిపివేసి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని

# ముఖ్యమంత్రిని కోరిన కసిరెడ్డి

- **180 కోట్ల ప్రతిపాదనలు, 2000 అదనపు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు విజ్ఞప్తి**

**కల్వకుర్తి ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి):**

కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రత్యేక ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యంగా ఆమనగల్, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం 80 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఇందులో ఆమనగల్‌కు 30 కోట్లు, కల్వకుర్తి మున్సిపాలిటీకి 50 కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించారు.నియోజకవర్గంలో పేదలు, లంబాడీలు, నిరుపేద కుటుంబాలు ఎక్కువగా ఉన్నందున అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని



విజ్ఞప్తి చేశారు. అర్హులైన మరిన్ని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనను సమర్పించినట్లు తెలిపారు.అదేవిధంగా అన్ని గ్రామాలు, గ్రామపంచాయతీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి 50 కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రత్యేకంగా అభ్యర్థించారు. మొత్తంగా సుమారు 180 కోట్ల రూపాయల అభివృద్ధి పనుల ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి అందజేశారు.శాసనసభ్యులు సమర్పించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని సమాచారం.



# ‘విశ్వనాథ్ & సన్స్’ ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

**హైదరాబాద్ , ఆగస్టు :**

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వంశీ నిర్మిస్తున్న ‘విశ్వనాథ్ & సన్స్’ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు హాజరయ్యారు.ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరి గారి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో హీరో సూర్య, హీరోయిన్ మామిత బైజు గారు ప్రధాన పాత్రల్లో నటించారు. ఇప్పటికే ఈ చిత్రంపై సినీ అభిమానుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా చిత్ర బృందానికి ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు శుభాకాంక్షలు తెలిపారు. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానున్న ‘విశ్వనాథ్ & సన్స్’ చిత్రం ఘన విజయం సాధించి, ప్రేక్షకులను ఎంతగానో అలరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు, సినీ ప్రముఖులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం

- **అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సిద్దిపేట వాసి సంతోష్‌కు ఘన సన్మానం**
- **ప్రార్థించే పెదవుల కన్నా.. సేవ చేసే చేతులు మిన్న ప్రధానోపాధ్యాయుడు అనిల్‌కుమార్**

**దౌల్తాబాద్, ఆగస్టు 12(వుదయం):**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చామకూర అనిల్‌కుమార్ అన్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న సిద్దిపేటకు చెందిన సంతోష్ తన గొప్ప మనసుతో దౌల్తాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.3 లక్షల విరాళాన్ని ప్రకటించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సంతోష్ అందించిన సహకారం మరువలేనిదని ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు. ‘ప్రార్థించే పెదవుల కన్నా.. సేవ చేసే చేతులు మిన్న’ అనే మాటకు సంతోష్ అందించిన సహాయం నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రవాస భారతీయులు, పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు రావడం ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్ర



ధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సంతోష్‌ను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం రూ.3 లక్షల విరాళం ప్రకటించినందుకు ఆయనను అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాల మౌలిక వసతుల మెరుగుదలకు ఇటువంటి సహకారం ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.
కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, సంజీవగౌడ్, మహేష్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, విజయ్‌కృష్ణ, హరికృష్ణ, మల్లేశం, అంబిక, దశరథం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు ‘ఫుల్ ప్రూఫ్’ ప్లాన్



- **రైతులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు.. ముందస్తు కార్యాచరణకు అదనపు కలెక్టర్ ఆదేశం**

**గద్వాల ఆగస్టు 12 (వుదయం బ్యూరో)**

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో, పారదర్శకంగా కొనుగోలు చేసేందుకు ముందస్తు కార్యాచరణ రూపొందించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అధికారులను ఆదేశించారు. గత సీజన్‌లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఎంత ధాన్యం వస్తుందో.. అంతా సిద్ధం బుధవారం ఐడీఓసీలోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో వరి సాగు విస్తీర్ణాన్ని ఆధారంగా చేసుకుని ఆశించిన దిగుబడిని ముందుగానే అంచనా వేయాలని సూచించారు. దానికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాల సంఖ్య, వాటి సామర్థ్యం, అవసరమైన మౌలిక వసతులపై స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సెర్ప్, మెప్మా, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాల సంఖ్యను ముందుగానే ఖరారు చేసి, ధాన్యం రాక ప్రారంభమయ్యే సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**కేంద్రాల్లో అన్నీ సిద్ధంగా ఉండాలి**

ప్రతి కొనుగోలు కేంద్రంలో ఎలక్ట్రానిక్ తూకాలు, తేమ నిర్ధారణ యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీ సంచులు, పాడీ క్లీనర్లు తదితర సామగ్రిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన తర్వాత అనవసర జాప్యం లేకుండా తూకం, నాణ్యత పరిశీలన, కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అవకతవకలకు తావులేకుండా.. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని మధుమోహన్ స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు.
సమావేశంలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామికుమార్, మేనేజర్ విమల, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ప్రశాంత్, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జమిస్తాపూర్‌లో రీసర్వే



- **పనులను పరిశీలించిన రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి. హరిప్రియ**

**మహబూబ్ నగర్ ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి):**

మహబూబ్‌నగర్ రూరల్ మండలం జమిస్తాపూర్ గ్రామంలో చేపడుతున్న రీసర్వే పనులను రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ బుధవారం పరిశీలించారు.గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే ప్రక్రియ, పనుల పురోగతిని ఆమె సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యాడస్ట్రల్ పరిధిలోలేని గ్రామాల రీసర్వే పనులను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ AD SLR అశోక్, మహబూబ్‌నగర్ రూరల్ మండల తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ R Iతదితరులు పాల్గొన్నారు.

# ఎల్కల్ పాఠశాలకు రెండు కార్పెట్లు బహూకరణ

- **విద్యార్థుల భవిష్యత్తుకు చేయూతనివ్వాలి: లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్. కుమార్‌స్వామి**

**దౌల్తాబాద్, ఆగస్టు 12 (వుదయం):**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు చేయూతనివ్వాలని లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ అధ్యక్షుడు డా. కుమార్‌స్వామి అన్నారు. బుధవారం రాయపోల్ మండలం ఎల్కల్ ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ఆధ్వర్యంలో రెండు కార్పెట్లను బహూకరించారు.ఈ సందర్భంగా డా. కుమార్‌స్వామి మాట్లాడుతూ.. రేపటి దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం ద్వారా వారు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి, శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపారు. త్వరలో పాఠశాలకు క్రీడా సామగ్రిని కూడా అందజేస్తామని వెల్లడించారు.విద్యార్థుల అవసరాలను గుర్తించి పాఠశాలకు రెండు కార్పెట్లు అందజేసిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. నాగభూషణం కృతజ్ఞతలు తెలిపారు.



దాతలు, స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు లయన్స్ క్లబ్ అందిస్తున్న సహకారం పాఠశాల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ఏరియా కోఆర్డినేటర్ పరమేశ్వరచారి, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్, స్కూల్ సపోర్టర్ ఏ. మల్లేష్‌గౌడ్, ఎల్కల్ డైరెక్టర్ ప్రభాకర్, ఉపాధ్యాయులు నరసింహ, నరేష్, కరుణాకర్, అండాలు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 22 ఏళ్ల దేశ సేవకు ఘన సత్కారం

- **జవాన్ రవీందర్‌కు స్వగ్రామంలో అపూర్వ స్వాగతం**

**వుదయం కంగ్టి, మండల్**

దేశం కోసం యవ్వనాన్ని అంకితం చేసి.. 22 ఏళ్ల పాటు సరిహద్దుల్లో విధులు నిర్వర్తించి.. భారత మాత సేవలో తన వంతు బాధ్యతను నిర్వర్తించిన వీర జవాన్ వాడిత్య రవీందర్‌కు స్వగ్రామం ఘన స్వాగతం పలికింది. కంగ్టి మండలం జంగి తండా గ్రామానికి చెందిన వాడిత్య రవీందర్ భారత సైన్యంలో 22 సంవత్సరాల పాటు సేవలందించి రిటైర్మెంట్ పొందారు. రిటైర్మెంట్ అనంతరం స్వగ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు, సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత ఘన స్వాగతం పలికారు.దేశ సరిహద్దులను కాపాడిన జవాన్‌కు.. సొంత ఊరు సలాం చేసింది. పూలమాలలు వేసి సన్మానిస్తూ ప్రత్యేకంగా ఊరేగింపు, ర్యాలీ నిర్వహించారు. గ్రామమంతా దేశభక్తి నినాదాలతో మార్మోగింది.ఈ సందర్భంగా నారాయణఖేడ్ బీఆర్ఎస్ నాయకులు సాయిలు, ఏఈ నారాయణ తదితరులు రవీందర్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.22 ఏళ్ల



సైనిక సేవ.. త్యాగం, క్రమశిక్షణ, దేశభక్తికి ప్రతీకగా నిలిచిన రవీందర్ స్వగ్రామానికి తిరిగి రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన సేవలను కొనియాడుతూ యువతకు రవీందర్ ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు.

**ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ..**

“దేశం కోసం 22 ఏళ్ల పాటు సేవ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. స్వగ్రామానికి తిరిగి వచ్చిన నన్ను ఇంత ప్రేమతో, గౌరవంతో స్వాగతించి సన్మానించడం ఎంతో ఆనందంగా ఉంది. గ్రామస్తుల అభిమానాన్ని జీవితాంతం మరువలేను” అని భావోద్వేగంతో తెలిపారు.

**దేశం కోసం 22 ఏళ్ల సేవ..**

స్వగ్రామం ఇచ్చిన ఘన సత్కారం.. జవాన్ రవీందర్‌కు ఊరంతా సలాం.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- **జిల్లా కలెక్టర్‌కు టీజేఏ ప్రతినిధుల వినతి**

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి:**

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతూ తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీజేఏ) సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌లకు బుధవారం వినతిపత్రం అందజేశారు. టీజేఏ జిల్లా అధ్యక్షుడు సొల్లేటి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎన్. రాజు ఆధ్వర్యంలో ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా టీజేఏ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు నిరంతరం కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఏళ్లుగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న పలువురు జర్నలిస్టులకు సొంత ఇళ్లు లేవని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం తరపున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం విద్యా రాయితీ కల్పించాలని, పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు అత్యవసర వైద్య పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులతో ప్రత్యేక వైద్య సేవల సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టుల కుటుంబాలకు వైద్య భద్రత కల్పించేలా ప్రత్యేక ఆరోగ్య పథకం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టులకు ఆర్టీసీ బస్ పాస్ రాయితీలో ఉన్న వ్యత్యాసాలను తొలగించి, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధంగా 1/3 రాయితీ అమలు చేయాలని కోరారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్య



లను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం, జర్నలిస్టు సంఘాలు, సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి జిల్లా స్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై కలెక్టర్ కె. హైమావతి సానుకూలంగా స్పందిస్తూ జర్నలిస్టుల సమస్యలను పరిశీలించి, తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో టీజేఏ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు వంగ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్. గణేష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ భాష వేణి, లింగమూర్తి, ట్రెజరర్ సిహెచ్. మహేందర్, భాస్కర్ రెడ్డి, లింగాల బాబు, గుడి భాను, అంబడిపల్లి ఈశ్వర్, గౌస్ పాషా, ఇంతియాజ్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సన్నవరి సాగు చేసిన రైతులకు ఎకరాకు 500 బోనస్

- **ఆగస్టు 17 లోపు దరఖాస్తులు సమర్పించాలి మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్**

**కల్వకుర్తి ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి):**

సన్నవరి సాగు చేసిన అర్హులైన రైతులకు ఎకరాకు 500 రూపాయల బోనస్ ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ 2026 సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 7 రకాల సన్నవరి రకాలను గుర్తించిందని అన్నారు. ఈ రకాలను సాగుచేసిన రైతులకు ఎంఎస్పీతో పాటు ఎకరాకు అదనంగా 500 రూపాయల బోనస్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు.బోనస్ కొరకు ప్రభుత్వం గుర్తించిన సాంబామసూరి బిపిటి 5204, తెలంగాణ సోనా ఆర్ ఎన్ ఆర్ 15048, హెచ్ఎంటి సోనా, సిద్ధిడబ్ల్యూ జి ఎల్ 44, కె ఎన్ ఎం 1638, కె ఎన్ ఎం 7715, జైశ్రీరామ్



అనే 7 రకాల సన్నవరిని సాగుచేసిన రైతులు అర్హులని తెలిపారు.బోనస్ పొందటానికి రైతులు ఆగస్టు 17 లోపు దరఖాస్తు పత్రం, పట్టేదార్ పాస్ బుక్ జిరాక్స్, విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ బిల్లు జిరాక్స్ ను వ్యవసాయ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు సంబంధిత ఏఈఓ, ఎం.ఎ.ఓ లను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు

# గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు మూడో కన్ను

- **నేరాల నియంత్రణతోపాటు దర్యాప్తులో కీలక ఆధారాలు**
- **తొగుట సీఐ షేక్ లతీఫ్**

**దౌల్తాబాద్, ఆగస్టు 12 (వుదయం):**

గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు మూడో కన్నులాంటివని, నేరాల నియంత్రణతోపాటు నేరాల దర్యాప్తులో అవి కీలక పాత్ర పోషిస్తాయని తొగుట సీఐ షేక్ లతీఫ్ అన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రంలో ఎస్ఐ కె. మానసతో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ‘సిద్దిపేట సురక్ష నేత్ర’ కార్యక్రమం ఐదో దశలో భాగంగా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాల్



ఆదేశాల మేరకు రాయపోల్ మండల కేంద్రంలో 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామంలోకి వచ్చే, గ్రామం నుంచి బయటకు వెళ్లే వ్యక్తులు, వాహనాల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.
దొంగతనాలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు, ఆస్తుల ధ్వంసం, ఇతర అనుమానాస్పద ఘటనలు చోటుచేసుకున్నప్పుడు సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా సంఘటనకు సంబంధించిన వాస్తవాలను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. నేరం జరిగిన అనంతరం నిందితులను గుర్తించడం, వారి కదలికలను తెలుసుకోవడం, నేరం జరిగిన తీరును విశ్లేషించడం, దర్యాప్తును వేగవంతం చేయడంలో సీసీ కెమెరాల ఫుటేజీ కీలక ఆధారంగా నిలుస్తుందని తెలిపారు.

**నేరగాళ్లలో భయం పెరుగుతుంది**

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో భయం నెలకొంటుందని సీఐ అన్నారు. దీంతో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణలో సీసీ కెమెరాలు అత్యంత ఉపయోగకరమైన సాధనాలని తెలిపారు.కార్యక్రమంలో రాయపోల్ గ్రామ సర్పంచ్ మాసంపల్లి రాజు, ఉపసర్పంచ్ హనుమంతు రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పంద్రాగస్టు’ నాటికి

# రూపురేఖలు మారాల్సిందే!



- **‘సంఘాల పార్కు’ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**
- **కాంట్రాక్టర్లు, అధికారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ క్లాస్!**

**గద్వాల ఆగస్టు 12 (వుదయం కరస్పాండెంట్):**

పట్టణ ప్రజల సుదీర్ఘ స్వప్నమైన ‘సంఘాల పార్కు’ సుందరీకరణ పనుల్లో అలసత్వాన్ని ఏమాత్రం ఉపేక్షించేది లేదని, ఈ నెల 15వ తేదీ నాటికి పనులన్నీ పూర్తి చేసి తీరాల్సిందేనని గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. బుధవారం క్షేత్రస్థాయిలో పార్కును ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, పనుల పురోగతిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులకు, కాంట్రాక్టర్లకు దిశానిర్దేశం చేశారు. నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవు!’ గార్డెనింగ్, రంగుల అలంకరణ, పెయింటింగ్ వంటి సుందరీకరణ పనులను నిశితంగా పరిశీలించిన చైర్‌పర్సన్, క్షేత్రస్థాయి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో కౌన్సిలర్ రామలింగేశ్వర కాప్లే, ఆప్షన్ సభ్యుడు ఎం.డి. షరీఫ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జాన్ మబ్బులు, బంగి సుదర్శన్, రిజ్వాన్, మోసిన్, యువ నాయకులు, మున్సిపల్ అధికారులు మరియు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ఎరువుల పంపిణీలో నూతన విధానం

- **ఆగస్టు 13 నుండి FFS యాప్ ద్వారానే ఎరువుల బుకింగ్**
- **మండల వ్యవసాయ అధికారికృష్ణయ్య**

**అచ్చంపేట ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి):**

ఇక నుండి ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ FFS యాప్ ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ చేసుకోవాలని అచ్చంపేట మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య తెలిపారు.

**FFS యాప్‌లో నమోదు విధానం:**

రైతులు Google Play Store ద్వారా FFS యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. Farmer ID ఉన్న రైతులు Farmer ID లేదా ఆధార్ సంఖ్యతో లాగిన్ అయ్యి OTP ద్వారా ధృవీకరించుకోవచ్చు. Farmer ID లేని రైతులు ఆధార్ eKYC తో నమోదు చేసుకోవచ్చు. భూమి వివరాలు కనిపించకపోతే "Sync Lands with Farmer Registry" లేదా "Add / Claim Land" ద్వారా నమోదు చేసుకోవచ్చు. భూమి వివరాల తర్వాత ప్రస్తుత సీజన్ పంటను తప్పనిసరి



గా ఎంపిక చేయాలి. యాప్‌లో General Fertilizer Recommendation కూడా అందుబాటులో ఉంటుంది. ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఎంపిక చేసి దరఖాస్తు చేస్తే QR Code మరియు Token Number వస్తుంది. దీని ద్వారా రైతు స్వయంగా లేదా అధీకరించిన వ్యక్తి ఎరువులు తీసుకోవచ్చు.ఈ నూతన విధానం వల్ల ఎరువుల అవసరాన్ని ముందుగానే అంచనా వేయడం, పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని అధికారి తెలిపారు. రైతులందరూ ముందుగానే యాప్‌లో నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. సందేహాలుంటే AEO లేదా ఎరువుల విక్రయ కేంద్రాలను సంప్రదించాలని కోరారు

# భక్తిశ్రద్ధలతో భద్రకాళి అమ్మవారికి శాకాంబరి అలంకరణ

**సంగారెడ్డివుదయం :**

ఆషాఢ మాసం అమావాస్యను పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీప భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకాంబరి రూపంలో ఆకుకూరలు, వివిధ రకాల కూరగాయలతో సుందరంగా అలంకరించారు.శాకాంబరి అలంకరణలో అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజల్లో ఉపయోగించిన కూరగాయలను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు చక్రేశ్వర్‌తో పాటు ఆలయ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# చక్కని ఆరోగ్యం

## మనసు పెట్టి తింటున్నారా?



మూడు పూటలా తిన్నామా, కడుపు నిండిందా అనుకుంటామే కానీ.. ఏం తింటున్నాం.. అందులో నుంచి శరీరానికి కావాల్సిన పోషకాలన్నీ అందుతున్నాయా? అని ఆలోచించే వారు మాత్రం చాలా తక్కువమంది ఉంటారు. ఈ నిర్లక్ష్యమే వివిధ రకాల అనారోగ్యాలకు కారణమవుతుందంటున్నారు నిపుణులు. అందుకే తినేటప్పుడు 'మనిషిక్కడ.. మనసెక్కడో' అన్నట్లుగా కాకుండా.. తీసుకునే ఆహారం పైనే మనసు లగ్నం చేయమంటున్నారు. 'మైండ్‌ఫుల్ ఈటింగ్'గా పిలిచే ఈ ఆహారపుటలవాటు వల్ల అటు ఆహారం రుచిని ఆస్వాదించచ్చు.. ఇటు ఆరోగ్యాన్నీ సొంతం చేసుకోవచ్చు అంటున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి.. నచ్చిన పని చేసేటప్పుడు మనసును పూర్తిగా దాని పైనే కేంద్రీకరిస్తాం.. ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తపడతాం. అదే తిండి విషయానికొస్తే.. ఓవైపు ఆహారం తీసుకుంటూనే.. మరోవైపు గ్యాడ్జెట్స్ వాడడం, ఇతరులతో మాట్లాడడం.. వంటివి చేస్తుంటాం. ఈ అలవాటు ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదంటున్నారు నిపుణులు. అందుకే భోజనం చేసేటప్పుడు మనసును పూర్తిగా ఆహారం పైనే పెట్టి.. ఆస్వాదిస్తూ తినడం మంచిదంటున్నారు నిపుణులు. చేసే పనిపై మనసును లగ్నం చేస్తే.. దానిపై అవగాహన పెరుగుతుంది. సృజనాత్మక ఆలోచనలొస్తాయి. ఉత్సాహంగా, ఇంకాస్త బాగా చేయగలుగుతాం. ఇదేవిధంగా తినేటప్పుడు మనసును పూర్తిగా తిండి పైనే పెడితే.. ఏం తింటున్నామో అర్థమవుతుంది.. అది ఆరోగ్యకరమైనదేనా?, అందులో మన శరీరానికి కావాల్సిన పోషకాలన్నీ ఉన్నాయా/లేదా? అనేదీ గ్రహించవచ్చు.. తినే పదార్థం గురించి అవగాహన కూడా పెరుగుతుంది. ఇంకొన్ని హెల్దీ ఆప్షన్లు ఎంచుకునే అవకాశం దొరుకుతుంది. ఇవన్నీ ఆరోగ్యాన్ని సొంతం చేసేవే! అయితే ఇలా మనసు పెట్టి తినడం కూడా ఓ వ్యాయామం లాంటిదే అంటున్నారు నిపుణులు. దీనివల్ల ఆందోళన, యాంగ్జైటీ, ఈటింగ్ డిజార్డర్స్, ఇతర మానసిక సమస్యలు.. వంటివన్నీ దూరమవుతాయంటున్నారు. అంతేకాదు.. మనసు పెట్టి తినడం వల్ల ఇంకా బోలెడన్ని ప్రయోజనాల్ని సొంతం చేసుకోవచ్చంటున్నారు. మనసు పెట్టి తినడం వల్ల ఆకలిని గుర్తించగలుగుతాం. తద్వారా అతిగా తినకుండా జాగ్రత్తపడచ్చు. ఎమోషనల్ ఈటింగ్‌కు అడ్డుకట్ట వేయచ్చు. ఫలితంగా ఏది పడితే అది తిని అనారోగ్యాల పాలు కాకుండా జాగ్రత్తపడచ్చు.

తీసుకునే ఆహారంపై పూర్తి దృష్టి పెడితే.. మన ప్లేట్లో ఉన్నది హెల్దీనా కాదా అనేది అర్థమవుతుంది. ఫలితంగా ఆరోగ్యకరమైన ఆప్షన్లను ఎంచుకోవచ్చు.. కడుపు నిండుగా కాకుండా.. రెండు ముద్దలు తక్కువ తిని.. బరువూ తగ్గచ్చు.

భోజనం చేసేటప్పుడు మనసును పూర్తిగా లగ్నం చేయడం వల్ల.. శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయులు తగ్గినట్లు ఓ అధ్యయనంలో తేలింది. ఫలితంగా ఒత్తిడి, ఆందోళన, యాంగ్జైటీ వంటివి దూరమవుతాయి. మనసు పెట్టి తినడం వల్ల ఎక్కువగా తినే అలవాటుకు చెక్ పెట్టచ్చు. అలాగే ఏది పడితే అది తినకుండా జాగ్రత్తపడచ్చు.. దీనివల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందంటున్నారు నిపుణులు. ఫలితంగా గ్యాస్ట్రిక్ సమస్యలు, ఆహారం జీర్ణం కాకపోవడం, కడుపుబ్బరం, మలబద్ధకం.. వంటివి రాకుండా ఉంటాయి.

సమయం సర్దుబాటు కాక కొంతమంది అటు తింటూనే, ఇటు వేరే పనులు చేస్తుంటారు. దీనివల్ల ఆహారం రుచిని ఆస్వాదించలేకపోతారు.. తిన్నామన్న సంతృప్తీ దక్కదు.. ఈ అలవాటు చిరుతిండ్ల పైకి మనసు మళ్లేలా చేస్తుందంటున్నారు నిపుణులు. ఫలితంగా లేనిపోని అనారోగ్యాలు కొనితెచ్చుకున్నట్లే అవుతుంది. అందుకే తినే కాసేపైనా.. ఆహారం పైనే మనసు లగ్నం చేయాలి.

## అరగంట ఇలా నడిస్తే మంచిదట!



సింపుల్‌గా చేసే వ్యాయామాల్లో నడక గురించి మనకు తెలిసిందే! మొదలు పెట్టిన దగ్గర్నుంచి నిర్దేశిత సమయం దాకా ఒకే వేగంతో నడుస్తాం. ఇక బ్రిస్క్ వాకింగ్‌లో భాగంగా కాస్త వేగం పెంచి నడుస్తాం. అయితే ఈ రెండింటి కలయికే 'జపనీస్ వాకింగ్ పద్ధతి'. 30 నిమిషాల సమయం పెట్టుకొని.. మూడు నిమిషాలకోసారి వేగాన్ని మార్చుతూ నడవడమే ఈ వ్యాయామం. అంటే.. తొలుత మూడు నిమిషాల పాటు వేగంగా నడుస్తూ.. ఆ తర్వాతి మూడు నిమిషాలు సాధారణంగా నడుస్తూ వర్కవుట్‌ని కొనసాగించాల్సి ఉంటుంది. 'ఇంటర్వెల్ వాకింగ్ ట్రైనింగ్'గానూ పిలిచే ఈ వాకింగ్ పద్ధతి వల్ల రోజుకు వెయ్యి అడుగులు వేసిన దాని కంటే ఎక్కువ ఫిట్‌నెస్ ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. జిమ్, జిమ్ పరికరాలతో పని లేకుండా.. సమయం చూసుకోవడానికి ఓ స్టాప్‌వాచ్ లేదంటే మొబైల్ ఉంటే చాలు.. సౌకర్యంగా ఈ వ్యాయామం చేసేయచ్చని చెబుతున్నారు.

అరగంట పాటు ఈ జపనీస్ వాకింగ్ పద్ధతిని పాటిస్తే ఆరోగ్యపరంగా, ఫిట్‌నెస్ పరంగా బోలెడన్ని ప్రయోజనాలు చేకూరతాయని నిపుణులు చెబుతున్నారు. అరగంట పాటు ఇలా వాకింగ్ చేస్తే జీవక్రియల పనితీరు మెరుగుపడుతుందని చెబుతున్నారు.

ఈ వాకింగ్ పద్ధతిలో భాగంగా.. మూడు నిమిషాల పాటు వేగంగా నడవడం వల్ల గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఆపై మూడు నిమిషాల పాటు సాధారణంగా నడవడం వల్ల హార్ట్ రేట్ తగ్గుతుంది. ఈ హెచ్చుతగ్గుల వల్ల గుండెకు రక్తప్రసరణ మెరుగుపడి బీపీ అదుపులో ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. ఫలితంగా గుండె ఆరోగ్యమూ మెరుగుపడుతుందంటున్నారు. జపనీస్ వాకింగ్ పద్ధతి మధుమేహులకూ మేలు చేస్తుందని చెబుతున్నారు నిపుణులు. అంతేకాదు.. ఈ వాకింగ్ పద్ధతిని జీవనశైలిలో భాగం చేసుకోవడం వల్ల టైప్-2 మధుమేహం వచ్చే రిస్క్ తగ్గుతుందట!

కాసేపు వేగంగా, మరికాసేపు సాధారణంగా నడవడం వల్ల కాళ్లలోని కండరాలపై ఒత్తిడి పడి అవి దృఢంగా మారే అవకాశం ఉంటుందంటున్నారు.

అంతేకాదు.. ఈ వ్యాయామం చేయడం వల్ల ఎముక సాంద్రత పెరిగి.. భవిష్యత్తులో ఆస్టియోపొరోసిస్ సమస్య బారిన పడకుండా జాగ్రత్తపడచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎలాంటి జిమ్ పరికరాలు లేకుండా.. ఒత్తిడికి లోనుకాకుండా చేసే ఈ సింపుల్ వ్యాయామం వల్ల మానసిక ఆందోళనలూ దూరమవుతాయంటున్నారు నిపుణులు. అంతేకాదు.. సుఖ నిద్రకూ ఈ వ్యాయామం ప్రేరేపిస్తుందని చెబుతున్నారు.

## కీటోజెనిక్ డైట్ అంటే ఏమిటి..


కీటోజెనిక్ డైట్.. ప్రస్తుతం బరువు తగ్గాలనుకునే వారిలో బాగా ప్రాచుర్యం పొందిన ఆహార విధానం. హాలీవుడ్, బాలీవుడ్‌కు చెందిన పలువురు సెలబ్రిటీలు తమ శరీర ఆకృతిని మార్చుకోవడానికి ఈ డైట్‌ను అనుసరిస్తున్నట్లు వార్తలు వస్తుంటాయి. అయితే కీటో డైట్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, దుష్ప్రభావాలపై ఇప్పటికీ చర్చ కొనసాగుతోంది. బరువు తగ్గడానికి ఈ డైట్‌ను ప్రారంభించే ముందు దాని గురించి కొన్ని ముఖ్యమైన విషయాలను తెలుసుకోవడం అవసరం. కీటోజెనిక్ డైట్‌లో కార్బోహైడ్రేట్ల పరిమాణాన్ని గణనీయంగా తగ్గించి, కొవ్వుల వినియోగాన్ని పెంచుతారు. సాధారణంగా శరీరం శక్తి కోసం కార్బోహైడ్రేట్లను ఉపయోగిస్తుంది. అయితే కార్బోహైడ్రేట్లు తక్కువగా లభించినప్పుడు శరీరం నిల్వ ఉన్న కొవ్వును శక్తి కోసం ఉపయోగించడం ప్రారంభిస్తుంది. ఈ ప్రక్రియను కీటోసిస్ అంటారు. దీని ద్వారా బరువు తగ్గే అవకాశం ఉంటుందని కీటో డైట్ భావన.

అయితే కీటో డైట్‌లో కొవ్వులు ఎక్కువగా తీసుకోవాలంటే ఏ కొవ్వు పడితే అది తీసుకోవచ్చని కాదు. చీజ్, వెన్న, డీప్ ఫ్రైడ్ ఫుడ్స్ వంటి అధిక కొవ్వు, ప్రాసెస్ చేసిన ఆహారాల కంటే అవకాడో వంటి మొక్కల ఆధారిత ఆరోగ్యకరమైన కొవ్వులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు చెబుతున్నారు. అలాగే కీటోజెనిక్ డైట్‌లో చీజ్‌కు కూడా ముఖ్యమైన స్థానం ఉంది. ముఖ్యంగా ఫెటా చీజ్‌ను ఇందులో చేర్చుకోవచ్చు. ఫెటా చీజ్ సాధారణంగా గొర్రె పాలతో తయారు చేసే ఉప్పునీటిలో ఉంచిన పెరుగు చీజ్. అనేక ఇతర రకాల చీజ్‌లతో పోలిస్తే ఇందులో కొవ్వు, కేలరీలు తక్కువగా ఉంటాయి. 100 గ్రాముల ఫెటా చీజ్‌లో సుమారు 21 గ్రాముల కొవ్వు ఉంటుంది. కొవ్వుతోపాటు కాల్షియం, ప్రోటీన్ కూడా ఇందులో లభిస్తాయి. కీటో డైట్‌లో కొవ్వులు, ప్రోటీన్లు అధికంగా ఉండటం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. కార్బోహైడ్రేట్లు త్వరగా జీర్ణమై కడుపు ఖాళీ అయ్యే అవకాశం ఉండగా, కొవ్వులు ఎక్కువసేపు జీర్ణమవుతాయి. కొవ్వులు, ప్రోటీన్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల సంతృప్తి భావన ఎక్కువసేపు ఉండి, తద్వారా తక్కువగా తినే అవకాశం ఉంటుంది. అయితే భారతీయుల ఆహార విధానాన్ని దృష్టిలో ఉంచుకుంటే కీటో డైట్‌ను అనుసరించడం అంత సులభం కాదని పేర్కొంటున్నారు. భారతీయులు సాధారణంగా బియ్యం, ఇతర ధాన్యాలు, పప్పులు, కాయధాన్యాలు, మిల్లెట్లు వంటి కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహారాలపై ఎక్కువగా ఆధారపడతారు. మాంసాహారాన్ని కూడా అధిక పరిమాణంలో తీసుకోవడం సాధారణం కాదు. అందువల్ల భారతీయ ఆహార విధానానికి కీటో డైట్ సరిపోదని పోషకాహార నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కార్బోహైడ్రేట్లను చాలా తక్కువగా తీసుకునే సమయంలో తగినంత ద్రవాలు తీసుకోకపోతే కిడ్నీలో లేదా గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. అలాగే ధాన్యాలు, గింజలు, విత్తనాలు, పప్పుధాన్యాలను పూర్తిగా తగ్గించడం లేదా తొలగించడం వల్ల ఫైబర్, కాల్షియం, పొటాషియం, సెలీనియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన పోషకాలు శరీరానికి తగినంతగా అందవు. అందువల్ల కీటోజెనిక్ డైట్‌ను స్వయంగా ప్రారంభించడం కంటే ముందుగా అర్హత కలిగిన పోషకాహార నిపుణుడిని సంప్రదించడం మంచిది. సరైన ప్రణాళిక లేకుండా లేదా ఎక్కువకాలం పర్యవేక్షణ లేకుండా ఈ డైట్‌ను పాటిస్తే బరువు తగ్గడానికి బదులుగా శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలు లోపించే అవకాశం ఉంటుంది. కాబట్టి వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితి, ఆహారపు అలవాట్లు, శరీర అవసరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే కీటో డైట్‌ను అనుసరించాలి.



## జీర్ణవ్యవస్థలో ఉండే బ్యాక్టీరియా ఊబకాయానికి కారణమవుతాయా..?

మన శరీర ఆరోగ్యంపై పేగుల్లో ఉండే సూక్ష్మజీవుల ప్రభావం ఎంత ముఖ్యమో ఇటీవలి పరిశోధనలు మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. జీర్ణవ్యవస్థలో ఉండే ఈ బ్యాక్టీరియా సమూహాన్ని గట్ మైక్రోబయోటా అంటారు. ఇవి మన జీవక్రియపై ప్రభావం చూపడమే కాకుండా ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు, టైప్-2 మధుమేహం వంటి సమస్యలతో కూడా సంబంధం కలిగి ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. కొంతమంది వ్యక్తుల్లో పేగుల్లో ఉండే కొన్ని రకాల బ్యాక్టీరియా ఊబకాయం వచ్చే అవకాశాన్ని పెంచుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. రక్తంలో ఉండే కొన్ని అమైనో ఆమ్లాలు ఒకవైపు ఊబకాయంతో, మరోవైపు పేగుల్లోని సూక్ష్మజీవుల కూర్పుతో సంబంధం కలిగి ఉన్నట్లు పరిశోధనలో వెల్లడైంది. గట్ బ్యాక్టీరియాపై ఇప్పటివరకు జరిగిన అనేక పరిశోధనలు జంతువులపై నిర్వహించినవే. అందువల్ల వాటి ఫలితాలను నేరుగా మనుషులకు వర్తింపజేయలేమని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. అలాగే ఒక వ్యక్తికి ఆరోగ్యకరంగా ఉండే పేగు బ్యాక్టీరియా కూర్పు మరొక వ్యక్తికి కూడా అదే విధంగా ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పలేం. అయినప్పటికీ గట్ మైక్రోబయోటా మన ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుందనే ఆధారాలు క్రమంగా పెరుగుతున్నాయి.



స్వీడన్‌లోని ల్యాండ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు రక్తంలో ఉండే ఏ మెటాబోలైట్లు ఊబకాయంతో సంబంధం కలిగి ఉన్నాయో తెలుసుకునేందుకు అధ్యయనం నిర్వహించారు. అలాగే ఊబకాయంతో సంబంధం ఉన్న ఈ మెటాబోలైట్లు మల నమూనాల్లో కనిపించే పేగు బ్యాక్టీరియా కూర్పుతో ఏమైనా సంబంధం కలిగి ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. ఈ పరిశోధనలో 674 మంది పాల్గొన్నవారి రక్త ప్లాస్మా, మల నమూనాలను విశ్లేషించారు. వారి బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ)తో సంబంధం ఉన్న 19 రకాల మెటాబోలైట్లను పరిశోధకులు గుర్తించారు. వీటిలో గ్లుటమేట్, అలాగే బ్రాంచ్డ్-చైన్, అరోమాటిక్ అమైనో ఆమ్లాలు (బీసీఏఏ) ఊబకాయంతో అత్యంత బలమైన సంబంధాన్ని కలిగి ఉన్నట్లు గుర్తించారు. ఊబకాయంతో సంబంధం ఉన్న ఈ మెటాబోలైట్లు పేగుల్లోని నాలుగు రకాల బ్యాక్టీరియాలతో కూడా సంబంధం కలిగి ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. వీటిలో బ్లాటియా, డోరియా, రూమినోకాకస్ అనే బ్యాక్టీరియాలు లాక్నోస్పిరేసీ కుటుంబానికి చెందినవి కాగా, ఎస్‌హెచ్‌ఏ98 మరో రకమైన బ్యాక్టీరియాగా గుర్తించారు. బీఎంఐలో కనిపించిన తేడాలకు ప్రధానంగా గ్లుటమేట్, బీసీఏఏ స్థాయిల్లోని వ్యత్యాసాలు కారణమయ్యే అవకాశం ఉందని పరిశోధకులు పేర్కొన్నారు. దీనివల్ల రక్తంలోని మెటాబోలైట్లు, పేగుల్లోని బ్యాక్టీరియా ఒకదానితో ఒకటి పరస్పర సంబంధం కలిగి ఉంటాయని అర్థమవుతోంది. అవి పూర్తిగా స్వతంత్రంగా పనిచేయవని పరిశోధన సూచించింది.

## ఆ నొప్పిని... ఈ కాఫీ తగ్గించేనా?



పీరియడ్ సమయం చాలామంది అమ్మాయిలకి సవాలే. నొప్పి, అలసట, మూడ్ స్వింగ్స్, రుచులవైపు మనసు లాగడం... కనిపించే జాబితా పెద్దదే. వీటన్నింటికీ నెట్టింట ఈ మధ్య ఓ పరిష్కారం కనిపిస్తోంది. అదే... ఘీ(నెయ్యి) కాఫీ! నిజంగా మంచిదేనా? నిపుణులేమంటున్నారంటే... పాలు చేర్చని బ్లాక్ కాఫీకి ఒకట్రెండు స్పూన్ల నెయ్యిని కలుపుతారు. నచ్చితే కాస్త చక్కెర లేదా తీపినిచ్చేదేదైనా చేర్చుకుంటారు. దాల్చిన చెక్క పొడి, వెనీలా ఎక్స్‌ట్రాక్ట్ కలుపుకొనే వారూ లేకపోలేదు. బ్లాక్ కాఫీలో కెఫీన్ అధిక మోతాదులో ఉంటుంది. సాధారణంగా నెలసరి సమయంలో చాలామందికి అలసటగా అనిపిస్తుంది కదా! కెఫీన్ ఉత్సాహంతో పాటు ఫోకస్ పెరగడంలోనూ సాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లూ ఎక్కువే! శరీరాన్ని ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి బయట పడేస్తాయి. ఓ మెడికల్ జర్నల్ కథనం ప్రకారం... కాఫీలోని కొన్ని గుణాలతో తల నొప్పి, నెలసరి నొప్పులూ తగ్గుతాయట. అయితే పరిమితంగానే తీసుకోవాలి. ఇక, నెయ్యి... దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి హార్మోన్ల ఉత్పత్తికీ, ఆరోగ్యానికీ మేలు చేస్తాయి. తక్షణ శక్తినీ ఇస్తాయి. సాధారణంగా నెలసరిలో ఆకలి అనిపించదు. నెయ్యి జీర్ణప్రక్రియను వేగవంతం చేసి, ఆకలిని కలిగిస్తుంది. అలానూ అలసట దూరమవుతుంది. అంటే... రెండింటిలోని గుణాలూ మేలు చేసేవే. కెఫీన్, ఫ్యాట్స్ శక్తిని కలిగిస్తాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు నొప్పినే కాదు, నెలసరిలో కలిగే అసౌకర్యాన్నీ తగ్గిస్తాయి. కాఫీ సెరటోనిన్ ఉత్పత్తికీ సాయపడుతుంది. దీంతో సహజంగానే మూడ్ బాగవుతుంది. నెయ్యి శక్తినిస్తుంది కాబట్టి, శక్తిస్థాయుల్లో హెచ్చుతగ్గులుండవు. ఇక, మూడ్ స్వింగ్స్‌కీ చెక్ పడినట్లే. కాఫీ డీహైడ్రేషన్‌కి గురిచేసేదే. అయితే నెయ్యిని చేర్చినప్పుడు లిపిడ్ శోషణ బాగా జరుగుతుంది. దీంతో హైడ్రేటెడ్‌గా ఉండటంలో సాయపడుతుంది. అలా నెలసరిలో ఉండే చిక్కులన్నింటికీ కలిపి చెక్ పెడతాయి. కాబట్టే, మెచ్చుతున్నారంతా. అయితే పరిమితంగానే తీసుకోవాలి అంటారు నిపుణులు.

## జుట్టు ఆరోగ్యానికి.. అవిసె గింజల ప్యాక్!



గింజల్లో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు చర్మం, కుదుళ్ల ఆరోగ్యానికి మేలు చేసే కొలాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో జుట్టు, కుదుళ్ల ఆరోగ్యానికి అవిసె గింజల హెయిర్‌ప్యాక్ ఉపయోగపడుతుందంటున్నారు. కావాల్సినవి..

అవిసె గింజలు : ఒక కప్పు

నీళ్లు : ఆరు కప్పులు

కొబ్బరి నూనె : ఐదు టీస్పూన్లు,

తయారీ.. ఒక కప్పు అవిసె గింజలకు ఆరు కప్పుల నీళ్లు చేర్చి బాగా మరిగించాలి. నీళ్లు సగానికి రాగానే స్టౌ మీద నుంచి దించి చల్లారనివ్వాలి. పూర్తిగా చల్లారాక ఆ నీళ్లు జెల్‌లా మారడం గమనించవచ్చు. ఇప్పుడు ఒక పల్చటి శుభ్రమైన క్లాత్ తీసుకొని, ఆ మిశ్రమాన్ని వడగట్టాలి. దీనికి ఐదు టీస్పూన్ల కొబ్బరి నూనెను చేర్చి బాగా కలపాలి. హెయిర్ ప్యాక్ వేసుకునే ముందు జుట్టు శుభ్రంగా, పొడిగా ఉండాలి. జుట్టుని సన్నని పాయలుగా విడదీస్తూ, హెయిర్ ప్యాక్ కోసం తయారు చేసుకున్న జెల్‌ని కుదుళ్ల నుంచి వెంట్రుకల చివర్ల వరకు పట్టించాలి. నెమ్మదిగా మునివేళ్లతో ఒక పది నిమిషాల పాటు కుదుళ్లను మసాజ్ చేసి, గంటపాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి. ఈ హెయిర్ ప్యాక్ జుట్టు పెరగడానికి తోడ్పడటమే కాకుండా హెయిర్ కండిషనర్‌గానూ పని చేస్తుందంటున్నారు నిపుణులు.

## గాయాలు, నొప్పులను తగ్గించే దివ్యౌషధం పసుపు..

కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, క్రీడల సమయంలో కలిగే గాయాల వల్ల వచ్చే ఇబ్బందులను తగ్గించేందుకు చాలాకాలంగా పసుపును సహజ ఔషధంగా ఉపయోగిస్తున్నారు. భారతీయ వంటగదిలో సాధారణంగా కనిపించే ఈ మసాలాకు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, ఔషధ గుణాలు ఉన్నాయని పలు పరిశోధనలు సూచించాయి. తాజాగా వచ్చిన ఓ అధ్యయనం ప్రకారం.. క్రీడల వల్ల కలిగే కొన్ని గాయాల నొప్పిని తగ్గించడంలో పసుపులోని క్రియాశీల పదార్థం కర్కుమిన్ ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడైంది. యురోపియన్ రివ్యూ ఫర్ మెడికల్ అండ్ ఫార్మకాలాజికల్ సైన్సెస్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో, పసుపులో ఉండే కర్కుమిన్ గాయాల వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పరిశోధకులు గుర్తించారు. దాదాపు మూడు వారాల కంటే తక్కువ వ్యవధిలోనే కర్కుమిన్ తీసుకున్న రగ్బీ క్రీడాకారుల్లో నొప్పి, అసౌకర్యం తగ్గినట్లు అధ్యయనం పేర్కొంది. ఈ ప్రభావం పారాసిటమాల్, ఐబుప్రోఫెన్ వంటి సాధారణ నొప్పి నివారణ మందులతో పోల్చదగినదిగా ఉన్నట్లు వెల్లడించింది. ఈ పరిశోధన కోసం ఇటలీలోని మిలాన్ నగరానికి దక్షిణంగా ఉన్న పియాచెంజా క్లబ్‌కు చెందిన 50 మంది రగ్బీ క్రీడాకారులను పరిశీలించారు. వీరంతా ఎముకలు లేదా కండరాలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నవారు. పరిశోధకులు వారిని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక గ్రూపులోని క్రీడాకారులకు రోజుకు రెండుసార్లు ఒక గ్రాము కర్కుమిన్ ఎక్స్‌ట్రాక్ట్ టాబ్లెట్లను గరిష్ఠంగా 10 రోజుల పాటు ఇచ్చారు. మరో గ్రూపులోని వారికి నొప్పి నివారణ మందులను అందించారు. ఈ రెండు గ్రూపులను పరిశీలించిన తర్వాత, కర్కుమిన్ తీసుకున్నవారిలో గాయాల వల్ల కలిగే నొప్పి, అసౌకర్యం తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు. పసుపుకు పసుపు రంగును అందించే కర్కుమిన్ దాని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలకు ప్రధాన కారణంగా భావిస్తారు. శరీరంలో వాపును తగ్గించడంలో ఇది సహాయపడే అవకాశం ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందువల్ల తీవ్రమైన శారీరక శ్రమతో సంబంధం ఉన్న ఎముకలు, కండరాల సమస్యల్లో కర్కుమిన్ ఆధారిత సహజ ఉత్పత్తులు నొప్పిని తగ్గించేందుకు ఉపయోగపడే అవకాశం ఉందని పరిశోధకులు పేర్కొన్నారు. కర్కుమిన్‌ను కీళ్ల వాపు, ఆర్థరైటిస్, గుండె సంబంధిత సమస్యలు, ఇతర ఆరోగ్య పరిస్థితుల్లో సహజ పరిష్కారంగా ఉపయోగించవచ్చనే ఆసక్తి చాలాకాలంగా ఉంది. అయితే ఈ అధ్యయనంలో ప్రధానంగా క్రీడాకారుల్లో ఎముకలు, కండరాలకు సంబంధించిన సమస్యలు, వాటి వల్ల కలిగే నొప్పిపైనే దృష్టి పెట్టారు. కర్కుమిన్ తీసుకున్నవారు సూచించిన చికిత్సను కొనసాగించే అవకాశం కూడా ఎక్కువగా ఉన్నట్లు ఈ అధ్యయనం వెల్లడించింది. అయితే పసుపు లేదా కర్కుమిన్‌ను సాధారణ నొప్పి నివారణ మందులకు ప్రత్యామ్నాయంగా స్వయంగా ఉపయోగించడం కంటే, వైద్యుల సలహాతో తీసుకోవడం మంచిది. గతంలో జరిగిన కొన్ని పరిశోధనలు పసుపులోని కర్కుమిన్ జ్ఞాపకశక్తి, డిప్రెషన్ వంటి అంశాలపై కూడా ప్రభావం చూపిస్తుందని సూచించాయి. అయితే ఈ పరిశోధన ప్రధానంగా క్రీడా గాయాలు, ఎముకలు, కండరాల నొప్పి, వాపు తగ్గింపుపైనే దృష్టి పెట్టింది.



## రెండో రోజూ నష్టాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి కారణంగా చమురు ధరలు పెరగడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. ఐటీ, రియాల్టీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో సూచీలకు నష్టాలు తప్పలేదు. ముఖ్యంగా టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ రాజీనామాతో టీసీఎస్ షేర్లు 4 శాతానికి పైగా కుంగాయి.సెన్సెక్స్ ఉదయం 78,263.33 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,154.25) లాభాల్లో మొదలై.. ఆరంభంలోనే నష్టాల్లోకి జారకుంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,497.93 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరికి 187.90 పాయింట్లు కోల్పోయి 77,966.35 వద్ద ముగిసింది. నిఫ్టీ 35.75 పాయింట్లు పతనమై 24,435.95 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.33 వద్ద ఉంది.




# చంద్రశేఖరన్ ఎఫెక్ట్.. 6% కుంగిన టీసీఎస్ షేర్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. చమురు ధరలు పెరగడంతో పాటు టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఆ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించడం మార్కెట్ సెట్‌మెంట్‌ను దెబ్బతీసింది. దీంతో దేశీయ మార్కెట్ సూచీలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. 12.30 గంటల సమయంలో సెన్సెక్స్ 613 పాయింట్లు పతనమై 77,540.94 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 190 పాయింట్లు క్షీణించి 24,279 వద్ద ట్రేడవుతోంది. ఎన్.చంద్రశేఖరన్ నిర్ణయంతో టాటా కంపెనీ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. (Tata Group stocks). ఆయన పునర్నియామకం ఉండకపోవడంతో టాటా



గ్రూప్ కంపెనీల షేర్లు క్షీణించాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీస్ (TCS) షేర్లు దాదాపు 6 శాతం వరకు కుంగి ఓ దశలో రూ.2,301.10 వద్ద కనిష్ఠానికి పడిపోయాయి. 12.41 గంటల సమయంలో బీఎస్ఈలో రూ. 2332.35 వద్ద కొనసాగుతోంది. టాటా మోటర్స్ ప్యాసెంజర్ షేర్లు కూడా 4.11 శాతం పతనమయ్యాయి. టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ షేర్లు, టాటా పవర్ కంపెనీ షేర్లు కూడా దాదాపు 3 శాతం వరకు క్షీణించి నష్టాల్లో ట్రేడవుతున్నాయి. కాగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అత్యంత విలువైన కంపెనీలో ఒకటిగా ఉన్న విషయం తెలిసిందే.

# ఇంటర్న్‌గా వచ్చి.. 40ఏళ్లుగా ఒకే కంపెనీలో..



ఓ సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి టెక్నాలజీ మీద ఆసక్తితో కార్పొరేట్ రంగంలో అడుగుపెట్టారు. సాధారణ ఉద్యోగిగా తన ప్రయాణాన్ని మొదలుపెట్టి.. 'టాటా గ్రూప్'లో దిగ్గజ నాయకుడిగా చెరగని ముద్ర వేశారు. ఇప్పుడు అనూహ్య పరిణామాలతో తన పదవిని వీడుతున్నారు. టాటా సన్స్ (Tata Sons) ఛైర్మన్ పదవి నుంచి నటరాజన్ చంద్రశేఖరన్ (N Chandrasekaran) వైదొలుగుతున్న నేపథ్యంలో ఆయన ప్రస్థానాన్ని ఓసారి చూస్తే..

తమిళనాడులోని మోహనూర్ అనే చిన్న గ్రామంలో ఓ వ్యవసాయ కుటుంబంలో చంద్రశేఖరన్ 1963లో జన్మించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఆయన.. ఆ తర్వాత కోయంబత్తూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి అప్లైడ్ సైన్సెస్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం ప్రోగ్రామింగ్, టెక్నాలజీ మీద ఇష్టంతో ఎంసీఏ పట్టా పొందారు. 1987లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS)లో ఇంటర్న్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి 40 ఏళ్ల పాటు ఆయన ఇదే కంపెనీలో కొనసాగుతూ వచ్చారు. సాధారణంగా కార్పొరేట్ రంగంలో ఉద్యోగులు మూడు, నాలుగేళ్లకు కంపెనీలు మారుతుంటారు. కానీ, చంద్రశేఖరన్ మాత్రం దశాబ్దాల పాటు ఒకే కంపెనీలో ఉంటూ టాటా పట్ల తన అనుబంధాన్ని చాటుకున్నారు. తన సుదీర్ఘ ప్రయాణంలో చంద్రశేఖరన్ కంపెనీలో అంచలంచెలుగా ఎదిగారు. 2007లో టీసీఎస్ బోర్డు సభ్యుడిగా, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఆ తర్వాత రెండేళ్లకే అంటే 2009లో టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పుడు చంద్రశేఖరన్ వయసు 46 ఏళ్లు. టాటా గ్రూప్ (Tata Group)లో సీఈఓ పగ్గాలు అందుకున్న అతి పిన్న వయస్కుడిగా ఆయన గుర్తింపు పొందారు.

2009లో చంద్రశేఖరన్ టీసీఎస్ బాధ్యతలు అందుకున్నప్పుడు కంపెనీ కష్టకాలంలో కొనసాగుతోంది. ఆర్థిక మాంద్యం దెబ్బతో కుదేలైన ఈ ఐటీ సంస్థను.. చంద్రశేఖరన్ తన నాయకత్వంలో ఆర్థిక విపత్తు నుంచి బయటపడేశారు. కంపెనీ ఆదాయన్ని భారీగా పెంచడంలో విశేష కృషి అందించారు. ఆయన నాయకత్వంలో కంపెనీ వార్షిక ఆదాయం 20 బిలియన్ డాలర్ల మార్క్‌ను అందుకుంది. దేశంలో అత్యంత విలువైన టెక్ కంపెనీగా అవతరించింది. సైరస్ మిస్త్రీ–టాటాల వివాదం తర్వాత.. టాటా గ్రూప్ పలు సవాళ్లను ఎదుర్కొంది. ఆ సమయంలో టాటా సన్స్ ఛైర్మన్ పగ్గాలను అందుకున్నారు చంద్రశేఖరన్. 2016 అక్టోబరులో టాటా సన్స్ బోర్డులో చేరిన ఆయన.. 2017లో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. టాటా కుటుంబం నుంచి కాకుండా.. ఈ పదవి చేపట్టిన తొలి వ్యక్తి, పార్సీయేతర వ్యక్తిగా నిలిచారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వాన్ని గుర్తించి.. 2022లో రెండో దఫా కూడా ఛైర్మన్ బాధ్యతల్లో కొనసాగించారు. దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటాకు చంద్రశేఖరన్ అత్యంత సన్నిహితుడు.

చంద్రశేఖరన్ హయాంలో టాటా గ్రూప్ కొత్త వ్యాపారాల్లోకి అడుగుపెట్టింది. సెమీకండక్టర్ తయారీ, టాటా డిజిటల్ ఓమ్ని ఛానల్ ప్లాట్‌ఫాం టాటా న్యూ ప్రారంభంతో పాటు ఎలక్ట్రానిక్స్, నిత్యావసరాలు, ఫార్మసీ, ఫ్యాషన్ సంస్థల కొనుగోళ్లను చేపట్టారు. ఆయన నాయకత్వంలో గుర్తుండిపోయే ఘట్టం.. ఎయిరిండియాను ప్రభుత్వం నుంచి మళ్లీ టాటాల చేతుల్లోకి తీసుకురావడం. ఇందులో ఆయన కీలక పాత్ర పోషించారు. 2022లో ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత.. ఎయిరిండియా–విస్తారాను విలీనం చేసి ఏవియేషన్ రంగంలో కంపెనీని మరింత విస్తరించారు. చంద్రశేఖరన్ నేతృత్వంలో టాటా గ్రూప్ ఆదాయం రెండింతల వరకు పెరగ్గా.. నికర లాభం, మార్కెట్ విలువ మూడింతలకు పైగా పెరగడం విశేషం.

కార్పొరేట్ నాయకుడిగా టెక్ ప్రపంచానికి ఎంతగానో సుపరిచితుడైన చంద్రశేఖరన్.. ఓ మారథాన్ రన్నర్ అని అతి కొద్ది మందికి మాత్రమే తెలుసు. 40 ఏళ్ల వయసులో మధుమేహం బారిన పడటంతో ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టిన ఆయన వైద్యుల సలహాతో రన్నింగ్‌ను ప్రారంభించారు. బోస్టన్, న్యూయార్క్, లండన్, ముంబయి వంటి నగరాల్లో పలు మారథాన్లను పూర్తిచేశారు. వ్యాపార, పారిశ్రామిక రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గాను భారత ప్రభుత్వం 2022లో చంద్రశేఖరన్‌ను పద్మభూషణ్‌తో సత్కరించింది.

# మరోసారి ఒరాకిల్ లేఆఫ్‌లకు సిద్ధం




కృత్రిమ మేధ విస్తృత వినియోగం కారణంగా మొన్నటి వరకు ఉద్యోగాలు పోగా.. ఆ టెక్నాలజీకి పెట్టిన ఖర్చును పూడ్చుకోవడం కోసం మరికొంత మంది సిబ్బందిని తొలగించుకునేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ ఇప్పుడు ఆ బాటలోనే నడుస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నెలలో మరోసారి భారీసంఖ్యలో లేఆఫ్‌లు ప్రకటించనుందని తెలుస్తోంది. ఏఐ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకునేందుకు డేటా సెంటర్ల నిర్మాణం, ఏఐ చిప్‌లను కొనుగోలు చేయడం, ఓపెన్ ఏఐ వంటి ఏఐ క్లయింట్లకు మద్దతు ఇచ్చేందుకు ఒరాకిల్ భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఇప్పుడు ఆ ఖర్చును భర్తీ చేసుకునేలా ఉద్యోగులను తగ్గించుకోవాలని చూస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఆ సంఖ్య ఎంతనేది మాత్రం వెల్లడికాలేదు. సెప్టెంబర్ ఒకటి నుంచి రెండో త్రైమాసికం ప్రారంభం కావడానికి ముందే ఈ కోతలు అమలు చేయాలని భావిస్తోంది. కొన్ని బృందాల్లో కోతలు డబుల్ డిజిట్‌లో ఉండనున్నట్లు సమాచారం. గతంలోనూ ఒరాకిల్ (Oracle) ఉద్యోగుల సంఖ్యను తగ్గించింది. 12 నెలల్లో 21వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు జూన్ నెలలో రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. సంస్థ కార్యకలాపాల్లో కృత్రిమ మేధను భాగం చేయడంతో ఉద్యోగులను తగ్గించుకోవాల్సి వచ్చిందని, భవిష్యత్తులోనూ ఈ కోతలు కొనసాగుతాయని నాడే పేర్కొంది.

# ఆరో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్



ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనదేశం ఉందని రాజ్యసభకు ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌధ్రీ లిఖితపూర్వకంగా తెలిపారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) 2026 ఏప్రిల్‌లో విడుదల చేసిన 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' నివేదికలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి భారతదేశ నామినల్ జీడీపీ 4.15 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.394.25 లక్షల కోట్లు) అని పేర్కొందని.. ఈ ప్రకారం మనది ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని వివరించారు. మనదేశాని కంటే ముందు అమెరికా 32.38 ట్రి.డా., చైనా 20.85 ట్రి.డా., జర్మనీ 5.45 ట్రి.డా., జపాన్ 4.38 ట్రి.డా., యునైటెడ్ కింగ్‌డమ్ 4.26 ట్రి.డా. ఉన్నాయి. ఐఎంఎఫ్ ర్యాంకింగ్‌లు అమెరికా డాలర్ మారకపు రేట్ల ఆధారంగా లెక్కించే నామమాత్రపు జీడీపీపై ఆధారపడి ఉంటాయి. ఆర్థిక వృద్ధి, మారకపు రేట్లు, ధరల్లో మార్పులు, జాతీయ గణాంకాల సవరణలు, ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థల పరిమాణం, వృద్ధిలో మార్పులు వంటి వివిధ అంశాలు కలయికతో ఆర్థిక వ్యవస్థల సాపేక్ష ర్యాంకింగ్‌లలో మార్పులు వస్తుంటాయి' అని మంత్రి వెల్లడించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం విస్తృత స్థాయి వ్యూహాన్ని అనుసరించిందని పేర్కొన్నారు. ఎఫ్‌పీఐల విక్రయాలు రూ.29.8 లక్షల కోట్లు: నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) గణాంకాల ప్రకారం, దేశీయ ఈక్విటీ మార్కెట్లలో 2026 జనవరి నుంచి ఆగస్టు 5 వరకు విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐల) స్థూల విక్రయా లు రూ.29.8 లక్షల కోట్లుగా నమోదయ్యాయని మంత్రి తెలిపారు. బ్యాంకు ల నిరర్థక ఆస్తులు తగ్గుతున్నాయ్: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీల) స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏలు) గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో తగ్గుతూ వస్తున్నాయని పంకజ్ వెల్లడించారు.




## భారత్‌తో తొలి టెస్టు.. జట్టును ప్రకటించిన శ్రీలంక




శ్రీలంక, భారత్ మధ్య ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభంకానుంది. గాలె వేదికగా తొలి టెస్టు జరగనుండగా.. ఈ నెల 23 నుంచి కొలంబోలో రెండో టెస్టు మొదలుకానుంది. ఈ నేపథ్యంలో తొలి టెస్టు కోసం శ్రీలంక బుధవారం 16 మందితో జట్టును ప్రకటించింది. ధనంజయ డి సిల్వా కెప్టెన్సీ బాధ్యతలు చూసుకుంటాడు. కమిందు మెండిస్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఈ జట్టులో అనుభజ్ఞులతోపాటు టీమ్‌ఇండియాతో వార్మప్ మ్యాచ్‌లో ఆకట్టుకున్న పలువురు ఆటగాళ్లకు చోటు కల్పించారు. భారత్‌తో జరిగే మొదటి టెస్ట్ కోసం శ్రీలంక జట్టు: ధనంజయ డి సిల్వా, లాహిరు ఉదానా, నిషాన్ మదుష్క, కమిందు మెండిస్, దినేశ్ చండిమాల్, పసిందు సూర్యబండార, సోనాల్ దినుషా, నిరోషన్ డిక్వెల్లా, రమేశ్ మెండిస్, ప్రబాత్ జయసూర్య, కేసర నువాంత, మిలన్ రత్నాయకే, అసిత ఫెర్నాండో, లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, దిల్షన్ మధుశంక.

# ఇటీవలే క్రికెట్‌కు గుడ్‌బై.. కొత్త పాత్రలోకి అజింక్య రహానే




భారత మాజీ క్రికెటర్ అజింక్య రహానే కొత్త పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యాడు. ఇటీవలే క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. టీమ్‌ఇండియా తరఫున పదిహేనేళ్లపాటు క్రికెట్ ఆడాడు. ఐపీఎల్‌లోనూ ప్రాతినిధ్యం వహించాడు. ఆటకు గుడ్ బై చెప్పిన తర్వాత ఏం చేస్తాడనేదానికి సమాధానం దొరికింది. మరో మూడు రోజుల్లో శ్రీలంక – భారత్ జట్ల మధ్య టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు వ్యాఖ్యాతగా అజింక్య రహానే వ్యవహరించనున్నాడు. ఈ మేరకు రహానే, సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్స్ సీఆర్‌వో, బిజినెస్ హెడ్ రాజేశ్ కౌల్ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. తమ కామెంట్రీ ప్యానల్‌లోకి రహానేను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు రాజేశ్ తెలిపారు. 'భారత్ – శ్రీలంక జట్ల మధ్య టెస్టు సిరీస్‌కు వ్యాఖ్యాతగా అరంగేంట్రం చేయనుండటం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది. క్రికెట్‌లో టెస్టు ఫార్మాట్‌కు తిరుగులేదు. భారత్ తరఫున కొన్నేళ్లు టెస్టు మ్యాచులు ఆడా. ఇప్పుడు ఆటను మరో కోణంలో చూడబోతున్నా. నా అనుభవాలు, ఆటలోని మలుపులను అభిమానుల ముందుకు తీసుకొస్తా. నా బ్రాడ్‌కాస్ట్ అనుభవం ఫ్యాన్స్‌ను అలరిస్తుందని అనుకుంటున్నా'' అని రహానే వెల్లడించాడు. గాయం కారణంగా వాషింగ్టన్ సుందర్‌ను శ్రీలంకతో తొలి టెస్టుకు ఎంపిక చేయలేదు. అయితే, కోలుకుని వస్తాడనే అంచనాలతో రెండో మ్యాచ్ స్క్వాడ్‌లో అవకాశం కల్పించింది మేనేజ్‌మెంట్. కానీ, రెండో టెస్టులోనూ అతడు ఆడే అవకాశాలు తక్కువేనని సమాచారం. ఇంకా పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించలేదని తెలుస్తోంది. ఆగస్టు 15 నుంచి గాలె వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఆగస్టు 23 నుంచి మొదలయ్యే రెండో మ్యాచ్‌కు కొలంబో వేదికగా నిలవనుంది.


# అఫ్గాన్‌తో భారత్ టీ20 సిరీస్ ఖరారు

వచ్చే నెలలో తమతో సిరీస్ ఆడేందుకు టీమ్‌ఇండియా వస్తుందని ఇప్పటి వరకూ ఆశలు పెట్టుకున్న బంగ్లాదేశ్ జట్టుకు షాక్ తగిలింది. బంగ్లా పర్యటనకు వెళ్లడం లేదని భారత్ పరోక్షంగా చెప్పింది. సెప్టెంబర్‌లో అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ షెడ్యూల్‌ను బీసీసీఐ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. నిన్న అఫ్గాన్ క్రికెట్ బోర్డు సీఈవో నసీబ్ ఖాన్ చెప్పినట్లుగానే దిల్లీ వేదికగా మూడు టీ20ల సిరీస్ జరగనుంది. అఫ్గాన్ జట్టుకు దిల్లీ హోం గ్రౌండ్‌గా వ్యవహరించనుంది. గత జూన్‌లో భారత్ – అఫ్గానిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్టు, మూడు వన్డేల సిరీస్ జరిగిన సంగతి తెలిసిందే.

తొలి టీ20: సెప్టెంబర్ 13
రెండో టీ20: సెప్టెంబర్ 15
మూడో టీ20: సెప్టెంబర్ 19

అఫ్గాన్ క్రికెట్‌కు మద్దతుగా ఉంటాం: మన్హాస్

''భారత క్రికెట్ బోర్డు ఎల్లవేళలా అఫ్గానిస్థాన్‌కు బాసటగా ఉంటుంది. అఫ్గాన్ క్రికెట్ వృద్ధి కోసం మద్దతు ఇస్తాం. అత్యున్నత స్థాయిలో పోటీపడేలా వారికి అవసరమైన సదుపాయాలను కల్పిస్తాం.



అందులో ద్వైపాక్షిక సిరీస్‌లూ ముఖ్యమైన భాగమే. నాణ్యమైన జట్లతో ఆడటం వల్ల వెలకట్టలేని అనుభవం వస్తుంది. భారత్‌తో టీ20 సిరీస్ కోసం అఫ్గానిస్థాన్‌ను ఆహ్వానిస్తున్నాం'' అని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తెలిపారు.

ఇరు జట్ల పోరు ఆసక్తికరం: దేవజిత్ సైకియా

''భారత్ వేదికగా అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు ఆతిథ్యం ఇస్తోన్న సిరీస్‌కు బీసీసీఐ మద్దతు ఇస్తోంది. మైదానంలో ఇరు జట్ల మధ్య పోరు చాలా ఆసక్తికరం. నాణ్యమైన క్రికెటర్లు ఉన్నారు. భారత్‌లోనూ అఫ్గాన్ ఆటగాళ్లకు అభిమానులు ఉన్నారంటే వారి ఆటతీరే కారణం. ఇటీవల ఒక టెస్టు, వన్డే సిరీస్ జరిగింది. మూడు ఫార్మాట్లలోనూ ఇరు జట్లు తలపడేందుకు ఉన్న అవకాశాలను ఏమాత్రం వదులుకోం'' అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు.

# అత్యాచారం కేసులో పోరెల్ అరెస్టు



బెంగాల్ వికెట్ కీపర్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ అత్యాచారం కేసులో అరెస్టయ్యాడు. పెళ్లి చేసుకుంటానన్న హామీతో తనతో శారీరక సంబంధం పెట్టుకున్న పోరెల్ మోసం చేశాడంటూ ఓ వైద్య విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు హుగ్లీ జిల్లా దమ్‌దమ్‌లోని తన నివాసంలో పోలీసులు అతణ్ని అరెస్టు చేశారు. పోరెల్‌కు బెయిల్ నిరాకరించిన చిన్సురా కోర్టు.. అతడిని మూడు రోజుల పోలీసు కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ''పోరెల్ మీద నమోదైన ఫిర్యాదును అనుసరించి కోర్టు ఆదేశాలతో అతడిని సోమవారం రాత్రి అరెస్టు చేశారు. మంగళవారం తనను కోర్టులో హాజరు పరిచారు'' అని హుగ్లీ ఎస్పీ కున్వర్ భూషణ్ సింగ్ మీడియాకు తెలిపారు. పోరెల్ మీద బాధితురాలు జూన్ 23న మొగ్రా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. తామిద్దరం మూడున్నరేళ్లుగా బంధంలో ఉన్నామని, పెళ్లి కూడా చేసుకోవాలనుకున్నామని.. కానీ పోరెల్ పెళ్లికి నిరాకరించాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. ఏడాదిన్నర కిందటే అభిషేక్‌కు, బాధితురాలికి మధ్య గొడవ జరిగి పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా.. అప్పుడు కేసు నమోదు కాలేదు. కానీ జూన్‌లో ఫిర్యాదు అనంతరం పోరెల్‌ను విచారించడానికి పోలీసులు పలుమార్లు ప్రయత్నించినా అతను అందుబాటులోకి రాలేదు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు అతణ్ని అరెస్టు చేయాల్సి వచ్చింది.

# హార్దిక్ పాండ్య డిమాండ్‌కు గుజరాత్ టైటాన్స్ నో..!

భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఐపీఎల్ భవితవ్యంపై రకరకాల కథనాలు వస్తున్నాయి. ముంబయిని వీడేందుకు హార్దిక్ మొగ్గు చూపుతున్నాడని.. కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌లో ఒక ఫ్రాంచైజీ తీసుకొనేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని వాటి సారాంశం. తాజాగా హార్దిక్ తన పాత జట్టు గుజరాత్ టైటాన్స్‌కు వెళ్తాడని ప్రచారం సాగుతోంది. తొలుత జీటీ కూడా అంగీకరించిందని.. అయితే, హార్దిక్ ఒక కండీషన్ పెట్టడంతోనే చర్చలు ఆగినట్లు తెలుస్తోంది. ''గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ కూడా హార్దిక్ తిరిగి రావడాన్ని స్వాగతించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తోనూ చర్చించింది. మళ్లీ పాండ్యను ట్రేడ్ చేసేందుకు అంగీకరించింది. అయితే, హార్దిక్ ఎప్పుడైతే 'కెప్టెన్సీ' షరతు విధించాడో.. ఫ్రాంచైజీ అందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. మేనేజ్‌మెంట్ కుదరదు అని చెప్పింది'' అని గుజరాత్ టైటాన్స్ వర్గాలు తెలిపాయి. మాత్రం ఇప్పటి వరకూ ఏ ఫ్రాంచైజీతో చర్చించలేదని అతడి సన్నిహితులు చెబుతున్నారు.



ఏదైనా సరే ముంబయి జట్టుకు సమాచారం ఇస్తాడని పేర్కొన్నారు. ''హార్దిక్ ఐపీఎల్‌లో ఇతర ఫ్రాంచైజీలతో చర్చలు జరపలేదు. ముంబయి కూడా ఎవరితోనూ ట్రేడ్ గురించి సంప్రదింపులు నిర్వహించలేదని చెప్పింది. ఏదైనా సరే ముంబయి ఫ్రాంచైజీకే హార్దిక్ తన అభిప్రాయం చెబుతాడు. అప్పటి వరకు ఎలాంటి ఊహాగానాలకు చోటు ఇవ్వొద్దు'' అని పాండ్య ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

వుదయం సినిమా

MOVIE TIME!

# ఘనంగా 'విశ్వనాథ్ & సన్స్' ప్రీ రిలీజ్

వుదయం సినిమా: తమిళ అగ్ర కథానాయకుడు సూర్య నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ & సన్స్'. ప్రతిభ గల దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. సహజమైన హాస్యం, సున్నితమైన భావోద్వేగాలతో




హృదయాన్ని హత్తుకునే కుటుంబ కథా చిత్రంగా 'విశ్వనాథ్ & సన్స్' ప్రేక్షకులను అలరించనుంది. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రం భారీ అంచనాల నడుమ ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అడుగు పెట్టనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లోని కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ప్రీ రిలీజ్ వేడుకను చిత్ర బృందం ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలో కథానాయకుడు సూర్య మాట్లాడుతూ.. "ఈ వేడుకకు విచ్చేసిన ఎమ్మెల్యే నవీన్ గారికి, మా సినీ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ధన్యవాదాలు. అలాగే, రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న నా అభిమానులు, వారి కుటుంబ సభ్యులకు నా నమస్కారం. 28 ఏళ్ళ నుంచి మీరు నాపై ఈ ప్రేమను చూపిస్తున్నారు. మీ వల్లే నేను ఈరోజు ఇలా ఉన్నాను. నాగవంశీ గారు, వెంకీ వల్లే ఇలాంటి మంచి సినిమా సాధ్యమైంది. ఈ సినిమాను మీరు థియేటర్లలో చూసి ఖచ్చితంగా ప్రేమిస్తారని నమ్ముతున్నాను. ఈ సినిమాకు ప్రారంభం నుంచి త్రివిక్రమ్ గారి ఆశీస్సులు ఉన్నాయి. ఆయన మాకు ఎప్పుడూ అండగా ఉన్నారు. త్రివిక్రమ్ గారు కుటుంబ విలువలతో కూడిన మంచి సినిమాలను, ఈ జనరేషన్ మెచ్చేలా అందించారు. త్రివిక్రమ్ గారిని వెంకీ స్ఫూర్తిగా తీసుకున్నారు. జీవీ ప్రకాష్ అద్భుతమైన సంగీతం అందించారు. వెంకీ, జీవీ కాంబినేషన్ లో ఇది హ్యాట్రిక్ అవుతుంది. డీఓపీ నిమిష్, ఆర్ట్ డైరెక్టర్ బంగ్లాన్, ఎడిటర్ నవీన్ ఇలా ప్రతి ఒక్కరూ సినిమా అద్భుతంగా రావడానికి కారణమయ్యారు. ఈ సినిమా కోసం నేను హైదరాబాద్ లో ఉన్న ఆరు నెలలను అసలు మరచిపోలేను. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైనది.

# 'ఇరుముడి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్

వుదయం సినిమా: మాస్ మహారాజా రవి తేజ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం ఆగస్టు 21న థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో అంచనాలను పెరుగుతున్నాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ



చిత్రం గ్లింప్స్ పాటలతో ఇప్పటికే చాలా ఆసక్తిని రేకెత్తించింది. ఇప్పుడు చిత్ర నిర్మాతలు తెలుగు, తమిళ భాషలలో విడుదల చేసిన థియేట్రికల్ ట్రైలర్‌తో ఉత్సాహాన్ని మరో మెట్టు పైకి తీసుకెళ్లారు. ట్రైలర్‌తో సినిమా కథలోని ప్రధాన అంశంపై స్పష్టత వచ్చింది. రవితేజ ఇందులో మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా కనిపించారు. భార్య, కూతురిని ఎంతో ప్రేమగా చూసుకునే వ్యక్తి. తన కుటుంబానికే కాదు.. ఊరిలోని ప్రతి అమ్మాయిని కూడా తన కూతురిలాగే భావిస్తాడు. వాళ్లకు ఏదైనా సమస్య వస్తే మాత్రం ఆయనలోని రక్షణ భావం కోపంగా మారుతుంది.ఈ పాత్రకు మరో కోణం ఉంది. రవితేజ పాత్రకు మద్యపానం అలవాటు ఉంటుంది. అదే సమయంలో ప్రతి ఏడాది అయ్యప్ప మాల వేసుకుంటాడు. మాల ధరించిన సమయంలో పూర్తిగా ప్రశాంతమైన, భిన్నమైన వ్యక్తిగా మారతాడు. ఇలాంటి విభిన్నమైన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి జీవితంలోకి వరుసగా అమ్మాయిల హత్యలు రావడంతో.. అసలు ఆ హత్యలకు కారణం ఎవరు? వాటిని అతను ఎలా అడ్డుకున్నాడు? అనేదే కథలో కీలకంగా కనిపిస్తోంది.శివ నిర్వాణ తన మార్క్ ఫ్యామిలీ ఎమోషన్స్‌ను యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలతో కలిపినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది.

# 'పళ్ళ బురుసు'లో మంచి ఎంటర్‌టైనర్



వుదయం సినిమా: అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తూ నిర్మిస్తున్న చిత్రం పళ్ళబురుసు. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మా, గోమతి రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

'పళ్ళ బురుసు' ఎలా మొదలైంది?మాది మహబూబ్‌నగర్ జిల్లా. అమ్మానాన్న ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. నాకు చిన్నప్పటి నుంచే సినిమాలంటే చాలా ఇష్టం. ఇంట్లో డాక్టర్ చదవని చెప్పారు.

**ఈ కథకు మీ స్వస్థలం నుంచి ఎలాంటి స్ఫూర్తి వచ్చింది?**

నేను మహబూబ్‌నగర్‌లోనే పుట్టాను. ఊర్లో జరిగే సంఘటనలు, అక్కడి పాత్రలను చాలా జాగ్రత్తగా పరిశీలించే వాడిని.

**సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్‌లను ఈ పాత్రలకు ఎంపిక చేయడానికి కారణం?**

–సుధాకర్ రెడ్డి గారు 'బలగం' సినిమాలో నటించారు. అయితే అందులో ఆయన కనిపించేది చాలా తక్కువ సమయం.

**సినిమా షూటింగ్ ఎక్కడ జరిగింది?**

–సిద్దిపేట లచ్చపేట ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. కథకు సరిపోయే లొకేషన్స్, సీన్స్ అక్కడ చాలా సహజంగా దొరికాయి. ఆ ప్రాంతాల ప్రజలు కూడా మాకు చాలా సపోర్ట్ చేశారు.

**ఈ కథకు ఏదైనా సంఘటన స్ఫూర్తిగా నిలిచిందా?**

–ఊర్లో చాలా విషయాలు చూశాను. చిన్న చిన్న విషయాల గురించి చాలా పెద్ద గొడవలు జరుగుతాయి. కాసేపు గొడవపడతారు, ఆ తర్వాత మళ్లీ కలిసిపోతారు. మనుషుల మధ్య ఉండే ఆప్యాయతలోనే చాలా మంచి కథలు ఉంటాయి. అలాంటి చిన్న సంఘటనను కూడా ఎంత అద్భుతంగా, మనసును హత్తుకునేలా చెప్పొచ్చో ఈ సినిమాలో మీరు చూస్తారు.

**నాగార్జున గారు సినిమా చూశారా?**

నాగార్జున గారు సినిమా చూసి చాలా హార్ట్ టచింగ్‌గా ఉందని అన్నారు. సినిమా డైలాగ్స్ చాలా బాగున్నాయని చెప్పారు. అదే సమయంలో ఎక్కడా బోర్ కొట్టకుండా సాగిపోయిందని అన్నారు.

**మీ ప్రీ–ప్రొడక్షన్ వర్క్ ఎలా ఉంటుంది?**

–నేను ప్రీ–ప్రొడక్షన్‌ను చాలా బాగా చేసుకుంటాను. షూటింగ్‌కు వెళ్లే ముందే స్క్రిప్ట్, ఆర్ట్ వర్క్, లొకేషన్స్ అన్నీ పక్కాగా చూసుకుంటాను. ఒక సన్నివేశానికి ఏం అవసరమో ముందే క్లారిటీగా ఉండేలా ప్లాన్ చేసుకుంటాను.

**పవన్ సిహెచ్ సంగీతం గురించి?**

–పవన్ చాలా టాలెంటెడ్. 'లవ్ స్టోరీ' పాటలు విన్న తర్వాత ఆయన పొటెన్షియల్ నాకు మరింత అర్థమైంది. ఈ కథ ఆయనకు చెప్పాను. కథ వినగానే చేస్తానని చెప్పారు. మ్యూజిక్ చాలా అద్భుతంగా వచ్చింది.

# "రోమాంచకం" సినిమా టైటిల్ సాంగ్ రిలీజ్

వుదయం సినిమా: బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా "రోమాంచకం". సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మరోవైపు ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ సక్సెస్ ఫుల్ గా కొనసాగుతున్నాయి. ఇప్పటికే "రోమాంచకం" సినిమా నుంచి రిలీజ్ చేసిన 'రాధా రమణ' సాంగ్ కు మ్యూజిక్ లవర్స్ నుంచి హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి టైటిల్ సాంగ్ ను రిలీజ్ చేశారు మేకర్స్. "రోమాంచకం" సినిమా టైటిల్ సాంగ్ ను మ్యూజిక్ డైరెక్టర్ వాసుకీ వైభవ్ మంచి బీట్, మెలొడీ కలిపి కంపోజ్ చేసి ఎనర్జిటిక్ గా పాడారు. ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ తను అలవోకగా రాయగల మెచ్యూర్డ్ లిరిక్స్ అందించారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే – 'ఈ లోకం ఎంతో కొత్తగా, మారిపోయో ఈ దినం, లోకంలో ఉందీ కేవలం నువ్వు నేను ఇద్దరం, గడియారం లేని సమయాలు, కొలమానం లేని సరదాలు, అంతా మనకు సొంతాలు, విసుగంటూ రాని విషయాలు, విషయాలే లేని వివరాలు, ఎంతో ఎంతో మధురాలు, ఇలా ఇలా మొదటిసారి మొదలయ్యిందే, రోమాంచకం, రోమాంచకం, రోమాంచకం, రోమాంచకం...' అంటూ ఫస్ట్ లవ్ లోని ఎగ్జైట్ మెంట్, ప్రేమికులు మాత్రమే ఫీలయ్యే క్యూట్ మూవ్ మెంట్స్ ను చూపిస్తూ ఈ పాటను బ్యూటిఫుల్ గా చిత్రీకరించారు.



# "మిస్సింగ్ మేఘన" మూవీ నుంచి సాంగ్

వుదయం సినిమా: బాబు ప్రొడ్యూసర్ గా, వాచస్పతి దర్శకత్వంలో రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రలో గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులు ముందుకు వస్తున్న



చిత్రం మిస్సింగ్ మేఘన. ఈ సందర్భంగా లెజెండరీ ప్రొడ్యూసర్ సురేష్ బాబు గారు మాట్లాడుతూ: ఫస్ట్ సింగిల్ పిల్ల పిల్ల పిల్ల సాంగ్ చాలా బాగుంది. మూవీ సక్సెస్ అవ్వాలని కోరుకుంటూ టీం కి ఆల్ ద బెస్ట్ చెప్పారు.దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ: ఇండియన్ ఫిలిం ఫీల్డ్ లో సురేష్ ప్రొడక్షన్స్ కి ఉన్న పేరు మనందరికీ తెలుసు. సురేష్ బాబు గారి చేతుల మీదుగా మా ఫస్ట్ లిరికల్ సాంగ్ లాంచ్ అవ్వడం చాలా హ్యాపీగా ఉంది. నన్ను నమ్మి నాకు అవకాశం ఇచ్చిన మా ప్రొడ్యూసర్ నరేష్ గారికి, కో ప్రొడ్యూసర్ శ్రీనివాస్ గారికి మమ్మల్ని ఎంతగానో సపోర్ట్ చేస్తున్న బెక్కం వేణుగోపాల్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ సినిమాలో అద్భుతమైన పాటలు అందించిన ఆర్. ఆర్. ధృవన్ గారికి, అలాగే ఈ పాట పాడిన మనందరి ఫేవరెట్ సింగర్ జావేద్ అలీ గారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.నిర్మాత నరేష్ గారు మాట్లాడుతూ: మా సినిమా ప్రారంభోత్సవం రామానాయుడు స్టూడియోలో జరిగింది. రామానాయుడు స్టూడియో అధినేత గోల్డెన్ హ్యాండ్ సురేష్ బాబు గారి చేతుల మీదుగా ఫస్ట్ సింగిల్ లాంచ్ అవ్వడం చాలా హ్యాపీగా ఉంది. మ్యూజిక్ డైరెక్టర్ ధృవన్ తో మాకు ఇది రెండో సినిమా. తంత్ర మ్యూజికల్ గా ఎంత సక్సెస్ అయిందో ఈ సినిమా కూడా అంతే సక్సెస్ అవుతుంది. ధృవన్ గారే రాసి మ్యూజిక్ అందించి, జావేద్ అలీ గారితో పాడించిన ఈ పాట మంచి సక్సెస్ అవుతుంది. అదే విధంగా ప్రేక్షకులు ఈ సినిమాని ఆదరించి మంచి సక్సెస్ అందిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

# 'సిగ్మా' నుంచి సెకండ్ సింగిల్



వుదయం సినిమా: లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ నిర్మిస్తున్న 'సిగ్మా' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దర్శకుడిగా జేసన్ సంజయ్ అరంగేట్రం చేస్తున్న ఈ చిత్రంలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ సిగ్మా స్టయిల్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఓలమ్మో వగలాడి సాంగ్ రిలీజ్ చేశారు. తమన్ ఎనర్జిటిక్ నెంబర్ ని కంపోజ్ చేశారు. యువన్ శంకర్ రాజా, సంజనా దివాకర్ కల్మంజే కలిసి ఆలపించిన ఈ పాట విన్నవెంటనే కనెక్ట్ అవుతుంది. కృష్ణ చైతన్య సాహిత్యం క్యాచిగావుంది.ఈ పాట లో సందీప్ కిషన్, ఫారియా అబ్దుల్లా మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. ఇద్దరి మధ్య ఉన్న ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ పాటకు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. మెలోడీతో పాటు ఎనర్జిటిక్ బీట్‌తో సాగుతున్న ఈ పాట సినిమాపై మరింత ఆసక్తినిపెంచుతోందిఈ చిత్రంలో రాజు సుం దరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు థాసన్, యోగ్ జాపీ తదితరులు కీలకపాత్రలు పోషి స్తున్నారు.ఈ చిత్రానికి థమన్ ఎస్ సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కె.ఎల్ ఎడిటింగ్, హరిహర సుధన్ విజువల్ ఎఫెక్ట్స్ సూపర్వైజర్‌గా పనిచేస్తున్నారు.

# 'అగధ' సాధిస్తుంది: దర్శకుడు ఎం.ఎస్. రాజు



వుదయం సినిమా: శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కేఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన చిత్రం 'అగధ'.

**'అగధ' అంటే ఏంటి?**

'అగధ' అని టైటిల్ పెట్టగానే చాలా మంది నెట్‌లో సర్చ్ చేశారు. అగధ అంటే లోతైన అంశం, ఓ శూన్యం అని చెప్పుకోవచ్చు. మనం దేవుడ్ని, దెయ్యాలను కంటితో చూడలేదు. అలాంటి ఫోర్స్‌లకు మధ్య జరిగే కథ 'అగధ'. ప్రస్తుతం సినిమాకి ఓపెనింగ్స్ తీసుకు వచ్చేది యూత్, మాస్ ఆడియెన్స్.

**'అగధ' కోసం మీరు చేసిన రీసెర్చ్ గురించి చెప్పండి?**

'అగధ' కోసం చాలా రీసెర్చ్ చేశాను. చాలా చోట్ల తిరిగాను. అవన్నీ కూడా ఆడియెన్స్‌కి అవసరం లేదు. ఇదొక ఆర్ట్ ఫిల్మ్‌లా కాకుండా అందరినీ రంజింపజేసేలా రూపొందించాను. నేను చూసిన రియాల్టీకి నా ఫ్యాంటసీని జోడించి ఓ మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వాలని తీశాను.

**మీరు సడెన్‌గా సినిమాల్ని నిర్మించడం ఆపేశారు.. ఎందుకు?**

'ఆట', 'మస్కా' మంచి చిత్రాలు. కమర్షియల్‌గా విజయాలు అందుకున్నాను. కానీ నా స్టాండర్డ్‌లో లేవు అని చాలా మంది అన్నారు. ఆ తర్వాత మా అబ్బాయి కెరీర్ మీద కూడా ఫోకస్ పెట్టాను.

**అగధ చిత్రం విజయంపై భారీ నమ్మకంతో ఉన్నారు?**

నేను ఇంత వరకు స్టేజ్ మీద అలా ఓపెన్‌గా సినిమా బాగుంది అని స్టేట్‌మెంట్ ఇవ్వలేదు. కానీ 'అగధ' చూసిన తర్వాత సినిమా బాగుంది, విజయం సాధిస్తుందని నా మనసుకి అనిపించింది.

**'అగధ' డిస్ట్రిబ్యూషన్ గురించి చెప్పండి?**

'అగధ'ని ముందు ఎవ్వరికీ ఇవ్వకూడదని అనుకున్నాం. ట్రైలర్ రిలీజ్ అయ్యాక చాలా మంది ఫోన్స్ చేశారు. కన్నడ నుంచి హోంబలే టీం సంప్రదించింది.

# 'హై' నుంచి ఫస్ట్ సింగిల్ ఫనా లాంచ్

వుదయం సినిమా: హిట్ మేకర్ అనిల్ రావిపూడి అసోసియేట్, అతని అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సహ రచయితగా పని చేసిన ఎస్ కృష్ణ 'హై' అనే ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రచయిత, నటుడు , సహ నిర్మాతగా కూడా పనిచేస్తున్నారు. ఇమేజ్‌స్పార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, మైరా క్రియేషన్స్ పై హరీష్ పెద్ది, ఎస్ కృష్ణ, శేఖర్ దివ్వెల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనన్య శర్మ, ఎస్ కృష్ణ, పల్లవి దొర, కృష్ణ కమల్, సాయి కృష్ణ, రేవంత్ (బుల్లిరాజు) ఈ చిత్రంలో ప్రధాన తారాగణం. ఇప్పటికే విడుదలైన టీజర్ కి అద్భుతమైనన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా 'హై' నుంచి ఫస్ట్ సింగిల్ 'ఫనా' లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. వికాస్ బడిస సంగీ తం అందించిన ఈ పాట ప్రేమలోని స్వచ్ఛమైన భావోద్వేగాన్ని సూఫీ మ్యూజిక్ టచ్ తో ఆకట్టుకుంటోంది. షహజాద్ అలీ ఆలపించిన ఈ పాటకు 'సరస్వతీపుత్ర' రామ జోగయ్య శాస్త్రి సాహిత్యం అద్భుతంగా వుంది.




Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.